ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 314 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | సోమవారం 9 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### వెండి వెలవెల..!
### మళ్లీ భారీగా తగ్గిన రేటు

బంగారం, వెండి ధరల పతనం సామాన్యులకు ఊరటనిస్తోంది. గత కొన్ని రోజులుగా అమాంత పెగిగిన ధరలు ఒక్కసారిగా దిగివస్తున్నాయి. ఇవాళ హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు కిలో వెండి ధరపై ఏకంగా రూ.20,000 వేలు తగ్గింది. ఈ పరిణామం కిలో వెండి ధర రూ.2,80,000 వద్దకు చేరుకుంది. గత రెండు రోజుల్లోనే వెండి ధర ఏకంగా రూ. 40,000 మేర క్షీణించడం ఇన్వెస్టర్లను, కొనుగోలుదారులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

### ఎల్‌ఐసి ఫలితాలు ఆకర్షణీయం

దేశంలోనే అతిపెద్ద జీవిత బీమా కంపెనీ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్‌ఐసి) ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో రూ.12,930 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.11,008 కోట్ల లాభాలతో పోల్చితే 17 శాతం వృద్ధిని సాధించింది. క్రితం క్యూ3లో ఈ ప్రభుత్వ రంగ దిగ్గజం నికర ప్రీమియం ఆదాయం 17 శాతం పెరిగి రూ.1.26



# బీజేపీ, బీఆర్ఎస్ రెండూ బొమ్మ-బొరుసులే

## ఉన్న జిల్లాలను తొలగించేది లేదు
## కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదు

- పురపాలిక ఎన్నికల నేపథ్యంలో భూపాలపల్లి జిల్లాలో సీఎం పర్యటన
- బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామంటూ హామీ
- సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదు
- సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉంది
- విపక్షాలపై తీవ్ర విమర్శలు చేసిన సీఎం

భూపాలపల్లి

భూపాలపల్లి జిల్లాను కాంగ్రెస్ రద్దు చేస్తుందని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్న సీఎం రేవంత్‌రెడ్డి ఉన్న జిల్లాలను తొలగించేది లేదని, కొత్త జిల్లాలను ఏర్పాటు చేసేది లేదని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. దీనిలో భాగంగా జిల్లాలోని గుణపురం మండలం చెల్పూర్ పరిధిలో బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. జిల్లాలను రద్దు చేసే ఆలోచన తనకు లేదని స్పష్టం చేశారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేయాలంతే ప్రజలతో చర్చించే చేస్తామని వెల్లడించారు. ఈ నేపథ్యంలో భూపాలపల్లి జిల్లా ఎక్కడికీ పోదు, ఎప్పటికీ కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయంపై కొందరికి విషం చిమ్మడమే పని అని విపక్షాలను విమర్శించారు. మెడికల్ బోర్డు విషయంలో విషం చిమ్మతే ఊరుకునేది లేదని ఉద్ఘాటించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు. సింగరేణి కార్మికుల వల్లే ప్రజాప్రభుత్వం అధికారంలో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్మికులకు - మిగతా3లో



# రోదసిలోనూ గూఢచర్యం

- భారత్‌కు ఇప్పుడు ఈ సత్తా కూడా ఉంది!
- అంతరిక్షంలో నిఘా సామర్థ్యం సాధించిన భారత్
- అహ్మదాబాద్‌కు చెందిన ప్రైవేట్ సంస్థ ఆజిస్టా అరుదైన ఘనత
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాన్ని ఫొటో తీసిన స్వదేశీ ఉపగ్రహం
- జాతీయ భద్రత, ఉపగ్రహాల రక్షణలో ఇది కీలక ముందడుగు
- భవిష్యత్తులో బాలిస్టిక్ క్షిపణుల ట్రాకింగ్ కూడా సాధ్యం

# నకిలీ వైద్యులపై వేటు!

- డాక్టర్లంతా అక్కడ నమోదు చేయాల్సిందే
- శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లకు ఇక క్రొకోడైల్ ఫెస్టివలే!
- రాష్ట్రంలో నకిలీ వైద్యుల ఆటకట్టించేందుకు సిద్ధమైన వైద్యశాఖ
- తప్పనిసరిగా టీఎంసీలో నమోదు చేయాల్సిందేనని ఆదేశం
- లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టీకరణ




హైదరాబాద్

జ్వరం, జలుబు, కాళ్ల నొప్పులు ఇలా అనారోగ్య సమస్య ఏదైనా ప్రజలు ముందుగా వెళ్లేది స్థానికంగా ఉన్న క్లినిక్‌లకే. తమ రోగాలను నయం చేస్తారనే ఓ నమ్మకంతో ప్రజలు వైద్యుడి వద్దకు చికిత్స కోసమని వెళ్లి, వాళ్లు అడిగినంత సమర్పించుకుంటుంటారు. అయితే అదే ఇప్పుడు పెద్ద తలనొప్పిగా మారింది. వైద్యం చేస్తున్నది నకిలీ డాక్టరా, నిజమైన వైద్యుడా అనేది ప్రజలు తెలుసుకోలేక పోతున్నారు. దీంతో వారి వద్దే వైద్య చికిత్స పొందాల్సి వస్తోంది. ఇలాంటి శంకర్‌దాదా ఎంబీబీఎస్‌ల ఆట కట్టించేందుకు తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైంది. హైదరాబాద్ నగరంలోని అన్ని ప్రైవేటు ఆస్పత్రులు, నర్సింగ్ హోంలలో పని చేస్తున్న ప్రతి వైద్యుడు తప్పనిసరిగా తెలంగాణ మెడికల్ కౌన్సిల్ - మిగతా3లో

### మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు..
# భారతీయులకు మేలు..

- మలేసియాలో రాబోయే యూపీఐ సేవలు వీపీఏ (వర్చువల్ పేమెంట్ అడ్రస్), లేదా క్యూఆర్ కోడ్, లేదా మొబైల్ నెంబర్ ద్వారా అందుబాటులోకి వస్తాయి
- బ్యాంక్ అకౌంట్లతో పని లేకుండా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు
- టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఈ సేవలకు భద్రత ఉంటుంది





# మార్చి 31కల్లా నక్సలిజం అంతం

- స్పష్టం చేసిన హోంమంత్రి అమిత్ షా
- వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయి
- కొన్నేళ్లుగా నక్సల్స్ కార్యకలాపాలు బలహీనంగా మారాయి
- ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ అధికారులు, భద్రతా దళాలతో ఈ సమావేశం జరిగింది

### బంగ్లాదేశ్ రాజకీయాల్లో శూన్యత..
## కనుమరుగవుతున్న మహిళా నేతలు!

- దశాబ్దాల పాటు ఇద్దరు మహిళలు పాలించిన బంగ్లాదేశ్ రాజకీయాల్లో శూన్యత
- రానున్న ఎన్నికల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య దారుణంగా పడిపోతున్న వైనం
- మతవాద శక్తుల నుంచి బెదిరింపులే ఇందుకు కారణమన్న వాదనలు
- షేక్ హసీనా ప్రవాసంలో ఉండగా, ఖలీదా జియా ఇటీవలే మరణం




### బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పేందుకు
# మూడు గంటలు పట్టిందా

- ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంపై కేటీఆర్
- మేమంతా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉండగా రేవంత్ రెడ్డి ఈ కుట్ర చేశారు
- ఓటుకు నోటు కేసు విచారణ న్యాయస్థానంలో తుది దశకు వచ్చింది
- చివరి దశలో ఆధారాలు మాయం చేయడానికి పన్నిన కుట్ర అని అనుమానం



హైదరాబాద్

ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం వెనుక కుట్ర ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డినే ల్యాబ్‌ను తగులబెట్టించాడని ప్రజలంతా భావిస్తున్నారని తెలిపారు. ఆధారాలు నాశనం చేసి కేసు నుంచి బయటపడాలని రేవంత్ రెడ్డి స్వయంగా కుట్ర పన్ని ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఆధారాలు లేపేసిందని విమర్శించారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో - మిగతా3లో



# క్లైమాక్స్‌కు పురపోరు

- వీధుల్లో హోరెత్తిస్తున్న నేతలు..
- మరి కొన్ని గంటల్లో మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వానికి తెరపడనుంది
- దీంతో అభ్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి
- ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అటు అధికార కాంగ్రెస్, ఇటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు అమీతుమీ తేల్చుకుంటున్నాయి
- సీఎం రేవంత్ రెడ్డి సుడిగాలి పర్యటనలు..
- కేటీఆర్, హరీష్ రావు వ్యూహ ప్రతివ్యూహాలు..
- బీజేపి అగ్రనేతల దూకుడుతో వీధులన్నీ హోరెత్తుతున్నాయి

హైదరాబాద్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం క్లైమాక్స్‌కు చేరుకుంది. సోమవారం సాయంత్రం ఐదు గంటలతో ఎన్నికల ప్రచార హోరు ముగియనుంది. రెండు వారాలుగా ప్రధాన పార్టీల ప్రచారపర్వం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. సాయంత్రంతో ప్రచారానికి తెరపడుతుండటంతో అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆఖరి ప్రయత్నాల్లో మునిగిపోయారు. ప్రచారానికి కొన్ని గంటల సమయం మాత్రమే మిగిలి ఉండటంతో అన్ని పార్టీల అగ్రనేతలు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. 5 నుంచి 6 మున్సిపాలిటీలను చుట్టేస్తూ సుడిగాలి ప్రచారంతో ఓటర్లను ఆకర్షించే - మిగతా3లో

## సంపాదకీయం

# ఎప్‌స్టీన్ ఫైల్స్.. అంతులేని కధ

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు ఇప్పుడు ఒక్కొక్క దేశాన్ని తాకుతున్నాయి.. అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ కేసులోని రహస్య పత్రాలను 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటున్నారు. ఇటీవల అమెరికా ప్రభుత్వం ఈ పత్రాలను బహిర్గతం చేయడంతో ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఎప్‌స్టీన్ అమెరికన్ బిలియనీర్. మైనర్ బాలికలను లైంగిక అక్రమ రవాణా చేసినట్లు నిర్ధరణ అయింది. 2019లో ఎప్‌స్టీన్ జైలులో ఉండగానే ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సేకరించిన కోర్టు పత్రాలు, సాక్ష్యాలు, విమాన ప్రయాణ వివరాలు, కాంటాక్ట్ లిస్టులను ప్రభుత్వం విడతల వారీగా విడుదల చేస్తూ వస్తోంది.అమెరికా, బ్రిటన్ ఇలా ఎన్నో దేశాలను వణికిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లోని కుబేరుల్ని సైతం షేక్ చేస్తున్న అంశం ఎప్‌స్టీన్ ఫైల్స్. చాలా ఏళ్లుగా ఈ విషయంలో చర్చ జరుగుతూనే ఉన్న.. ఇటీవల వరుసగా ఇందులోని విషయాలు బయటకు వచ్చాయి. అప్పటివరకు వీటి గురించి బహిరంగంగా మాట్లాడని సెలబ్రిటీలు, సెలబ్రిటీలు భార్యలు కూడా ఇప్పుడు మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఈ రొచ్చు బాలీవుడ్‌కి తాకింది. హిందీ సినిమాకు చెందిన ఇద్దరి పేర్లు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఉన్నాయంటూ ప్రచారం జరుగుతోంది. వారే దర్శక నటుడు అనురాగ్ కశ్యప్, దీపక్ చోప్రా. దీంతో ఇప్పుడు బాలీవుడ్‌లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది.ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ కశ్యప్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ పుకార్లు వచ్చాయి. వీటిపై అనురాగ్ కశ్యప్ స్పందించి ఖండించారు. "వక్తగా నాకు నెలకు చాలా ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. అయితే నా జీవితంలో ఇప్పటివరకూ బీజింగ్ వెళ్లలేదు" అని క్లారిటీ ఇచ్చేశారు. ఇక దీపక్ చోప్రా మాట్లాడుతూ నేనెప్పుడూ నేరపూరిత కార్యకలాపాల్లో భాగం కాలేదు. ఎప్‌స్టీన్‌తో నా పరిచయం పరిమితమైనది. వివాదాస్పద లైంగిక నేరాల ఘటనతో నాకు సంబంధం లేదు అని చెప్పేశారు.అయితే ఈ పత్రాల్లో ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తుల పేర్లు ఉండటం కలకలం రేపుతోంది. అయితే, ఒక వ్యక్తి పేరు ఈ ఫైల్స్‌లో ఉన్నంత మాత్రాన అతను నేరం చేసినట్లు కాదు. కొందరు కేవలం ఆయనకు తెలిసిన వారు, లేదంటే ఆయన విమానంలో ప్రయాణించిన వారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఫైల్స్‌ను పూర్తిగా విడుదల చేసేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఇటీవల సంతకం చేశారు. దీనివల్ల దాదాపు 30 లక్షల పేజీల డాక్యుమెంట్లు, 2 వేల వీడియోలు బయటకు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు ఇంకా చర్చ జరుగుతుం ప్రభుత్వాన్ని తాకాయి. ఇప్పటికే ఎప్‌స్టీన్‌తో సంబంధాలపై బిల్‌గేట్స్ స్పందించి.. బాధితులకు క్షమాపణలు చెప్పగా.. ఇప్పుడు బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ అందరికీ సారీ చెప్పారు. ముఖ్యంగా ఎప్‌స్టీన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయనే ఆరోపణలు ఎదుర్కొంటున్న పీటర్ మాండెల్సన్‌ను గతంలో అమెరికాకు బ్రిటన్ రాయబారిగా నియమించినందుకుగాను ఆయన పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. ఎప్‌స్టీన్ బాధితులకు జరిగిన అన్యాయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన ఈ క్షమాపణలు తెలిపారు.అమెరికాలో బ్రిటన్ రాయబారి వంటి అత్యంత కీలకమైన పదవిని పీటర్ మాండెల్సన్‌కు కట్టబెట్టడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. అయితే మాండెల్సన్ తనవద్ద అబద్ధాలు చెప్పి ఆ పదవిని దక్కించుకున్నారని ప్రధాని కీర్ స్టార్మర్ ఆరోపించారు. జెఫ్రీ ఎప్‌స్టీన్ తనకు అంతగా పరిచయం లేని వ్యక్తి అని, అతనితో ఎలాంటి లోతైన సంబంధాలు లేవని మాండెల్సన్ నమ్మించారని ప్రధాని వెల్లడించారు. ఆయన మాటలను నమ్మి చేసిన నియామకం ఇప్పుడు ప్రభుత్వానికి తలవంపులు తెచ్చిందని స్టార్మర్ అంగీకరించారు.పీటర్ మాండెల్సన్ 2024 డిసెంబరులో రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2008లోనే ఎప్‌స్టీన్ లైంగిక నేరాల కేసులో దోషిగా తేలినప్పటికీ.. మాండెల్సన్ ఆయనతో స్నేహాన్ని కొనసాగించినట్లు కొన్ని ఈమెయిల్స్, మరికొన్ని పత్రాలు బయటకు వచ్చాయి. ఇలా వీరిద్దరి మధ్య ఉన్న సంబంధంలోని చీకటి కోణాలు వెలుగులోకి రావడంతో స్టార్మర్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి పెరిగింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే గతేడాది సెప్టెంబరులో ప్రధాని కీర్ స్టార్మర్ పీటర్ మాండెల్సన్‌ను పదవి నుంచి తొలగించారు.అమెరికా ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మరిన్ని పత్రాలు మాండెల్సన్ చుట్టూ ఉచ్చును మరింత బిగించాయి. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం సమయంలో బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన కొన్ని అత్యంత సున్నితమైన సమాచారాన్ని మాండెల్సన్ ఎప్‌స్టీన్‌తో పంచుకున్నట్లు ఈ పత్రాలు తెలుపుతున్నాయి. దేశ ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఒక లైంగిక నేరగాడితో సమాచారాన్ని పంచుకోవడం బ్రిటన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. కేవలం స్నేహం మాత్రమే కాకుండా.. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు కూడా జరిగినట్లు ఆధారాలు లభ్యం అయ్యాయి.2003–2004 మధ్యకాలంలో పీటర్ మాండెల్సన్, ఆయన భాగస్వామి రీనాల్డో అవిలా ద సిల్వాకు సంబంధించిన బ్యాంకు ఖాతాలకు ఎప్‌స్టీన్ సుమారు 75 వేల డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 63 లక్షలకు పైగా) మేర చెల్లింపులు చేశాడని వెల్లడి అయింది. ఇంతటి నేర చరిత్ర ఉన్న వ్యక్తితో ఆర్థిక సంబంధాలు కలిగి ఉండి కూడా, రాయబారిగా కొనసాగడం బాధితులను మరింత ఆవేదనకు గురిచేసిందని ప్రధాని పేర్కొన్నారు.ఎప్‌స్టీన్ ఫైళ్లలో విడుదలైన నగ్న ఫోటోలు, వీడియోలు బ్లర్ చేయకుండా చాలా రోజులుగా ఆన్‌లైన్‌లో ఉన్నాయి. ఈ తప్పు గురించి అమెరికా అధికారులను ముందే హెచ్చరించినా, ఆ కంటెంట్ కొన్ని రోజుల పాటు ఆన్‌లైన్‌లోనే ఉండిపోయింది. దీంతో బాధితులకు భర్తీ చేయలేని నష్టం కలిగింది' అని న్యాయవాదులు అంటున్నారు.ఎప్‌స్టీన్ బాధితులైన అనేక మందిని గుర్తించగలిగే సమాచారం కలిగిన వేలాది పత్రాలలో భాగమని న్యాయవాదులు చెబుతున్న ఫైల్స్‌ను వెరిఫై పరిశీలించింది.ఎప్‌స్టీన్ ఫైళ్లలో భాగంగా దాదాపు 40 వేర్వేరు చిత్రాలు ప్రచురించారని న్యూయార్క్ టైమ్స్ శుక్రవారం రిపోర్ట్ చేసినటప్పుడు బాధితుల సంఘాలు మొదట ఈ విషయం గురించి మాట్లాడాయి.బాధితులు పేర్లు, చిత్రాలను సరిగ్గా సవరించే వరకు వెబ్‌సైట్‌ను మూసివేయాలని కోరిన తర్వాత, సమస్యను త్వరగా పరిష్కరించేందుకు న్యాయశాఖ అంగీకరించిందని మంగళవారం న్యూయార్క్ జడ్జ్ ఒకరు తెలిపారు."సాంకేతిక లేదా మానవ తప్పిదం" కారణంగా ఫైల్స్ అప్‌లోడ్ అయ్యాయని పేర్కొంటూ, న్యాయశాఖ తన వెబ్‌సైట్ నుంచి వేలాది పత్రాలను తొలగించింది . కొత్త అభ్యర్థనలను పరిశీలిస్తూనే ఉందని, అలాగే తదుపరి సవరణ అవసరమయ్యే ఇతర పత్రాలు ఏవైనా ఉన్నాయా అని తనిఖీ చేస్తున్నట్టు ఆ విభాగం తెలిపింది.అంతకుముందు రోజే రిడక్షన్ లోపాలను సరిచేస్తున్నట్లు అమెరికా ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, బుధవారం కూడా చాలా చిత్రాలు ఆన్‌లైన్‌లో ఉన్నాయని వెరిఫై గుర్తించింది. ఈ విషయంపై స్పందన కోసం న్యాయశాఖను సంప్రదించింది బీబీసీ వెరిఫై. రిడక్షన్ చేయని ఫైళ్ల పేర్లను కూడా ఇచ్చింది."జరిగిన నష్టం పూడ్చలేనిది" అని బాధితుల తరపు న్యాయవాది బ్రాడ్ ఎడ్వర్డ్స్ ఒక ప్రకటనలో తెలిపారు.వెరిఫై గుర్తించిన నాలుగు చిత్రాలలో పాక్షికంగా దుస్తులు ధరించిన యువతుల ముఖాలు, శరీరాలు బ్లర్ చేయకుండా కనిపించాయి.ప్రముఖులతో ఎప్‌స్టీన్ సంభాషణలకు సంబంధించిన ఆధారాల కోసం విడుదల చేసిన లక్షల కొద్దీ ఫైళ్లను సాధారణంగా శోధించినప్పుడు అవి కనిపించాయి.కొన్ని పత్రాలలో కొంతమంది ఫోటోలను తొలగించినట్లు కనిపిస్తోంది. కానీ మరోచోట తొలగించలేదు. ఒక పత్రంలో ఒకే చిత్రానికి రెండు వెర్షన్లు ఉన్నాయి. ఒక ఫోటోలో ముఖాన్ని నల్లరంగు చతురస్రంతో కప్పేశారు. మరొక చిత్రంలో ముఖం కనిపిస్తుంది.మరో వీడియోలో ఒకరు షర్ట్‌ను పైకెత్తి కెమెరా వైపు తన రొమ్ములను చూపిస్తున్నట్లు గుర్తించారు.

# విద్యారంగానికి జాకీర్ హుస్సేన్ విశిష్ఠ సేవలు



భారత దేశపు మొదటి ముస్లిం రాష్ట్రపతి, పదవిలో మరణించిన మొదటి భారత దేశ ప్రథమ పౌరులు జాకీర్ హుస్సేన్ (ఫిబ్రవరి 8, 1897 – మే 3, 1969). ఆయన మే 13 1967 నుండి మరణించినంత వరకు రాష్ట్రపతి పదవిలో ఉన్నారు. భారత 3వ రాష్ట్రపతి జాకీర్ హుసేన్ హైదరాబాదు (భారత దేశం)లో జన్మించారు. ఇతని తండ్రి పఖ్తూన్ జాతికి చెందిన వారు. అయన హైదరాబాదు నుండి ఉత్తరప్రదేశ్ లోని ఫరూఖాబాద్ జిల్లా ఖాయిమ్ గంజ్ కు వలస వచ్చారు. హుస్సేన్ ప్రారంభ ప్రాథమిక విద్య హైదరాబాద్‌లో పూర్తయింది. హుసేన్ ఇటావా (ఉత్తరప్రదేశ్) లోని 'ఇస్లామియా ఉన్నత పాఠశాల' లో చదువు కున్నారు. లక్నో విశ్వ విద్యాలయం క్రిస్టియన్ డిగ్రీ కాలేజీ నుండి ఎకనామిక్స్ లో పట్టభద్రు డయ్యారు. ఉన్నతవిద్య అలీఘర్ లోని ఆంగ్లో మహమ్మడన్ ఓరియంటల్ కాలేజిలో అభ్యసించారు. ఇచట విద్యార్థి సంఘ నాయకునిగా గుర్తింప బడ్డారు.18 సంవత్సరాల వయస్సులో, అయన షాజహాన్ బేగంను వివాహం చేసుకున్నారు. జాకీర్ హుస్సేన్ 23 సంవత్సరాల వయస్సులో ఉన్నప్పుడు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృందంతో అయన నేషనల్ ముస్లిం విశ్వ విద్యాలయాన్ని స్థాపించారు. మొదట అలీఘర్లో 1920 అక్టోబర్ 29 శుక్రవారం స్థాపించ బడింది, తరువాత 1925 లో న్యూ ఢిల్లీ లోని కరోల్ బాగ్ కు మార్చబడింది. తరువాత మార్చి 1, 1935 న న్యూ ఢిల్లీలోని జామియా నగర్ కు మళ్లీ మార్చ బడింది. దీనికి జామియా మిలియా ఇస్లామియా (కేంద్ర విశ్వ విద్యాలయం) అని పేరు పెట్టారు.జాకీర్ విత్తశాస్త్రంలో పి.హెచ్.డి. చేసేందుకు, 'బెర్లిన్ విశ్వ విద్యాలయానికి (జర్మనీ) వెళ్ళారు.1926 లో బెర్లిన్ విశ్వ విద్యాలయం నుండి ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పొందారు. జర్మనీలో ఉన్నప్పుడు గాలిబ్ (1797–1868) జీవితగాథ, కవితా సంగ్రహాలను క్రోడీకరించారు.1927 లో మూసివేతను ఎదుర్కొంటున్న జామియా మిలియా ఇస్లామియాకు నాయకత్వం వహించడానికి అతను భారత దేశానికి తిరిగి వచ్చాడు. భారత దేశానికి తిరిగి వచ్చి, జామియా మిల్లియా ఇస్లామియాకు ఇరవై ఒక్క సంవత్సరాలు ఆయన పదవిలో కొనసాగారు. మార్గ దర్శకులుగా మారారు. ముహమ్మద్ ఆంగ్లో ఓరియంటల్ కళాశాల (ఇప్పుడు అలీఘర్ ముస్లిం విశ్వ విద్యాలయం) వ్యవహారాల్లో ముఖ్యంగా చురుకుగా ఉన్నారు. మహమ్మద్ అలీ జిన్నా వంటి రాజకీయ ప్రత్యర్థుల ప్రశంసలను పొందారు. బ్రిటిష్ వారితో పోరాటానికి, మహాత్మా గాంధీతో చేతులు కలిపి, "బేసిక్ విద్య" పై కఠోర పరిశ్రమ చేశారు. భారతదేశంలో విద్యాభ్యుదయానికి శ్రమించారు. ఈ కాలంలో హుసేన్ ఉత్తమ దార్శనికుడిగా, భారత విద్యా విభాగ మార్గదర్శకునిగా గుర్తింపు పొందారు. తమ రాజకీయ ప్రత్యర్థియైన మహమ్మద్ అలీ జిన్నా చేత కూడా పొగడ బడ్డారు. తన వ్యక్తిగత సంపదనంతా భారతదేశానికి ధారబోసిన దేశ భక్తులు. భారత స్వాతంత్ర్యం తరువాత, అలీఘర్ ముస్లిం యూనివర్శిటి వైస్ ఛాన్సలర్ పదవిని అంగీకరించారు. స్వాతంత్ర్యం వచ్చిన ప్రథమ దశలో విద్యార్థుల ఉద్యమాలను, ముఖ్యంగా అలీఘర్ లో, అదుపులో ఉంచుటకు, అయన నియామకం ఎంతో ఉపయోగ పడింది. వైస్ ఛాన్సలర్ పదవీకాలం ముగిసిన తరువాత 1956 లో పార్లమెంటు సభ్యునిగా నామినేట్ చేయ బడ్డారు. 1957 లో బీహారు గవర్నరుగా నియమింప బడి, పార్లమెంటుకు రాజీనామా చేశారు. బీహారు గవర్నరుగా 1957 నుండి 1962 వరకు సేవలందించిన తరువాత 1962 నుండి 1967 వరకు భారత ఉప రాష్ట్రపతి పదవిని అలంకరించారు. తదనంతరం మే 13 1967 న భారత రాష్ట్రపతిగా ఎన్నుకో బడ్డారు. అయన ప్రథమ ఉపన్యాసంలో "మొత్తం భారత దేశం నా ఇల్లు, ప్రజలందరూ నా కుటుంబం" అని పేర్కొన్నారు. తన అధ్యక్ష పదవీ కాలంలో, హుస్సేన్ హంగరీ, యుగోస్లేవియా, యుఎస్ఎస్ఆర్ మరియు నేపాల్ లకు నాలుగు దేశాలకు పర్యటించారు.1969 మే 3 న అయన మరణించగా, న్యూ ఢిల్లీ లోని జామియా మిలియా ఇస్లామియా క్యాంపస్‌లో ఖననం చేశారు. అత్యల్పకాలం రాష్ట్రపతి పదవి నిర్వహించిన మొదటి వ్యక్తి. రాష్ట్రపతి పదవిలో ఉండగా మరణించిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. (ఇప్పటి వరకు ఇద్దరు రాష్ట్రపతులు పదవిలో ఉండగా మరణించారు – డా.జాకీర్ హుస్సేన్, ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ ). ఈయన చేసిన సేవలకు కేంద్ర ప్రభుత్వం 1963 లో 'భారతరత్న' పురస్కారాన్ని అందించింది.

# పాత్రికేయ దిగ్గజం పొత్తూరి



పొత్తూరి వెంకటేశ్వరరావు... తెలుగు పత్రికా పాఠకులకు సుపరిచితమైన పేరు. అయిదు దశాబ్దాలకు పైగా పత్రికా రంగంలో మమేకమై, తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన తెలుగు జర్న లిజానికి సాధికారిక గుర్తు ఆయన. విలువలకు ప్రాదాన్యత ఇచ్చి, కట్టుబడి, ఎన్నడూ రాజీ పడని అరుదైన వ్యక్తిత్వం ఆయనది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నేటి తరానికి అచ్చమైన స్వచ్ఛమైన మార్గదర్శి పొత్తూరి. 1934 ఫిబ్రవరి 8వ తేదీన గుంటూరులో జన్మించిన డాక్టర్ పొత్తూరి వెంకటేశ్వరరావు 1957లో ఆంధ్ర జనతా పత్రికలో తొలిసారిగా ఆయన పాత్రికేయుడిగా, తొలి అడుగు వేశారు. ధృఢ చిత్తులై, వృత్తి నిబద్ధత, నిజాయితీ, బాధ్యతల విషయంలో ఎన్నడూ వెనకడుగు వేయనే లేదు. ఈనాడు, ఆంద్రభూమి, ఆంధ్రప్రభ, వార్త దినపత్రికల్లో ఎక్కడ పని చేసినా తన ప్రత్యేక ముద్రలు వేశారు. పొత్తూరి ఐదు దశాబ్దాలకు పైగా తెలుగు పత్రికా రంగంలో అనేక యాజ మాన్యాలను, సంఘటనలను, సందర్భాలను, పరిణామాలను, మార్పులను గమనించారు. తనదైన ప్రత్యేక శైలి సంపాదకీ యాలు రాశారు. పొత్తూరి అంటే ఒక ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమి అధ్యక్షుడిగా వ్యవహ రించారు. తెలుగు భాషా వికాసానికి, సాహిత్యాభివృద్ధికి నిరంతర కృషి చేశారు. ఎందరో సాహితీ వేత్తలకు వెన్నుదన్నుగా నిలిచి నిలిచి భాషాభ్యున్నతికి చేయూత అందించారు. దాదాపు నూట యాభై యేళ్ళ తెలుగు పత్రికా చరిత్ర గురించి సంపూర్ణ అవగాహన కలిగి, స్వయంగా ఒక సకల విషయ సంగ్రహ నిధిగా నిలిచారు. పత్రికా రచనల పట్ల, తెలుగు సాహిత్యం పట్ల అయన అంకిత భావం సాటిలేనిది. అందుకే తెలుగు పత్రికా రంగంలో మేటి సంపాదకులుగా పొత్తూరి గుర్తింపు పొందారు. సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక, చమత్కార, జ్ఞాన, విజ్ఞాన, రాజకీయ ఒక్కటేమిటి పాత్రికేయులకు ఉండాల్సిన అన్ని అంశాలలో అపారమైన జ్ఞాన సంపన్నులుగా అసమాన ప్రతిభ కనబరి చారు. "నాటి పత్రికలు విలువలు పాటించేవి. సంపాదకులు నడిపించేవారు. నేడు పరిస్థితి వేరు. యజమానులే నడిపిస్తున్నారు. పత్రికల ప్రతులు ఎక్కువ సంఖ్యలో అమ్ముకోవడానికి తాపత్రయ పడుతున్నారు. విలువలు పడి పోయాయని" తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుండే వారు. యాజమాన్యాల భావజాలాలు అనుగుణంగా కాకుండా, సర్వ స్వతంత్రులుగా వ్యవహరించే వారు. కొన్ని సందర్భాలలో యాజమాన్యం ఆంక్షలు విధించితే, రాజీ పడక, రాజీనామా చేసి వెళతానని నిక్కచ్చిగా చెప్పేవారు పొత్తూరి వెంకటేశ్వరరావు. ఆయన వ్యాస పరంపర ఎంతో విలువైన సమాచారాన్ని విలువ కలిగిన సమాచార యుక్తంగా సామాన్య భాషలో, సూటిగా ఆకర్షణీయంగా ఉండేవి. తుదిశ్వాస వరకు జర్నలిజం విలువలకు కట్టుబడి తనదైన విలక్షణ వ్యక్తిత్వానికి దర్పణంగా నిలిచిన ధన్యజీవి పొత్తూరి.నాటి పత్రికల మేటి విలువలు , చింతన, చిరస్మరణీయులు, కాశీనాథుని నాగేశ్వరరావు, పారమార్థిక పదకోశం తదితర రచనలు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నక్సలైట్లతో జరిపిన చర్చల్లోపౌర స్పందన వేదిక సభ్యుడిగా పొత్తూరి క్రియాశీల పాత్ర పోషించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలకు గౌరవ సంపాదకత్వం కూడా వహించారు. లోకాయుక్త కమిటీలో జ్యుడిషల్ సభ్యుడిగా, సలహాదారుగా పొత్తూరి పనిచేశారు. పొత్తూరి వెంకటేశ్వరరావు బ్రిటీష్ లైబ్రరి సభ్యత్వం కలిగి ఉన్న అపురూప గౌరవం దక్కించు కున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పొత్తూరి రాష్ట్ర విభజన సమయంలో ప్రత్యేక రాష్ట్ర వాదనకు ఆయన మద్దతు తెలిపారు. 2020 మార్చి 5న పొత్తూరి లోకాన్ని వదిలి వెళ్లారు.

## 'యుఫోరియా' సినిమా..

## తల్లిదండ్రులకు హెచ్చరిక!

టాలీవుడ్‌లో భారీ సెట్టింగులు, పౌరాణిక గాథలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన దర్శకుడు గుణశేఖర్, సుమారు మూడేళ్ల విరామం తర్వాత పూర్తిగా రూటు మార్చారు.. భారీ హంగులకు దూరంగా, ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతూ ఆయన తెరకెక్కించిన బలమైన సోషల్ డ్రామానే 'యుఫోరియా'. ఒకప్పుడు ఒక్కడు, ఖుషీ వంటి చిత్రాలతో స్టార్ హీరోయిన్‌గా వెలుగొంది, సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సత్తా చాటుతున్న భూమిక చావ్లా ఇందులో ప్రధాన పాత్ర పోషించడం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఒక నగరంలోని ఒక ప్రతిష్టాత్మక కాలేజీకి కరస్పాండెంట్ వింధ్య వేములపల్లి (భూమిక చావ్లా). విద్యావేత్తగా సమాజంలో ఆమెకు ఎంతో గౌరవం ఉంది. హఠాత్తుగా హైకోర్టు మెట్లు ఎక్కి, తనపై తనే కేసు నమోదు చేయమని ఆమె కోరడంతో కథ ఒక్కసారిగా మలుపు తిరుగుతుంది. అంతటి ఉన్నత స్థానంలో ఉన్న మహిళ, తాను నేరం చేశానని ఎందుకు ఒప్పుకుంది? అసలు ఆమె చేసిన నేరం ఏమిటి? మరోవైపు చైత్ర (సారా అర్జున్) అనే అమ్మాయి జీవితం ఈ కేసుతో ఎలా ముడిపడి ఉంది? నేటి 'జెన్–జీ' సంస్కృతిలో యువత వెళ్తున్న దారి, వారిపై తల్లిదండ్రుల ప్రభావం ఎలా ఉందనేదే మిగిలిన కథ.ఈ సినిమాకు ప్రధాన బలం భూమిక చావ్లా.. గ్లామర్ పాత్రల నుంచి నటనకు ఆస్కారం ఉన్న పాత్రల వైపు మళ్లిన ఆమె, ఇందులో వింధ్య పాత్రలో పరకాయ ప్రవేశం చేశారు.. ఒక బాధ్యతాయుతమైన విద్యావేత్తగా, అదే సమయంలో అంతర్మథనంతో రగిలిపోయే వ్యక్తిగా ఆమె ప్రదర్శించిన పరిణతి అద్భుతం. ముఖ్యంగా ఎమోష నల్ సన్నివేశాల్లో ఆమె అనుభవం తెరపై కనిపిస్తుంది. ఇక డెబ్యూ యాక్టర్ విఘ్నేష్ గవిరెడ్డి మొదటి సినిమానే అయినా, అస్థిరమైన మనస్తత్వం ఉన్న యువకుడిగా చాలా కాన్ఫిడెంట్‌గా నటించాడు. సారా అర్జున్ స్క్రీన్ టైమ్ తక్కువగా ఉన్నప్పటికీ, కథ మొత్తం ఆమె చుట్టూనే తిరుగుతుంది. కీలకమైన సన్నివేశాల్లో ఆమె తన ఉనికిని చాటుకుంది. గౌతమ్ వాసుదేవ్ మీనన్ తనదైన స్టైలిష్, సెటిల్డ్ పర్ఫార్మెన్స్‌తో మెప్పించారు.. సాంకేతికంగా గుణశేఖర్ తన స్థాయిని, విలువలను కాపాడుకున్నారు.. ప్రవీణ్ కె. పోతన్ సినిమాటోగ్రఫీ సినిమాలోని సీరియస్ మూడ్‌ని పర్ఫెక్ట్‌గా క్యాప్చర్ చేసింది. కాలభైరవ అందించిన సంగీతం కథలోని గాఢతను పెంచింది. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కొన్ని ఎమోషనల్ సీన్స్‌ని బాగా ఎలివేట్ చేసింది. ఎడిటింగ్ ఫస్ట్ హాఫ్‌లో బాగున్నప్పటికీ, సెకండ్ హాఫ్‌లో అక్కడక్కడా కత్తెర పడాల్సింది.. నిర్మాణ విలువలు రిచ్‌గా ఉన్నాయి. 'యుఫోరియా' కేవలం ఒక సినిమా మాత్రమే కాదు, ఇది సమాజానికి ఒక హెచ్చరిక. దర్శకుడు గుణశేఖర్ కేవలం నేరస్తులను వేలెత్తి చూపడం కాకుండా, ఆ నేరం జరగడానికి గల సామాజిక కారణాలను, తల్లిదండ్రుల పెంపకంలో లోపాలను స్పృశించిన తీరు అభినందనీయం.. ఫస్ట్ హాఫ్ కథనం చాలా వేగంగా సాగుతూ ప్రేక్షకుడిని సినిమాలో లీనం చేస్తుంది. ఆధునిక జీవనశైలిలో స్వేచ్ఛను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో పదునైన సంభాషణలతో వివరించారు. ముగింపు సన్ని వేశాలు ఎమోషనల్ పవర్‌తో కూడి ఉండి, ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తాయి. అయితే, సెకండ్ ఆఫ్‌లో సినిమా కాస్తా సాగదీతగా అనిపిస్తుంది.. సామాజిక ఇతివృత్తం ఉన్న సీరియస్ సినిమాలో పాటలు కథా ప్రవాహానికి అడ్డు తగిలినట్లు అనిపిస్తాయి. భూమిక, విఘ్నేష్ పాత్రల మధ్య వచ్చే కొన్ని ఎమోషనల్ సీన్స్‌లో ఇంకాస్త డ్రామా పండించాల్సింది. మొత్తంగా చెప్పాలంటే.. 'యుఫోరియా' ఒక నిజాయితీతో కూడిన సామాజిక ప్రయత్నం. తమ పిల్లలు ఏ దారిలో వెళ్తున్నారు? వాళ్ల స్నేహాలు ఎలాంటివి? అని గమనించాల్సిన అవసరాన్ని ఈ చిత్రం తల్లిదండ్రులకు గుర్తు చేస్తుంది. రొటీన్ మాస్ మసాలా చిత్రాలకు భిన్నంగా, వాస్తవాలను తెలుసుకోవడానికి ప్రతి ఒక్కరూ చూడాల్సిన మంచి సోషల్ డ్రామా ఇది.

# రోదసిలోనూ గూఢచర్యం

అంతరిక్ష రంగంలో భారత ప్రైవేట్ సత్తా మరోసారి ప్రపంచానికి తెలిసింది. దేశీయంగా అభివృద్ధి చేసిన ఉపగ్రహంతో అంతరిక్షంలోని ఇతర వస్తువులను అత్యంత స్పష్టంగా ఫొటోలు తీసి అహ్మదాబాద్‌కు చెందిన ఆజిస్టా ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అరుదైన ఘనత సాధించింది. ఈ విజయంతో భారత్‌కు 'ఇన్-ఆర్బిట్ స్నూపింగ్' (కక్ష్యలోనే గూఢచర్యం) చేసే సామర్థ్యం లభించినట్లయింది. అంటే, ఇకపై అంతరిక్షంలో శత్రు దేశాల ఉపగ్రహాలపై నిఘా పెట్టడం సాధ్యమవుతుంది. ఆజిస్టా సంస్థకు చెందిన 80 కిలోల బరువున్న చాఖీ= (ఎబిఎ ఫస్ట్ రన్నర్) ఉపగ్రహం ఈ ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఫిబ్రవరి 3న భూమికి సుమారు 300 కిలోమీటర్లు, 245 కిలోమీటర్ల దూరంలో పరిభ్రమిస్తున్న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఞూా)ను ఈ ఉపగ్రహం రెండుసార్లు ఫొటోలు తీసింది. మొత్తం 15 ఫ్రేమ్‌లను సేకరించగా, ఇమేజ్ రిజల్యూషన్ దాదాపు 2.2 మీటర్లుగా నమోదైంది. ఈ రెండు ప్రయత్నాల్లోనూ 100 శాతం విజయం సాధించడం, ఆజిస్టా అభివృద్ధి చేసిన స్వదేశీ ట్రాకింగ్ అల్గారిథమ్‌లు, ఎలక్ట్రో-ఆప్టికల్ ఇమేజింగ్ వ్యవస్థల కచ్చితత్వాన్ని నిరూపించింది. ప్రస్తుతం భూ కక్ష్యలో ఉపగ్రహాల సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. జామింగ్, సిగ్నల్స్‌కు



అంతరాయం కలిగించడం వంటి ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఇలాంటి తరుణంలో స్పేస్ సిచువేషనల్ అవేర్‌నెస్ (ఞూా) సామర్థ్యం దేశ భద్రతకు అత్యంత కీలకం. భారత్ ప్రస్తుతం కమ్యూనికేషన్, నావిగేషన్, వ్యూహాత్మక అవసరాల కోసం రూ.50,000 కోట్లకు పైగా విలువైన 50కి పైగా ఉపగ్రహాలను నిర్వహిస్తోంది. ఈ తాజా సామర్థ్యంతో మన అంతరిక్ష ఆస్తులను కాపాడుకోవడం సులభతరం అవుతుంది. చాఖీ= ఉపగ్రహాన్ని 2023 జూన్ 13న స్పేస్‌ఎక్స్ ఫాల్కన్-9 రాకెట్ ద్వారా ప్రయోగించారు. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ శాటిలైట్ ఇప్పటికే 2.5 సంవత్సరాల జీవితకాలాన్ని పూర్తి చేసుకుని, మరో 2.5 ఏళ్లు పనిచేయనుంది. ఈ విజయంపై ఆజిస్టా మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, "మా స్వదేశీ వ్యవస్థలతో నాన్-ఎర్త్ ఇమేజింగ్‌ను ప్రదర్శించాం. ఇది కక్ష్యలోని వస్తువులను కచ్చితంగా ట్రాక్ చేసే సామర్థ్యాన్నిస్తుంది" అని తెలిపారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రిగేడియర్ అదర్శ్ భారద్వాజ్ మాట్లాడుతూ, "ఈ ప్రదర్శనతో అంతరిక్షంలో కార్యకలాపాలను పర్యవేక్షించే శక్తి భారత్‌కు లభించింది. జాతీయ ఆసక్తులను కాపాడటంలో ఇది కీలక ముందడుగు" అని పేర్కొన్నారు. భవిష్యత్తులో 25 సెంటీమీటర్ల రిజల్యూషన్‌తో ఫొటోలు తీయగల పేలోడ్‌లను అభివృద్ధి చేస్తామని, బాలిస్టిక్ క్షిపణులను ట్రాక్ చేయడం వంటి రక్షణ అవసరాలకూ ఇది ఉపయోగపడుతుందని ఆజిస్టా ప్రకటించింది. ఇస్రో ప్రయోగాలకు అదనంగా, ప్రైవేట్ రంగం సాధించిన ఈ విజయం భారత అంతరిక్ష రక్షణ సామర్థ్యాలను మరింత పటిష్ఠం చేసింది.

# బంగ్లాదేశ్ రాజకీయాల్లో శూన్యత..
# కనుమరుగవుతున్న మహిళా నేతలు!

ఒకప్పుడు దక్షిణాసియాలో మహిళా సాధికారతకు ప్రతీకగా నిలిచిన బంగ్లాదేశ్ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. దశాబ్దాల పాటు ఇద్దరు మహిళా దిగ్గజాల చుట్టూ తిరిగిన దేశ రాజకీయాల్లో ఇప్పుడు తీవ్రమైన శూన్యత నెలకొంది. 2024లో జరిగిన హింసాత్మక ఆందోళనల తర్వాత జరగనున్న తొలి ఎన్నికల్లో మహిళా ప్రాతినిధ్యం అత్యంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఒకప్పటి మహిళా ప్రధానులు షేక్ హసీనా (ప్రస్తుతం ప్రవాసంలో ఉన్నారు), ఖలీదా జియా (ఇటీవల మరణించారు) లేని లోటు రాజకీయపరంగా తీర్చలేనిది. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా బంగ్లాదేశ్ రాజకీయాలను ఇద్దరు మహిళా నేతలు శాసించారు. బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (దీఛీూ)కి నాలుగు దశాబ్దాలు నాయకత్వం వహించి, మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన ఖలీదా జియా డిసెంబర్ 2025లో కన్నుమూశారు. మరోవైపు, ఐదుసార్లు ప్రధానిగా రికార్డు సృష్టించిన షేక్ హసీనా, 2024 జులైలో జరిగిన ప్రజా తిరుగుబాటు తర్వాత పదవీచ్యుతులై ప్రస్తుతం ప్రవాసంలో జీవిస్తున్నారు. ఈ ఇద్దరు కీలక నేతలు తెరమరుగు కావడంతో దేశ రాజకీయాల్లో మహిళల స్థానం ప్రశ్నార్థకంగా మారింది.



ఈ పరిణామం దేశంలో పెరుగుతున్న తీవ్రవాదం, మత ఛాందసవాదానికి అద్దం పడుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ప్రొఫెసర్ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 12న ఎన్నికలు జరగనున్నాయి. దేశంలోని 300 పార్లమెంటరీ స్థానాలకు గాను మొత్తం 1,981 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, వారిలో మహిళలు కేవలం 76 మంది మాత్రమే ఉండటం గమనార్హం. ఇది మొత్తం అభ్యర్థుల్లో 4 శాతం కన్నా తక్కువ. తీవ్రవాద శక్తుల నుంచి వస్తున్న బెదిరింపులు, భయానక వాతావరణం కారణంగానే రాజకీయ పార్టీలు మహిళలకు టికెట్లు ఇవ్వడానికి వెనుకాడుతున్నాయని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా, దేశంలోని అతిపెద్ద ఇస్లామిస్ట్ పార్టీ అయిన జమాత్-ఎ-ఇస్లామీ ఒక్క మహిళా అభ్యర్థిని కూడా నిలబెట్టకపోవడం ఈ ధోరణికి నిదర్శనంగా చెబుతున్నారు. హసీనా అనంతర యుగంలో ఛాందసవాద శక్తుల ప్రభావం పెరగడంతో మహిళలను రాజకీయంగా అణచివేస్తున్నారని, వారిని కించపరిచేలా ప్రచారం చేస్తున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ఒకప్పుడు ఇద్దరు మహిళా నాయకులు దేశాన్ని నడిపించడం చూసి గర్వపడ్డాను. కానీ ఇప్పుడు పరిస్థితి మారింది. మహిళా నేతలను అంచెలంచెలుగా పక్కకు నెట్టేస్తున్నారు" అని బంగ్లాదేశ్‌కు చెందిన ఓ కొత్త ఓటరు తన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితం ఎవరికి అనుకూలంగా వచ్చినా, రాబోయే రోజుల్లో బంగ్లాదేశ్‌ను దాదాపు పూర్తిగా పురుషులే పాలించబోతున్నారన్నది స్పష్టం. పార్లమెంటులో మహిళల కోసం 50 సీట్లు రిజర్వ్ చేసినప్పటికీ, ప్రత్యక్ష ఎన్నికల్లో వారి ప్రాతినిధ్యం గణనీయంగా తగ్గడం దేశ ఉదారవాద స్వభావానికే ప్రమాద సంకేతంగా మారింది.

# డబ్బుల్లేక గుడిలో నివాసం
# పెద్ద బిజినెస్‌మ్యాన్‌గా ఎదిగిన వీధి వ్యాపారి

పట్టుదల, కష్టపడి పనిచేసే మనస్తత్వం, దృఢమైన సంకల్పం ఉంటే జీవితంలో ఏదైనా సాధించవచ్చు. చిన్న స్థాయి వ్యక్తులైనా తమ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు. ఇదే విషయాన్ని రుజువు చేశారు గుజరాత్‌కు చెందిన హర్షద్‌భాయ్ బరోత్ అనే వ్యక్తి. ఉగాండాలో వీధి వ్యాపారిగా జీవితాన్ని ప్రారంభించిన హర్షద్‌భాయ్, ప్రస్తుతం అదే దేశంలో పెద్ద బిజినెస్‌మ్యాన్‌గా ఎదిగారు. ఈ క్రమంలో ఉగాండా అత్యున్నత పురస్కారాన్ని పొందారు.

**40 క్రితం ఉగాండాకు వలస**

గుజరాత్ మెహసానా జిల్లాలోని విస్నగర్‌కు చెందిన హర్షద్ భాయ్ సుమారు నాలుగు దశాబ్దాల క్రితం ఉగాండాకు వలస వెళ్లారు. అయితే చేతిలో ఎక్కువ డబ్బులు లేకపోవడంతో వీధి వ్యాపారిగా తన జీవితాన్ని ప్రారంభించారు. ఒక గుడిలో నివసిస్తూ పొట్టకూటి కోసం వ్యాపారాన్ని కొనసాగించారు. అలా కష్టాలను ఎదుర్కొంటూ చిన్న చిన్న వస్తువులు అమ్ముతూ జీవనం సాగించారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగుపెట్టారు. 'తిరుపతి హర్ష్' పేరిట ఓ కంపెనీని పెట్టారు. క్రమంగా తన కష్టం, తెలివితేటలతో వ్యాపారంలో మంచి స్థాయికి చేరుకున్నారు.

**2000 మందికి ఉపాధి**

రియల్ ఎస్టేట్ రంగంలో ప్రముఖుడిగా ఎదిగారు హర్షద్‌భాయ్. ఉగాండాలో అనేక ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య, నివాస ప్రాజెక్టుల నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అలాగే వేలాది మంది ఉగాండా పౌరులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించారు. ఇప్పుడు ఆయన ఆధ్వర్యంలో పనులు అవుతున్న వివిధ ప్రాజెక్టులలో 2,000 మందికి పైగా స్థానిక ఉగాండా వాసులు ఉపాధి పొందుతున్నారు. అందుకే హర్షద్‌భాయ్‌ను ఉగాండా ప్రభుత్వం, అక్కడి ప్రజలు ఎంతో గౌరవిస్తారు.

**ఉగాండా అత్యున్నత పురస్కారం ప్రదానం**

తమ దేశ అభివృద్ధికి హర్షద్‌భాయ్ చేసిన కృషిని, ఆయన పెట్టిన కోట్లాది రూపాయల పెట్టుబడులను గుర్తించిన ఉగాండా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో హర్షద్‌భాయ్‌కు 'ది డిస్టింగ్విష్డ్ ఆర్డర్ ఆఫ్ ది క్రెస్టెడ్ క్రేన్ (గ్రాండ్ ఆఫీసర్)' అనే ఉగాండా అత్యున్నత పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఈ అవార్డును హర్షద్‌భాయ్‌కి ఉగాండా అధ్యక్షుడు యోవేరి కే ముసెవెని ప్రదానం చేశారు.



'ది డిస్టింగ్విష్డ్ ఆర్డర్ ఆఫ్ ది క్రెస్టెడ్ క్రేన్ (గ్రాండ్ ఆఫీసర్)' అవార్డును భారతదేశంలోని పద్మ విభూషణ్ లేదా పద్మశ్రీ పురస్కారానికి సమానమైనదిగా పరిగణిస్తారు. భారతీయుడైన హర్షద్‌భాయ్ ఈ పురస్కారాన్ని అందుకోవడంతో గుజరాత్, మోహసానా జిల్లా వాసులు గర్వపడుతున్నారు. విదేశీ గడ్డపై హర్షద్‌భాయ్ చేసి కృషికి లభించిన గుర్తింపు పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే చిన్నస్థాయి నుంచి పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన హర్షద్‌భాయ్ జీవితం దేశంలోని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

**'పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో ఆయనది బలమైన ముద్ర'**

ఉగాండా అత్యున్నత పురస్కారం హర్షద్‌భాయ్‌కు లభించడంపై ఆయన బంధువు భరత్‌భాయ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఈటీవీ భారత్‌తో పలు విషయాలను పంచుకున్నారు. "ఒక భారతీయుడికి (ఒక గుజరాతీకి) విదేశీ గడ్డపై ఈ గౌరవం లభించడం గర్వకారణం. గుడిలో నివసిస్తూ వీధి వ్యాపారిగా జీవితాన్ని ప్రారంభించారు హర్షద్‌భాయ్. ఇప్పుడు ఉగాండాలోని ప్రధాన పారిశ్రామిక, వాణిజ్య రంగాలలో బలమైన ముద్ర వేశారు." అని భరత్‌భాయ్ రావు పేర్కొన్నారు.

**జనాభాపరంగా తక్కువే- కానీ ఆర్థికంగా బలవంతులు**

ఉగాండాలో నివసిస్తున్న భారతీయులు సంఖ్య తక్కువే. అ దేశ జనాభాలో 0.1 శాతం కంటే తక్కువ మంది ఇండియన్స్ ఉగాండాలో ఉన్నారు. ఈ ఆఫ్రికన్ దేశంలో 30,000 మందికి పైగా భారత సంతతికి చెందినవారు, ప్రవాస భారతీయులు నివసిస్తున్నట్లు అంచనా. వీరిలో అధిక శాతం మంది పశ్చిమ భారత రాష్ట్రమైన గుజరాత్‌కు చెందినవారే. అయితే భారతీయులు అక్కడ పన్ను చెల్లింపుదారులుగా, వ్యాపారులుగా, తయారీదారులుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగారు. ఉగాండా ఆర్థిక వ్యవస్థకు అపారమైన తోడ్పాటును అందిస్తున్నారు.

## మార్చి 31కల్లా నక్సలిజం అంతం..



దేశంలో వచ్చే మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. మావోయిస్టుల ఏరివేత అంశంపై ఛత్తీస్‌ఘడ్ రాజధాని రాయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31లోపు నక్సలిజాన్ని పూర్తిగా తుడిచివేస్తామన్నారు. వామపక్ష తీవ్రవాదానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంలో మావోయిస్టుల నిధులను అడ్డుకోవడం, లొంగుబాటు చర్యలు, భద్రతా దళాల ఆపరేషన్స్, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలు మావోయిస్టుల ప్రభావాన్ని గణనీయంగా తగ్గించాయన్నారు. ఛత్తీస్‌ఘడ్ ప్రభుత్వ అధికారులు, భద్రతా దళాలతో ఈ సమావేశం జరిగిందని అమిత్ షా వెల్లడించారు. కొన్నేళ్లుగా నక్సల్స్ కార్యకలాపాలు బలహీనంగా మారాయన్నారు. ఈ సమావేశానికి చత్తీస్‌ఘడ్ సీఎం విష్ణు దేవ్ సాయి, డీసీఎం విజయ్ శర్మ, కేంద్ర హోం శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ ప్రాంతంలో మావోలు ఎక్కువగా ఉంటారు. ఈ ప్రాంతం మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ, ఒడిశాలతో సరిహద్దు పంచుకుంటుంది. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ పోలీసులు వెల్లడించిన డాటా ప్రకారం.. ఈ ప్రాంతంలో 2024 నుంచి 500 మందికిపైగా నక్సలైట్లు ఎన్‌కౌంటర్లలో ప్రాణాలు కోల్పోయారు. వీరిలో మావో అగ్రనేత నంబాల కేశవరావు కూడా ఉన్నారు. ఈ రెండేళ్ల కాలంలో 1,900 మందికిపైగా నక్సలైట్లు అరెస్టయ్యారు. 2,500 మందికిపైగా లొంగిపోయారు.

## మలేసియాలో త్వరలో యూపీఐ సేవలు..
## భారతీయులకు మేలు..



ఇండియాలో దూసుకుపోతున్న యూపీఐ సేవలు త్వరలో మలేసియాలో కూడా అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీ.. మలేసియా వేదికగా వెల్లడించారు. ప్రస్తుతం మలేసియాలో మోదీ పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఒక కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. మలేసియాలో కూడా త్వరలోనే యూపీఐ సేవల్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అయితే, ఎప్పటినుంచి అందుబాటులోకి వచ్చేది వెల్లడించలేదు. ఈ సేవలు అక్కడ ఉంటున్న భారతీయులకు మేలు కలిగిస్తాయని మోదీ అన్నారు. మలేసియాలో రాబోయే యూపీఐ సేవలు వీపీఏ (వర్చువల్ పేమెంట్ అడ్రస్), లేదా క్యూఆర్ కోడ్, లేదా మొబైల్ నెంబర్ ద్వారా అందుబాటులోకి వస్తాయి. బ్యాంక్ అకౌంట్లతో పని లేకుండా ఈ సేవల్ని వినియోగించుకోవచ్చు. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ ద్వారా ఈ సేవలకు భద్రత ఉంటుంది. మరోవైపు దేశంలో యూపీఐ సేవలు దూసుకెళ్తున్నాయి. గత ఏడాది 640 మిలియన్ల ట్రాన్సాక్షన్స్ జరిగినట్లు గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది వాడుతున్న వీసా కార్డ్ సేవల కంటే మన యూపీఐ సేవలే అధికం. ప్రపంచవ్యాప్తంగా అమలవుతున్న డిజిటల్ ట్రాన్సాక్షన్స్‌లో సగానికిపైగా ఇండియాలోనే జరుగుతున్నాయి. ఇక.. మోదీ రెండు రోజుల మలేసియా పర్యటనలో భాగంగా ఆ దేశంతో కీలక ఒప్పందాలు చేసుకున్నారు. రక్షణ, వ్యాపారం, సహకారం, సెమీకండక్టర్ల సరఫరా వంటి అంశాల్లో ఇరు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరాయి. మరోవైపు వివాదాస్పద మత గురువు జాకీర్ నాయక్‌ను ఇండియాకు అప్పగించే అంశంపై కూడా ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఇండియాకు చెందిన జాకీర్ నాయక్.. కొన్నేళ్లుగా మలేసియాలో ఉంటున్నాడు.

## బంగ్లాదేశ్‌లో హక్కుల కోసం
## 1.25 కోట్ల హిందువులు పోరాడితే..
## ఆరెస్సెస్ చీఫ్ కీలక వ్యాఖ్యలు



కొంతకాలంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై తీవ్ర దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. హత్యలు, దాడులు, దోపిడీలు వంటి ఘటనలతో బంగ్లాలో హిందువులకు కొంతకాలంగా రక్షణ లేకుండా పోయింది. ఈ అంశంపై ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ స్పందించారు. బంగ్లాదేశ్‌లో ఉన్న 1.25 కోట్ల మంది హిందువులు తమ హక్కుల కోసం పోరాడితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు మద్దతు ఇస్తారని భగవత్ అన్నారు. ఆరెస్సెస్ వందేళ్లు పూర్తైన సందర్భంగా ముంబైలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "బంగ్లాదేశ్‌లో 1.25 కోట్ల మంది హిందువులు ఉన్నారు. వారితోపాటు మైనారిటీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా నిలబడి పోరాడగలిగితే ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు మద్దతు ఇస్తారు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ఇండియాలో కూడా మైనారిటీలు, ఇతర అంశాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. "ఇండియాలో ఇలాంటి అంశాలకు సంబంధించి గత ప్రభుత్వాలు సరిగ్గా స్పందించలేదు. జనాభా పెరుగుదల, మార్పులను ప్రభుత్వాలు గుర్తించలేదు. దీనికి కొన్ని వర్గాల జననాల రేటు, అక్రమ వలసలు వంటివి ప్రధాన కారణాలు. ఇప్పుడే ప్రభుత్వం దీనిపై స్పందిస్తోంది. ప్రభుత్వ ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ఆరెస్సెస్ కులాలకు ప్రాధాన్యం ఇవ్వదు. అన్ని వర్గాలను కలపాలన్నదే మా ధ్యేయం. ఎస్సీ, ఎస్టీల మీద వివక్ష లేదు. ఇది బ్రాహ్మణులు స్థాపించిన సంస్థ అయినప్పటికీ ఎవరైనా దీనికి అధ్యక్షులు కావొచ్చు. మాకు వచ్చే నిధుల గురించి చాలా మంది అడుగుతున్నారు. మేం మా కార్యకర్తల నుంచి నిధులు సేకరిస్తాం. మేం ఎక్కడికైనా వెళ్తే పుడ్డుకు డబ్బులు అడిగే బదులు ఆహారమే అడుగుతాం. మేం హోటళ్లలో ఉండం. కార్యకర్తల ఇండ్లలోనే బస చేస్తాం. మాకు అధికారం అవసరం లేదు. అందరినీ ఏకం చేయాలన్నదే మా లక్ష్యం. దేశాన్ని విడగొట్టడం ఎవరికీ సాధ్యం కాదు. దేశాన్ని విడదీయాలనుకున్నవాళ్లే విచ్ఛిన్నమవుతారు" అని మోహన్ భగవత్ అన్నారు.

ధర్మఘంట

# ‘బీజేపీ, బీఆర్ఎస్ రెండూ బొమ్మ-బొరుసులే’

-మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేయదని వెల్లడించారు. ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప ఉద్యమ నేత : ఉమ్మడి వరంగల్ జిల్లాకు గొప్ప చరిత్ర ఉందిని సీఎం పేర్కొన్నారు. దేశానికే నాయకత్వం వహించిన మాజీ ప్రధాని పీవీ ఈ ప్రాంతం నుంచే ప్రాతినిథ్యం వహించారని ఆయన తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కీలక పాత్రపోషించిందని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ గొప్ప ఉద్యమ నేత అని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల ప్రత్యేకతను ఉద్యమంలో చూశామని వెల్లడించారు.

**ఇందిరమ్మ ఇళ్ల రెండోవిడత**

2004–14 మధ్య 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఎవరికైనా డబుల్ బెడ్రూమ్ ఇల్లు వచ్చిందా అని ప్రశ్నించారు. అయితే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవితకు మాత్రం ఫామ్‌హౌస్‌లు ఇచ్చాయని విమర్శించారు. కేసీఆర్‌కు పేదల పట్ల ఎలాంటి పట్టింపు లేదు అని పునరుద్ఘాటించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ బీఆర్ఎస్‌కు అని వారు అంటే ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊరిలో ఓట్లన్నీ కాంగ్రెస్‌కు అని ఆనాడు చెప్పానని సీఎం పేర్కొన్నారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు గంపగుత్తగా ఓట్లు వేశారని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన ఇళ్లన్నీ నిర్మించుకొమ్మని అన్నారు. ఏప్రిల్ తర్వాత ఇందిరమ్మ ఇల్లు రెండోవిడత ఇస్తామని వెల్లడించారు.

**పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి**

దక్షిణ కుంభమేళాగా సమ్మక్క–సారలమ్మ జాతరను జరుపుకున్నామని సీఎం పెర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న దేవాలయాలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తామని హామీఇచ్చారు. అటవీ ప్రాంతంలో రిసార్ట్‌లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

**ఈడీ కేసులతో అవమానిస్తున్నారు**

కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారని సీఎం పేర్కొన్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారని తెలిపారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమానిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారని తెలిపారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదని కేంద్రాన్ని నిలదీశారు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? అని ప్రశ్నించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి పేరు కిషన్‌రావే అని అన్నారు. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి అని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితిఅని విమర్శల వర్షం కురిపించారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. బీజేపీ సాయానికి 8 ఎంపీ సీట్లను బీఆర్ఎస్ ఇచ్చిందిని చెప్పారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు బీఆర్ఎస్ సహాయపడుతోందన్నారు.

**ఏనాడైనా వచ్చారా?**

కేసీఆర్, మోదీని చూసి ఓటు వేయాలని బీఆర్ఎస్, బీజేపీ చెప్తున్నాయని సీఎం అన్నారు. మోదీ ఫొటో చూసి ఓటు వేయాలంటున్నారు గల్లీలో సమస్యలను మోదీ వచ్చి తీరుస్తారా అని ప్రశ్నించారు. పిల్లగాడిని చూసి పిల్లనిస్తారా, పెళ్లి పెద్దను చూసి పిల్లనిస్తారా? అంటూ విమర్శించారు. మనవారిని గెలిపిస్తే ఇక్కడే ఉంటూ మన పనులు చేస్తారని హామీ ఇచ్చారు. తన దగ్గరకు వచ్చి సంతకాలు పెట్టించుకునే చనువు మీ నాయకుడికి ఉంది అని పేర్కొన్నారు. ఏనాడైనా మోదీ భూపాలపల్లి వచ్చారా? అని అడిగారు. కేసీఆర్, మోదీని చూసి ఓటు వేస్తే మోసపోతారని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రెండేళ్లలో మున్సిపాల్టీలకు రూ.17,442 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ మున్సిపాల్టీలకే రూ. 6,016 కోట్లు కేటాయించామని వెల్లడించారు. కౌన్సిలర్ ఎవరో ఉంటే ఎమ్మెల్యేను అడగలేదన్నారు. ఎమ్మెల్యే సహకారం లేకపోతే తాను కూడా నిధులు ఇచ్చే పరిస్థితి ఉండదని తెలిపారు. ఇంటిల్లిపాదికి కేసీఆర్ పదవులు ఇచ్చారని విమర్శించారు. మున్సిపల్ మంత్రిగా కేటీఆర్ భూపాలపల్లికి ఏమైనా చేశారా అని ప్రశ్నించారు. “కిషన్‌రెడ్డి కల్వకుంట్ల కిషన్‌రావుగా మారి కేసీఆర్, కేటీఆర్ అరెస్టును ఆపుతున్నారు. కేసీఆర్‌ను అరెస్టు చేయడానికి నేను ముఖ్యమంత్రినా అని కిషన్‌రెడ్డి చెప్తున్నారు. సర్వం త్యాగం చేసిన గాంధీ కుటుంబాన్ని సీబీఐ, ఈడీ కేసులతో అవమాని స్తున్నారు. ఈడీ, సీబీఐ కేసులతో రాహుల్‌గాంధీని వేధిస్తున్నారు. కాళేశ్వరంలో అవినీతి చేసిన కేసీఆర్‌ను ఎందుకు అరెస్టు చేయడంలేదు. ఫార్ములా–ఈ కార్ రేస్ కేసులో కేటీఆర్‌ను కాపాడుతున్నది మీరు కాదా? కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావును అరెస్టు చేసే వరకు కిషన్‌రెడ్డి కిషన్‌రావే. కేసీఆర్‌కు దొంగ పుత్రుడు కేటీఆర్ దత్త పుత్రుడు కిషన్‌రెడ్డి. ఫోన్ ట్యాపింగ్‌తో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్నారు. బీఆర్ఎస్ అంటే బ్లాక్‌మెయిల్ రాజకీయ సమితి.“

# బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పేందుకు మూడు గంటలు పట్టిందా

-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. మేమంతా మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఉండగా రేవంత్ రెడ్డి ఈ కుట్ర చేశారని ఆరోపించారు. ఓటుకు నోటు కేసు జగద్విదితమని కేటీఆర్ తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి 2015లో ఎమ్మెల్యేలను కొనడానికి వచ్చి రూ.50లక్షల బ్యాగుతో కెమెరాల ముందు దొరికాడని గుర్తుచేశారు. ఈ కేసు నుంచి బయటపడటానికే రేవంత్ రెడ్డి కుట్ర చేశాడని అన్నారు. ఓటుకు నోటు కేసు విచారణ న్యాయస్థానంలో తుది దశకు వచ్చిందని తెలిపారు. చివరి దశలో ఆధారాలు మాయం చేయడానికి పన్నిన కుట్ర అని అనుమానం వ్యక్తం చేశారు.



**చలికాలంలో అగ్ని ప్రమాదాలు జరుగుతాయా**

దొంగతనం చేసి దొరికిపోవడం రేవంత్ రెడ్డికి అలవాటే అని కేటీఆర్ విమర్శించారు. అగ్ని ప్రమాదాలు ఎప్పుడు జరుగుతాయి? చలికాలంలో ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరుగుతాయా అని ఆయన నిలదీశారు. చలికాలం పొద్దున 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిందట.. రేవంత్ రెడ్డి చెప్పే మాటలు మనం నమ్మాలా అని ప్రశ్నించారు. ఇది చేయించబడిన అగ్ని ప్రమాదం అని అన్నారు. తన క్రిమినల్ మనస్తత్వంతో రేవంత్ రెడ్డినే ల్యాబ్‌ను తగులబెట్టించాడని తెలిపారు.

**బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పట్టిందా**

నేరాల విచారణలో ఫోరెన్సిక్ కీలక విభాగమని కేటీఆర్ తెలిపారు. వేలాది కేసుల వివరాలు అగ్గికి బుగ్గి అయ్యాయని పేర్కొన్నారు. ఎంతోమంది క్రిమినల్స్ తప్పించుకునే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. టీజీఎఫ్ఎస్ఎల్ ప్రకటన తూతూ మంత్రంగా ఉందని తెలిపారు. ఏం నష్టం జరగలేదంటూ డ్రామాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక ఇన్‌స్పెక్టర్ నిజాయితీగా పనిచేశాడని చెప్పారు. ఉదయం 10 గంటలకు అగ్ని ప్రమాదం జరిగినట్లు ఎఫ్ఐఆర్‌లో స్పష్టంగా రాశారని తెలిపారు. మధ్యాహ్నం 3 గంటల దాకా మంటలు అదుపు చేయలేదని.. బుడ్డ బిల్డింగ్‌లో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పట్టిందా అని ప్రశ్నించారు. సాక్ష్యాలన్నీ మాయం చేయడానికి పోలీసులు సహకరించారని అన్నారు. మూడు అంతస్తుల భవనంలో మంటలు ఆర్పడానికి మూడు గంటలు పడుతుందంటే నమ్మాలా అని ప్రశ్నించారు. మొదటి అంతస్తులో మంటలు ఆర్పడానికే మూడు గంటలా అని నిలదీశారు.

**మీడియాను మేనేజ్ చేసి తిమ్మిని బమ్మి చేశారు**

ముఖ్యమైన కేసుల సమాచారం అంతా మొదటి అంతస్తులోనే ఉందని తెలిపారు. ఉదయం 10 గంటలకు ఫోరెన్సిక్ ల్యాబ్‌లో ఎవరూ డ్యూటీలో లేరట.. మీడియాను మేనేజ్ చేసి తిమ్మిని బమ్మి చేశారని మండిపడ్డారు. ఏం జరగలేదని తప్పు అని ఒక ఇన్‌స్పెక్టర్ చెప్పారని తెలిపారు. సర్వర్ రూమ్ కూడా కాలిపోయిందని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని చెప్పారు. సర్వర్‌లు కాలబెట్టినంక ఇంకేం ఉంటుందని కేటీఆర్ ప్రశ్నించారు. కుట్ర విజయవంతంగా పూర్తిచేశారని అన్నారు. 50 కంప్యూటర్లు తగలబడ్డాయని చెబుతున్నారని తెలిపారు. ఒక ప్రభుత్వం తమ ప్రభుత్వ కార్యాలయాన్ని తామే కాల్చిపారేయడం దేశంలో ఎక్కడా జరగదని విమర్శించారు.

**మేం సైంటిస్టులను తీసుకొని వస్తం.. మమ్మల్ని రానివ్వండి**

దొంగ, చీకటి ఏకమయ్యాయని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రే దొంగ అని అన్నారు. కేంద్రంతో రేవంత్ రెడ్డి ఇన్ని రోజులు మేనేజ్ చేసుకున్నాడని తెలిపారు. అమిత్ షా కాళ్లు పట్టుకుని అడుక్కున్నాడని పేర్కొన్నారు. చివరకు సాక్ష్యాధారాలను మాయం చేసే డెడ్లీ కుట్ర చేసిండని అన్నారు. ఇందులో కుట్రను కేంద్రం నిగ్గుతేల్చాలని కోరారు. రిటైర్డ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇది కుట్రపూరితంగా జరిగిందే.. ప్రమాదం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వేల కేసుల ఆధారాలు బుగ్గి చేశారని కేటీఆర్ మండిపడ్డారు. నేరగాళ్లు, రేపిస్టులు, దుర్మార్గులకు శిక్ష పడే అవకాశం లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. మేం సైంటిస్టులను తీసుకొని వస్తం.. మమ్మల్ని రానివ్వండి అని కోరారు. సీఎం రేవంత్ రెడ్డితో లాలూచీ లేకపోతే.. కేంద్రం ఎంక్వైరీ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ వచ్చి ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేస్తున్నారని అంటాడని.. బడే భాయ్, ఛోటే భాయ్ బంధం లేకపోతే వెంటనే విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కుంభకోణాన్ని మేం బయటపెట్టినం.. సీఎం బామ్మర్ది పాత్ర ఉందని బయటపెట్టినం.. కానీ కేంద్రం విచారణ జరపడం లేదని తెలిపారు. దారుణ నేరానికి ఒడిగట్టిన నేరగాడిని బయటపెట్టాలని డిమాండ్ చేశారు.

# నువ్వా, నేనా అన్నట్టు ప్రచారం

**వికారాబాద్ :** రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలు రసవత్తరంగా సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ కు ఎదురీత తప్పడం లేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్నామన్న ధీమా ఉందో లేక అభ్యర్థుల్లో గెలుపుపై నమ్మకం సన్నగిల్లిందో తెలియదు కానీ మొయినాబాద్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారుతోంది.ఎన్నికల నగారా మోగి, ప్రచారం హోరెత్తాల్సిన సమయంలో కాంగ్రెస్ అభ్యర్థులు కనీసం ఇంటి గడప దాటకపోవడం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్గా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల జాడ కనిపించడం లేదు. ప్రత్యర్థి పార్టీలు ఇంటింటి ప్రచారంతో దూసుకుపోతుంటే, కాంగ్రెస్ అభ్యర్థులు మాత్రం కనీసం ఓటర్లను కలిసే ప్రయత్నం కూడా చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతు న్నాయి. దీంతో సామాన్య ఓటర్లలో అసలు కాంగ్రెస్ పోటీలో ఉందా? లేక ముందే చేతులెత్తేసిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయిలో పార్టీ గ్రాఫ్ పడిపోతుం డటంతో అప్రమత్తమైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి స్వయంగా రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. వరుస సమావేశాలు నిర్వహిస్తూ కార్యకర్తల్లో జోష్ నింపేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ, అభ్యర్థుల్లో కదలక లేకపోవడం ఆయనకు కూడా తలనొప్పిగా మారింది. నాయకులు మేకప్ వేస్తున్నా, క్షేత్రస్థాయిలో ‘సీన్’ మాత్రం రివర్స్లో ఉండటం గమనార్హం.పార్టీ అంతర్గత వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం.. దీని వెనక ప్రధానంగా మూడు కారణాలు వినిపిస్తున్నాయి.అంతర్గత కుమ్ములాట లు... టికెట్ల కేటాయింపులో జరిగిన జాప్యం, అసంతృప్త నేతల సహాయ నిరాకరణ పార్టీని దెబ్బతీస్తోంది. మరో పక్క నాయకత్వ లోపం తేట తెల్లమవుతుంది. స్థానిక నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో క్యాడర్ ఎటు వెళ్లాలో తెలియక అయోమయం లో ఉంది.గెలుపుపై ధీమా లేకపోవ డంతో అభ్యర్థులు ఖర్చు పెట్టేందుకు వెనకాడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నాయకులు ఏసీ రూముల్లో సమావేశాలు పెడితే ఓట్లు రావు, ప్రజల్లోకి వస్తేనే ఫలితం ఉంటుంది అని కాంగ్రెస్ సానుభూతి పరులే బహిరంగంగా వ్యాఖ్యానిస్తుండటం గమనార్హం. మొత్తానికి మొయినాబాద్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనుకున్న కాంగ్రెస్ కల, ప్రస్తుత ‘ప్రచారలోపం’ చూస్తుంటే కల్లగానే మిగిలిపోయేలా ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. తక్షణమే వ్యూహం మార్చకపోతే ‘చేయి’ జారిపోవడం ఖాయంగా కనిపిస్తోంది.






## నకిలీ వైద్యులపై వేటు!

-మొదటిపేజీ తరువాయి

(టీఎంసీ)లో నమోదు చేయించుకోవాల్సిందేనని ఉన్నతాధికారులు కీలక ఆదేశాలను జారీ చేశారు. అలా చేయని వారిపై చట్టపరమైన చర్యలను తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా నకిలీ క్లినిక్‌లు, ఫేక్ ఆస్పత్రుల దందా కొద్ది రోజులుగా జోరుగా సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఎలాంటి అర్హతలు లేనప్పటికీ కొంతమంది మాత్రం డాక్టర్లుగా చెలామణి అవుతూ తెలిసీ తెలియని వైద్యం చేసేస్తున్నారు. కొందరు ఎంబీబీఎస్ డిగ్రీతో పక్కన ఎండీ, ఇతర డిగ్రీలు పెట్టుకొని ప్రాక్టీసు చేస్తూ పేషెంట్లను తప్పుదోవ పట్టిస్తున్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మరికొందరు ఆసుపత్రుల్లో కొన్ని నెలలపాటు కాంపౌండర్లుగా పనిచేసిన అనుభవంతో ఏకంగా బస్తీల్లో క్లినిక్‌లు ఏర్పాటు చేసి వైద్యం చేసేస్తున్నారు. ఎంబీబీఎస్, ఇతర ఫేక్ డిగ్రీలతో బోర్డులు పెట్టి మరీ ప్రాక్టీసు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఇదో వ్యవస్థీకృత వ్యాపారంగా మారింది. గత కొన్ని నెలలుగా టీఎంసీ ప్రతినిధుల తనిఖీల్లో ఇలాంటి నకిలీ క్లినిక్‌లు పెద్ద సంఖ్యలో బయటపడ్డాయి. దాదాపు 300 మంది నకిలీ వైద్యులను గుర్తించిన అధికారులు, కేసులను కూడా నమోదు చేశారు. అయినప్పటికీ ఇంకా చాలా ప్రాంతాల్లో ఈ దందా నడుస్తోంది. అవసరం లేకున్నప్పటికీ యాంటి బయోటిక్స్, స్టెరాయిడ్లు, ఇతర ఔషధాలను రోగులకు సిఫార్సు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.

**లోపాలుంటే సరిదిద్దుకోవాలి**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చిన్నా పెద్దవి కలిపి సుమారు 5 వేల ఆస్పత్రులు, క్లినిక్‌లున్నాయి. కొంతమంది మెడికల్ కౌన్సిల్ వద్ద నమోదు చేయించకుండానే సేవలందిస్తున్నారు. మరికొంతమంది వైద్యులు ఎంబీబీఎస్ మాత్రమే నమోదు చేసి, పీజీ ఇతర అర్హతలను నమోదు చేయకుండానే విధులు నిర్వహిస్తున్నారని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి వివరించారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో పని చేస్తున్న వైద్యులు టీఎంసీ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు, అర్హత నమోదు పత్రాలు సక్రమంగా ఉన్నాయో లేదో పరిశీలించుకొని లోపాలుంటే సరిదిద్దుకోవాలని సూచించారు. అధికారుల తనిఖీల్లో దొరికినట్లయితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

ఎలాంటి అర్హతలు లేనప్పటికీ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ డాక్టర్ల ఆటలు ఇక ఎంతో కాలం సాగవు. మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు చాలా చోట్ల ఆర్ఎంపీలు తమ స్థాయికి మించిన చికిత్సలను అందిస్తున్నారు. వీరంతా పేషెంట్లకు ప్రాథమిక చికిత్సను మాత్రమే అందించాల్సి ఉన్నప్పటికీ, పరిస్థితి మాత్రం కొంత భిన్నంగా ఉంది. పేషెంట్ల పరిస్థితి సీరియస్ అయినప్పుడు వైద్య నిపుణుల వద్దకు సిఫార్సు చేయాల్సి ఉన్నప్పటికీ కొంతమంది మాత్రం అలా చేయడం లేదు. తమకు తెలియని వైద్యం అందించి పేషెంట్ల ప్రాణాల మీదకు తెస్తున్నారు. ఈ నేపథ్యంలోనే నకిలీ డాక్టర్ల భరతం పట్టాలని వైద్యశాఖ నిర్ణయించింది.

## క్లైమాక్స్‌కు పురపోరు

-మొదటిపేజీ తరువాయి

ప్రయత్నం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి బహిరంగసభల ద్వారా ప్రచారం నిర్వహిస్తూ కాంగ్రెస్ కార్యకర్తల్లో జోష్ నింపుతున్నారు. ఇటు మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రోడ్‌షోలు, సుడిగాలి పర్యటనలతో ప్రచారం హోరెత్తిస్తున్నారు. బీఆర్ఎస్ తరపున ప్రచార బరిలోకి దిగిన కేటీఆర్, హరీష్ రావు రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ మంత్రులు, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సొంత నియోజకవర్గాల్లో ప్రచారంపై దృష్టి పెట్టారు. బీజేపీ ప్రచారంలో కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్ రావులతో పాటు పక్క రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రముఖ నేతలు చేస్తున్న ప్రచారం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్, మాజీ ఎంపీ నవనీత్ కౌర్ బీజేపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇటు అన్ని ప్రధాన పార్టీల అభ్యర్థులు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఇంటింటి ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

మున్సిపల్ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం భారీ ఎత్తున భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ నిఘా వ్యవస్థను సిద్ధం చేస్తోంది. ఈ నెల 11న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటలవరకు 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ జరుగనుంది. 13న కౌంటింగ్ నిర్వహిస్తారు. 100శాతం వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షిస్తామని ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేటు సంస్థ రాష్ట్ర ఎన్నికల సంఘంతో సమన్వయం చేసుకుంటూ 30 జిల్లాల్లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో 11,000 కంటే ఎక్కువ స్మార్ట్ కెమెరా యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. రెండు వారాలుగా హోరా హోరీగా జరిగిన పార్టీల ప్రచార పర్వంతో పురపాలికల ఓటర్లు ఏ పార్టీకి పట్టం కడతారో ఈ నెల 13న కౌంటింగ్‌లో తేలిపోనుంది.

## జంట నగరాలుగా ఆ రెండు సిటీస్



**వరంగల్ :** మున్సిపల్ ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో మెజారిటీ మున్సిపాలిటీలను తన ఖాతాలో వేసుకోవాలని అధికార కాంగ్రెస్ భావిస్తోంది. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రచారరంగంలోకి దిగారు. ఫిబ్రవరి 4న మిర్యాల గూడలో ప్రచారం నిర్వహించారు. ఇక ఫిబ్రవరి 5న కరీంనగర్ జిల్లాలో ప్రచారం నిర్వహించారు. చొప్పదండిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీఎం కీలక ప్రకటన చేశారు. భవిష్యత్ ప్రణాళికలో కరీంనగర్, వరంగల్ జంటనగరాలుగా మారాలని ఆకాంక్షించారు. ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణం, మామునూరు విమానాశ్రయం ఆధునీకరణలతోపాటు, రెండు ప్రాంతాల మధ్య పెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలనే ఆలోచన ఉన్నట్లు తెలిపారు. ఇది మౌలిక సదుపాయాల కల్పనతోపాటు స్థిరమైన అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుందని తెలిపారు.వరంగల్, కరీనగర్ మధ్యలో భారీ డంపింగ్ యార్డు నిర్మించి, అక్కడ నగర వ్యర్థాలను విద్యుత్‌గా మార్చే ప్రణాళిక దేశవ్యాప్తంగా మార్గదర్శకంగా మారుతుందని సీఎం తెలిపారు. ఇలాంటి వేస్ట్?టు?ఎనర్జీ ప్రాజెక్టులు నీటి సమస్యలను తగ్గించి, విద్యుత్‌ను పెంచుతాయి. మున్సిపల్ కార్పొరేషన్ల అభివృద్ధితోపాటు, ఈ చొరవ గ్రీన్ ఎనర్జీ మోడల్‌గా పనిచేస్తూ, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఫలితంగా, స్థానిక సమాజాలకు శుభ్రత, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విమానాశ్రయం, రింగ్ రోడ్‌తో కలిసి ఈ జంట నగరాలు ఆకర్షణీయ పెట్టుబడి కేంద్రాలుగా మారతాయి. వ్యాపారం, పటకం, ఉత్పాదక రంగాలు ఊపందుకుని, ఉద్యోగాలు సృష్టించే అవకాశం ఉంది. అయితే, భూమి సేకరణ, ఆర్థిక భారం వంటి సవాళ్లను అధిగమించాలి. విజయం కోసం ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యాలు అవసరం. దీర్ఘకాలంలో, తెలంగాణ పట్టణాలలో అభివృద్ధి అసమానతలు తగ్గుతాయి.ప్రభుత్వ బడ్జెట్, కేంద్ర సహాయం, స్థానిక సహకారం ఈ ప్రాజెక్టుల వేగాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే విజయవంతమైన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్ ఆధారంగా, ఇక్కడ కూడా సామర్థ్యవంతమైన ప్రణాళికలు ఫలిస్తాయి. మొత్తంగా, ఈ చొరవ తెలంగాణను ఆధునిక రాష్ట్రంగా రూపొందిస్తూ, గ్రామీణ పట్టణ సమతుల్యతను సాధిస్తుంది.

# గర్భాశయ క్యాన్సర్‌కు మహిళలు బలి కావాల్సిందేనా?



భారతదేశంలో మహిళల ప్రాణాలను హరిస్తున్న వ్యాధుల్లో ఇది రెండో స్థానంలో ఉంది. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు దీని బారిన పడుతున్నారు. అయితే ఈ వ్యాధిలో ఉన్న ఒకే ఒక్క ఊరట కలిగించే విషయం ఏంటంటే.. దీనిని మనం ముందే గుర్తించి 100 శాతం నివారించవచ్చు.
దురదృష్టవశాత్తూ మన దేశంలో అవగాహన లేకపోవడం, పరీక్షలు చేయించుకోవడానికి మొహమాటపడటం వల్ల చాలా మంది మహిళలు చివరి దశలో ఆసుపత్రికి వస్తున్నారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. అసలు ఈ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ఎందుకు వస్తుంది? మన శరీరంలో జరిగే ఎలాంటి మార్పులు ప్రమాదానికి సంకేతాలు? గర్భాశయ ముఖద్వారం లేదా సెర్విక్స్ అనేది గర్భాశయానికి, యోనికి మధ్య ఉండే ఒక కండరాల ద్వారం. ఇది మన శరీరంలో ఒక మల్టీ టాస్కర్ లాగా పనిచేస్తుంది. బయటి ఇన్ఫెక్షన్లు గర్భాశయంలోకి వెళ్లకుండా రక్షణ కవచంలా అడ్డుకుంటుంది. పీరియడ్స్ సమయంలో రక్తం బయటకు వెళ్లేలా చూస్తుంది. అంతేకాకుండా, శిశువు జనన సమయంలో ఇది వ్యాకోచించి ప్రసవం సులభంగా జరిగేలా చేస్తుంది. ఇంతటి కీలకమైన సెర్విక్స్ ఆరోగ్యంగా ఉంటేనే మహిళల పునరుత్పత్తి వ్యవస్థ పటిష్టంగా ఉంటుంది.
పొంచి ఉన్న ముప్పు..గర్భాశయానికి వచ్చే సమస్యలు కేవలం క్యాన్సర్ మాత్రమే కాదు, సాధారణ వాపు నుంచి రకరకాల ఇబ్బందులు కలగవచ్చు. క్యాన్సర్ రావడానికి ముందు కణాలలో జరిగే మార్పు గర్భాశయ డిస్ప్లాసియా. ఇది కంటికి కనిపించదు, కేవలం పరీక్షల ద్వారానే బయటపడుతుంది. గర్భాశయ క్యాన్సర్‌కు ప్రధాన కారణం హ్యూమన్ పాపిల్లోమా వైరస్ (ఊఖఎ). ఈ వైరస్ చాలా కాలం పాటు శరీరంలో ఉంటే అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉంది. గర్భాశయంలో పెరిగే చిన్న గడ్డలు. ఇవి అన్నీ క్యాన్సర్ కానప్పటికీ, వెంటనే వైద్యుడిని సంప్రదించి పరీక్షించుకోవడం ఉత్తమం.
పాటించాల్సిన జాగ్రత్తలు.. పరిశుభ్రత: పీరియడ్స్ సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. నాణ్యమైన శానిటరీ ప్యాడ్‌లు వాడాలి. వాటిని నిర్ణీత సమయానికి మారుస్తూ ఉండటం వల్ల ఇన్ఫెక్షన్లను అరికట్టవచ్చు. స్క్రీనింగ్ పరీక్షలు: 25 ఏళ్లు దాటిన ప్రతి మహిళ క్రమం తప్పకుండా పాప్ స్మెర్, స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి. దీనివల్ల క్యాన్సర్ రాకముందే కణాల్లో మార్పులను గుర్తించవచ్చు. టీకా వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా ఈ క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చు. 11 ఏళ్ల నుంచి 26 ఏళ్ల లోపు ఈ టీకా తీసుకోవడం చాలా శ్రేయస్కరం. జీవనశైలి మార్పులు: ధూమపానం వంటి అలవాట్లు మానుకోవాలి. ప్రాసెస్ చేసిన ఆహారాన్ని పక్కన పెట్టి, పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. లక్షణాలను గుర్తించడం: పొత్తికడుపు నొప్పి లేదా అసాధారణ రక్తస్రావాన్ని ఎప్పుడూ నిర్లక్ష్యం చేయకూడదు. మీ శరీరంలో ఈ క్రింది మార్పులు కనిపిస్తే ఆలస్యం చేయకుండా గైనకాలజిస్ట్‌ను సంప్రదించాలి. యోని నుండి విపరీతమైన స్రావం కావడం, దాని రంగు లేదా వాసనలో మార్పు రావడం ప్రధాన లక్షణాలు. పీరియడ్స్ మధ్యలో లేదా శృంగారం తర్వాత రక్తస్రావం కావడం, శృంగార సమయంలో విపరీతమైన నొప్పి రావడం ప్రమాద సంకేతాలు. పొత్తికడుపు లేదా నడుము భాగంలో మొండి నొప్పి వేధిస్తున్నా అది గర్భాశయ సమస్యే కావచ్చు. గర్భాశయ క్యాన్సర్ అనేది అకస్మాత్తుగా వచ్చేది కాదు. ఇది శరీరంలో కణాల మార్పు ద్వారా నెమ్మదిగా మొదలవుతుంది. మనకు సరైన అవగాహన ఉండి, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటే దీని నుంచి 100 శాతం కోలుకోవచ్చు. మీ శరీరం ఇచ్చే చిన్న చిన్న సంకేతాలను కూడా విస్మరించకండి.

# భోజనం చేసే సమయంలో చెమట పడితే డయాబెటిస్ వస్తుందా?



కొంత మందికి భోజనం చేసేటప్పుడు చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కొంతమంది తినేటప్పుడు చెమట పట్టడం మీరు గమనించి ఉంటారు. కొంతమందికి తక్కువ మొత్తంలో చెమట పడుతుంటే, మరికొందరికి ఏకదాటిగా చెమట పడుతుంది. ముఖ్యంగా నుదిటిపై చెమట ఎక్కువగా పడుతుంది. వేడి ఆహారం తినడం వల్ల ఈ సమస్య తలెత్తుతుందని అందరూ అనుకుంటారు. కానీ మీరు చల్లగా ఏదైనా తిన్నప్పుడు లేదా తాగిన ప్రతిసారీ ఇలా జరిగితే లేదా చలికాలంలో కూడా ఇలా చెమట పడుతుంటే అది సాధారణం కాదు. కాబట్టి దీనికి కారణం ఏమిటి? ఇది ఏదైనా వ్యాధికి సంకేతమా? ఢిల్లీ ఎయిమ్స్‌కు చెందిన డాక్టర్ హిమాన్షు భదాని మాట్లాడుతూ.. తినేటప్పుడు చెమట పట్టే సమస్యను వైద్యపరంగా గస్టేటరీ చెమట అని పిలుస్తారు. అధిక కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు శరీరం చెమట పట్టడం ప్రారంభిస్తుంది. ఇది సాధారణంగా వెచ్చని శరీరం ఉన్నవారిలో కనిపిస్తుంది. తినేటప్పుడు చెమట పట్టడం కొందరికి సాధారణం. కానీ మరికొందరికి ఇది వివిధ వ్యాధుల లక్షణం కావచ్చు. డాక్టర్ హిమాన్షు మాట్లాడుతూ భోజనం చేసేటప్పుడు చెమటలు పట్టడం మధుమేహం ప్రారంభ లక్షణం కావచ్చు. ఎవరికైనా డయాబెటిస్ ఉంటే అది నరాల దెబ్బతినడానికి కారణమవుతుంది. కాబట్టి ఇది భోజనం చేసేటప్పుడు చెమట పట్టడానికి దారితీస్తుంది. కానీ ఇది అన్ని సందర్భాల్లోనూ జరగదు. కొందరికి ఇది థైరాయిడ్ లేదా హార్మోన్ల మార్పుల వల్ల కూడా జరగవచ్చు. పెద్దల మాదిరిగానే పిల్లలు కూడా తినేటప్పుడు చెమట పట్టవచ్చు. పిల్లలు కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు, దానిని జీర్ణం చేసుకోవడానికి వారి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. ఇది చెమట పట్టడానికి దారితీస్తుంది. అయితే సాధారణ ఆహారం తిన్నప్పుడు కూడా పిల్లలకు చెమటలు పడుతుంటే లేదా వేగంగా బరువు తగ్గుతుంటే, తినేటప్పుడు వారి హృదయ స్పందన రేటు పెరగకపోతే వైద్యుడిని సంప్రదించడం మంచిది.

## రోజుకు ఎన్ని కప్పులు
# కాఫీ తాగుతున్నారు?



ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా చాలా మందికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. చాలా మందికి కాఫీ అంటే కేవలం పానీయం కాదు, అదొక సెంటిమెంట్. అందుకే ఉదయం నిద్రలేచిన వెంటనే ఘుమఘుమలాడే కప్పు కాఫీ లేకుండా వీరికి రోజు ప్రారంభం కాదు. కాఫీలోని కెఫిన్ తక్షణ శక్తిని ఇస్తుంది. కానీ ఒక రోజులో ఎన్ని కప్పుల కాఫీ తాగాలి? ఎప్పుడు తాగాలి? అనే విషయాలు కూడా చాలా ముఖ్యం. కాఫీని మితంగా తాగడం వల్ల శరీరానికి ఔషధంలా పనిచేస్తుంది. కాఫీలోని కెఫిన్ మెదడును ఉత్తేజపరుస్తుంది. మగతను దూరం చేస్తుంది. అలాగే కాఫీని మితంగా తాగడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం కూడా తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. కాఫీ కాలేయం నుంచి విషాన్ని బయటకు పంపి, కొవ్వు కాలేయ సమస్యను తగ్గిస్తుంది. ఇది శరీరంలో జీవక్రియ వేగాన్ని పెంచుతుంది. ఇది కొవ్వును కరిగించడంలో సహాయపడుతుంది. పరిశోధన ప్రకారం బ్లాక్ కాఫీ టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం రోజుకు 2 కప్పుల కాఫీ తాగడం సురక్షితం. అయితే ఆరోగ్యకరమైన వ్యక్తి రోజుకు 400 మిల్లీగ్రాముల కంటే ఎక్కువ కెఫిన్ తీసుకోకూడదు. ఒక కప్పు కాఫీలో దాదాపు 100 మిల్లీగ్రాముల కెఫిన్ ఉంటుంది. కాబట్టి ఆరోగ్యవంతమైన వ్యక్తులు ఒక రోజులో రెండు నుంచి మూడు కప్పుల కాఫీ తాగవచ్చు. మీరు రోజుకు 4–5 కప్పుల కంటే ఎక్కువ కాఫీ తాగితే, అది తీవ్రమైన పరిణామాలకు దారి తీస్తుంది. అధికంగా కాఫీ సేవిస్తే చేతులు, కాళ్ళు నిరంతరం వణుకుట లేదా చిరాకు వంటి సమస్యలను కలిగిస్తుంది. అలాగే కెఫిన్ రక్తపోటులో అకస్మాత్తుగా పెరుగుదలకు కారణమవుతుంది. దానితో పాటు, కాఫీ వల్ల కలిగే అతిపెద్ద సమస్య రాత్రి సమయానికి నిద్రపోలేకపోవడం. అలాగే కాఫీ కడుపు రుగ్మతలకు కూడా కారణమవుతుంది. ఎక్కువ కాఫీ పిత్తాన్ని పెంచుతుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య కాఫీ తాగడం చాలా ప్రభావవంతంగా ఉంటుంది. కానీ సాయంత్రం 4 గంటల తర్వాత కాఫీ తాగకపోవడమే మంచిది. కాఫీలోని కెఫిన్ ప్రభావం శరీరంలో 12 గంటలకు పైగా ఉంటుంది. మీరు సాయంత్రం వేళల్లో కాఫీ తాగితే, అది రాత్రి నిద్రకు భంగం కలిగిస్తుంది. దీని వలన మరుసటి రోజు మొత్తం అలసిపోయినట్లు అనిపిస్తుంది.

# ఆరోగ్యకరమైన రోజుకు బలమైన ఆరంభం ఇదే..!



సమతుల్య పోషకాలు ఉన్న బ్రేక్‌ఫాస్ట్ మాత్రమే నిజమైన ఆరోగ్యాన్ని ఇస్తుంది. మంచి బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండాల్సిన ముఖ్యమైన పోషకాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఒక ఆదర్శ బ్రేక్‌ఫాస్ట్‌లో ఈ నాలుగు తప్పనిసరిగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు శక్తికోసం, ప్రోటీన్లు కండరాల బలం, దీర్ఘకాల తృప్తికోసం ఫైబర్ జీర్ణక్రియ, షుగర్ నియంత్రణకోసం ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల సమతుల్యం కోసం తప్పనిసరి. ఉదయం తినే బ్రేక్‌ఫాస్ట్ మన శరీరానికి ఇంధనం లాంటిది. రాత్రంతా ఉపవాసంలో ఉన్న శరీరానికి కావాల్సిన శక్తిని అందించి, మెదడు పనితీరును చురుకుగా ఉంచడంలో బ్రేక్‌ఫాస్ట్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే “ఏది తిన్నా సరిపోతుందా?” అంటే కాదు. సమతుల్య పోషకాలు ఉన్న బ్రేక్‌ఫాస్ట్ మాత్రమే నిజమైన ఆరోగ్యాన్ని ఇస్తుంది. మంచి బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండాల్సిన ముఖ్యమైన పోషకాలు గురించి ఇప్పుడు తెలుసుకుందాం. ఒక ఆదర్శ బ్రేక్‌ఫాస్ట్‌లో ఈ నాలుగు తప్పనిసరిగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు శక్తి కోసం, ప్రోటీన్లు కండరాల బలం, దీర్ఘకాల తృప్తి కోసం ఫైబర్ జీర్ణక్రియ, షుగర్ నియంత్రణ కోసం ఆరోగ్యకరమైన కొవ్వులు హార్మోన్ల సమతుల్యం కోసం తప్పనిసరి. 1. ఇడ్లీ / దోసె + సాంబార్:ఫెర్మెంటెడ్ ఆహారం కావడంతో జీర్ణక్రియకు మంచిది సాంబార్‌లో కూరగాయలు, పప్పులు ఉండటం వల్ల ప్రోటీన్, ఫైబర్ లభిస్తాయి2. ఓట్స్ ఉప్మా / ఓట్స్ పోరిడ్జ్: ఫైబర్ అధికంగా ఉండి కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. షుగర్ ఉన్నవారికి మంచి ఎంపిక.3. రాగి జావ / రాగి దోసె: కాల్షియం, ఐరన్ సమృద్ధిగా ఉంటాయి. ఎముకల ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం.4. గుడ్లు (ఉడికించినవి): హై క్వాలిటీ ప్రోటీన్. బరువు తగ్గాలనుకునేవారికి సరైన ఆహారం. 5. పండ్లు + నట్స్: పండ్లలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. తేలికగా ఉండే బ్రేక్‌ఫాస్ట్ కావాలనుకునేవారికి మంచిది. బ్రేక్‌ఫాస్ట్‌లో ఉండకూడదనవి.. అధిక చక్కెర ఉన్న ఆహారాలు బేకరీ ఐటెమ్స్ (పఫ్‌లు, క్రీమ్ బన్స్) డీప్ ఫ్రైడ్ స్నాక్స్ కేవలం టీ లేదా కాఫీతో బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం ఇవి తాత్కాలికంగా శక్తినిచ్చినా, దీర్ఘకాలంలో అలసట, బరువు పెరుగుదలకు కారణమవుతాయి. ఉదయం లేచిన 1, 2 గంటల్లోపు బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవడం ఉత్తమం. ఇది మెటబాలిజాన్ని యాక్టివ్ చేసి రోజంతా శక్తిని నిలబెడుతుంది. పోషక నిపుణుల ప్రకారం.. బ్రేక్‌ఫాస్ట్ స్కిప్ చేయడం వల్ల షుగర్ లెవల్స్ అసమతుల్యం అవుతాయి, అలాగే ఎక్కువగా తినే అలవాటు పెరుగుతుంది. రోజు ఎలా ప్రారంభమవుతుందో, రోజు అంతా అలాగే సాగుతుంది. కాబట్టి మీ జీవనశైలి, వయసు, ఆరోగ్య స్థితికి తగ్గట్టు బ్రేక్‌ఫాస్ట్‌ను ఎంచుకోవడం చాలా ముఖ్యం. మంచి బ్రేక్ ఫాస్ట్ మంచి ఆరోగ్యానికి సంకేతమంటున్నారు ఆరోగ్య నిపుణులు.


## కోట్లు వృథా.. రూ3.38 కోట్లతో నిర్మాణాలు..

# నిధుల కొరతతో భారమైన నిర్వహణ

**ఆదిలాబాద్ :** ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో గల బంగారుగూడ డంపింగ్ యార్డులో ఏర్పాటు చేసిన ఎనిమల్ కేర్ సెంటర్, ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎఫ్ఎస్‌టీపీ)లు నిరుపయోగంగా మారాయి. ఆదిలాబాద్ మున్సిపాలిటీలో ఆగస్టు 17, 2021లో పారిశుధ్య నిర్వహణతోపాటు వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి రూ.2.56 కోట్లతో ఎఫ్ఎస్‌టీపీని నిర్మించారు. మలం ద్వారా ఎరువును తయారు చేయడానికి ఎఫ్ఎస్‌టీపీ ఉయోగపడుతుంది. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల తమ ఇండ్లలోని సెప్టిక్ ట్యాంకులు నిండిపోతే సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎఫ్ఎస్‌టీపీ తరలిస్తారు. ఇక్కడ తయారైన ఎరువులను హరితహారంలో నాటిన మొక్కలకు ఉపయోగిస్తారు.

**ఎనిమల్ కేర్ సెంటర్**

డంపింగ్‌యార్డులో రూ.82 లక్షలతో ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని కుక్కల బెడదను నివారించడంతోపాటు వాటి సంతానం నివారణకు ఈ కేంద్రం ఉపయోగపడుతుంది. గతంలో పట్టణంలోని వీధి కుక్కలను మున్సిపాలిటీ సిబ్బంది బోనుల ద్వారా ఈ కేంద్రానికి తీసుకొచ్చే వారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ టీకాలు వేసి కొన్ని రోజులపాటు రక్షించి తిరిగి వీధుల్లో వదిలేసేవారు. ఈ కేంద్రం పనిచేయడం లేదు. డంపింగ్



యార్డులో ఎనిమల్ కేర్ సెంటర్, ఎఫ్ఎస్‌టీపీలు నిర్వహణను మున్సిపల్ అధికారులు గాలికి వదిలేశారు. దీంతో రూ.3.38 కోట్లతో నిర్మించిన రెండు కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. ఇందులోని యంత్రాలు పనికిరాకుండా పోయాయి. పట్టణంలోని పారిశుధ్య నివారణతోపాటు వాతావరణ కాలుష్యం, కుక్కల బెడద నివారించడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలు పనికిరాకుండా పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# భైంసా బల్దియా అస్తవ్యస్తం..

## రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో కుంటుపడిన అభివృద్ధి

**బీఆర్ఎస్ హయాంలోనే ప్రగతి**

**మౌలిక వసతులు కల్పించడంలో విఫలం**

**భైంసా :** నిర్మల్ జిల్లా భైంసా మున్సిపాలిటీకి నిధులు కేటాయించకపోవడంతో అభివృద్ధి కుంటుపడింది. కేసీఆర్ పాలనలో దూసుకెళ్లిన బల్దియా.. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో చతికిలా పడింది. కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీలో సుమారు రూ.20 కోట్లతో రోడ్లు, మురికి కాలువల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పార్కుల అభివృద్ధి, డివైడర్లు ఏర్పాటు చేస్తే.. కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత రోడ్లు, డ్రైనేజీ మరమ్మతులు చేయించకపోవడం విమర్శలకు తావిస్తున్నది. భైంసా మున్సిపాలిటీలో బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి మినహా కాంగ్రెస్ పాలనలో ఏమి కాలేదు. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాలు, ఓపెన్ జిమ్‌లు మెయింటనెన్స్ లేక పనికి రాకుండా పోతున్నాయి. దీనికితోడు పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది.

**రూ 20 కోట్లతో ప్రగతి పనులు**

కేసీఆర్ హయాంలో భైంసా మున్సిపాలిటీలో సుమారు రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టగా, అందులో బీటీ, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు. అంతేగాకుండా సెంట్రల్ లైటింగ్, డ్రైనేజీల నిర్మాణాలు, వైకుంఠధామం నిర్మించారు. క్రీడా ప్రాంగణాలు, పార్కులు, నర్సరీలు, ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో కొన్ని నిర్వహణ లేక కొట్టుమిట్టాడుతున్నాయి.

**నిరూపయోగంగా మినీ స్టేడియం**

క్రీడాకారుల కోసం భైంసా పట్టణంలో రూ.5.20 కోట్లతో నిర్మించిన మినీ స్టేడియం నిరుపయోగంగా మారింది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు తీరుతో క్రీడా మైదానం ధాన్యం ఆరబోసేందుకు ఉపయోపడుతున్నది. బీఆర్ఎస్ పాలనలో



పండుగ వాతావరణం ఉండేది.

**నిలిచిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు**

కేసీఆర్ సర్కారు రైతులు, కూరగాయాల వ్యాపారుల సౌకర్యార్థం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో రూ.7.20 కోట్లతో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వేజ్ మార్కెట్ నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపు 50 శాతం పనులు పూర్తయ్యాయి. ఇంతలోనే కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం మౌలిక వసతులు కల్పించకపోవడంతో రోడ్డుపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**పంపిణీకి నోచుకోని 640 డబుల్ బెడ్రూంలు..**

కేసీఆర్ హయాంలో భైంసా పట్టణంలో 640 డబుల్ బెడ్రూంల ఇండ్ల నిర్మాణం పూర్తయ్యాయి. సొంతిల్లు కట్టుకునే స్థోమత లేని వారికి 440 ఇండ్లకు లక్కీ డ్రా తీశారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక వాటిని ఇప్పటివరకు అందించలేదు.

# రామగుండంలో గ'మ్మత్తు' ప్రచారం..

## ఉదయం ఓ అభ్యర్థికి.. సాయంత్రం మరో అభ్యర్థికి..

**కోల్ :** రామగుండంలోని 60 డివిజన్లలో గమ్మత్తు ప్రచారం జరుగుతోంది. ఇంటింటికి ప్రచారంలో అభ్యర్థులు మారుతున్నా.. వెనుకాల జెండాలు పట్టుకొని ఓట్లు అడిగే ప్రచార మహిళలు మాత్రం మారడం లేదు. వచ్చిన వారే మళ్లీ మళ్లీ రావడం, గంటల వ్యవధిలోనే ప్రచారంలో గుర్తులు మారడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈసారి రామగుండంలో ప్రధాన పార్టీల నుంచి కొత్త వ్యక్తులకు టికెట్లు రావడం, మాజీ కార్పొరేటర్లు ఎక్కువ చోట్ల పోటీ చేయకపోవడంతో ఓటర్లు గందరగోళంకు గురవతున్నారు. అభ్యర్థుల తరపున ప్రచారంకు సీనియర్ నాయకులు వస్తేనే గుర్తు పట్టే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో కొన్ని డివిజన్లలో అభ్యర్థులకు ప్రచార కార్యకర్తల కొరత ఉంటోంది. దీంతో ఉదయం పూట ఓ అభ్యర్థికి, పగలు మరో అభ్యర్థి తరపున, ఇక మాపటీలి ఇంకో అభ్యర్థి తరపున యువకులు, మహిళలు ప్రచారానికి వెళ్తున్నారు. ప్రచారానికి రోజుకు రూ.200 చొప్పున ఇస్తుండటంతో కొంతమంది ఏ అభ్యర్థి పిలిస్తే ఆ అభ్యర్థి వెంట ప్రచారానికి వెళ్తున్నారు. ఇక్కడే ఓటర్లను తికమక పెడుతుంది. ఉదయం బీఆర్ఎస్ అభ్యర్థి తరపున ప్రచారం కోసం వస్తే కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఇంటింటికి వెళ్లి బొట్టు పెట్టి అభ్యర్థిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది.

ఐతే ఈ ప్రచారం ముగియగానే మళ్లీ అదే మహిళలు మధ్యాహ్నం మరో పార్టీ అభ్యర్థి తరపున ప్రచారం చేస్తున్నారు. ఉదయం కారు గుర్తుకు ఓటేయాలని ఓ ఇంటికి వెళ్లి అడిగిన



ప్రచార మహిళలే మధ్యాహ్నం అదే ఇంటికి ఇంకో అభ్యర్థి తరపున వెళ్లి మహిళలు గంట వ్యవధిలో మరో పార్టీ గుర్తుకు ఓటు వేయాలని అడగడంతో అవాక్కవుతున్నారు. ఒకే రోజు మూడు సార్లు ముగ్గురు అభ్యర్థుల తరపున వచ్చిన మహిళలే మళ్లీ మళ్లీ వచ్చి ఓట్లు అడగడంతో గందరగోళానికి గురవుతున్నారు. దాదాపు అన్ని డివిజన్లలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రచారంకు వెళ్తే నాలుగు డబ్బులు వస్తాయని ఆశతో వెళ్తున్న మహిళలు, యువతులు ఒకే ఇంటికి మూడుసార్లు వచ్చి ముగ్గురు అభ్యర్థులకు ఓటు వేయాలని కోరడం ఓటర్లకు ఆశ్చర్యమనిపిస్తోంది

### హుజురాబాద్ మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం..

**బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మంద రమేష్**

**21 వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ ను గెలిపించాలని ప్రచారం**



హుజరాబాద్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, హుజురాబాద్ మున్సిపల్‌పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని మున్సిపల్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మంద ఉమాదేవి-రమేష్ (ఆర్కే) అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని 21 వార్డులో బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్ ను గెలిపించాలని కోరుతూ ఆయన ఆదివారం విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హాయంలోనే హుజురాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడిచినా హుజురాబాద్ కు చేసిందేమీ లేదని మండిపడ్డారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాల్లో ఏ ఒక్క పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలే తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయని, హుజురాబాద్ మున్సిపల్ పై బీఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. హుజురాబాద్ పట్టణ ప్రజలు ఆలోచించి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### వీణవంక శివాలయంలో లడ్డులతో మహాభిషేకం



**వీణవంక :** వీణవంక మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామి వారికి లడ్డులతో మహాభిషేక కార్యక్రమాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. అర్చకులు సుబ్రమణ్యంశర్మ మంత్రాల మధ్య స్వామి వారికి అభిషేకాన్ని చేయగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామిడి శ్రీనివాస్, ఉపసర్పంచ్ తాళ్లపెల్లి మహేశ్ గౌడ్, సభ్యులు మహాశివరాత్రి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 15, 16 తేదీలలో వెయ్యేళ్ల చరిత్ర కలిగిన వీణవంక శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఆలయకమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దీవెనలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసవి, వనిత క్లబ్ సభ్యులు అల్లెంకి సాంబమూర్తి, రమేష్, నాగన్న, విశ్వంభర్, లక్ష్మయ్య, స్థానికులు పాల్గొన్నారు.

### ఝూఠా మాటల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి..

### జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్



**జగిత్యాల :** ఆరు గ్యారంటీలంటూ ఝూఠా మాటలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసగిస్తున్న కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ఓటర్లకు పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా జగిత్యాల పట్టణంలోని ఆరో వార్డులో దీ=ా అభ్యర్థి నీలి ప్రతాప్ కు మద్దతుగా ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీ=ా హయాంలో జగిత్యాల పట్టణం 60 సంవత్సరాలలో కాని అభివృద్ధి కేవలం పది సంవత్సరాలలో మాత్రమే జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినా ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని, అధికారం కోసం ఆరు గ్యారెంటీలు, 420 హామీలంటూ ఝూటా మాటలు చెప్పి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వనికి బుద్ధి చెప్పాలంటే మీ అమూల్యమైన ఓటు కారు గుర్తుపై వేసి జగిత్యాల మున్సిపల్ పై గులాబీ జెండా ఎగరవేయాలని కోరారు.

### ఇల్లెందు మున్సిపాలిటీ అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే..

### అభివృద్ధి పనులు చూసే బీఆర్ఎస్‌లోకి..!

**ఇల్లెందు :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులను చూసి మళ్లీ కేసీఆర్ సీఎం కావాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ నేతలు భారీగా బీఆర్ఎస్‌లోకి చేరుతున్నారు. ఇల్లెందులో కాంగ్రెస్ పార్టీ నుండి పలు కుటుంబాలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆదివారం ఇల్లెందు మున్సిపాలిటీ పరిధి 14వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుండి సీనియర్ నాయకులు ఔజర్ లోద్, రాంగోపాల్, అరుణ ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ.. ప్రస్తుత కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే నలుగురు అనుచరులు అనేక దౌర్జన్యాలకు, దందాలకు పాల్పడి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ఇల్లెందును అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని, మా హయాంలో మంజూరైన పనులు చేసిన అభివృద్ధిని ప్రస్తుతం ఎమ్మెల్యే తాను చేసినట్టుగా చెప్పుకుంటున్నారని.. ఇల్లెందు మున్సిపాలిటీని 350 కోట్లతో అభివృద్ధి చేసిన ఘనత బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్‌దేనని అన్నారు. మా హయాంలో ఇల్లెందు బస్ డిపో, పట్టణంలో రోడ్ల విస్తీర్ణం, సీసీ రోడ్లు, వంద పడకల ఆస్పత్రి, పట్టణ ప్రగతి కింద పల్లె ప్రకృతి వనాలు, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి నిలిచి ఇల్లెందుకు నీటి సమస్యను శాశ్వతంగా తీర్చమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలైనా ఇంతవరకు ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని.. మేము మంజూరు చేసిన పనులనే వారు శంకుస్థాపన చేస్తూ చేసినట్లు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరిని కంటికి రెప్పలా కాపాడుకుంటూ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ జబ్బర్, నాయకులు భూక్య దల్ సింగ్ నాయక్, గిన్నారపు రాజేష్, స్థానిక నాయకులు కౌశల్ లోదు, రాంగోపాల్, అరుణ, సంజయ్ ,కళ్యాణ్ నందు, ఘాజి తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

బిజినెస్

## యూపీఐ కొత్త రూల్స్.. ఈ నెల నుంచే అమలు.. 10 సెకండ్లలోనే పేమెంట్




యూపీఐ సేవల్ని మరింత ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్పులు చేస్తూ వస్తోంది. ఈ నెలలో కూడా కొన్ని మార్పులు తీసుకొచ్చింది. ఇప్పటికే కొన్ని సేవలు అందుబాటులోకి రాగా.. మరికొన్ని సేవలు ప్రారంభమవుతాయి. వెరిఫికేషన్ ప్రమాణాలు పెంచుతూ, వినియోగదారులకు మరింత ఉపయోగపడేలా, మరింత పారదర్శకంగా ఈ మార్పులు ఉంటాయి. ఇకపై లావాదేవీలు త్వరగా, సురక్షితంగా పూర్తవుతాయి. కొత్త రూల్ ప్రకారం యూపీఐ లావాదేవీ జరిపినప్పుడు ఏపీఐ (అప్లికేషన్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్) వేగంగా స్పందించాలి. అంటే ఒక ట్రాన్సాక్షన్ 10 సెకండ్లలో పూర్తవ్వాలి. ఇంతకుముందు ఈ సమయం 30 సెకండ్లు ఉండేది. త్వరగా ట్రాన్సాక్షన్ పూర్తైతే వినియోగదారులకు చాలా మేలు జరుగుతుంది. పీక్ టైంలో కూడా వెయిట్ చేయాల్సిన అవసరం ఉండదు. యూజర్ల వెరిఫికేషన్ ప్రక్రియ ద్వారా భారీ ట్రాన్సాక్షన్స్ త్వరగా, సురక్షితంగా చేసుకోవచ్చు. పేమెంట్ చేసేముందు స్పష్టమైన అంగీకారం తెలపాలి. అలాగే ఆటో డెడక్షన్స్‌ను కంట్రోల్ చేసుకోవచ్చు. ఇంకా చాలాకాలం నుంచి వాడకుండా ఉన్న యూపీఐ ఐడీలను తాత్కాలికంగా నిలిపివేస్తారు. వీటిని మళ్లీ వాడుకోవాలంటే రీ వెరిఫికేషన్ చేయించుకోవాలి. దీనివల్ల అలాంటి అకౌంట్లు దుర్వినియోగం కాకుండా ఉంటాయి. ఇక చాలా మంది ఎదుర్కొనే సమస్య.. పేమెంట్ ఫెయిల్ అవ్వడం. అంటే యూజర్ల అకౌంట్ నుంచి డబ్బులు కట్ అవుతాయి. కానీ, పేమెంట్ అవ్వదు. ఇలాంటి విషయంలో డబ్బు రీఫండ్ అవ్వాలన్నా.. సమస్య పరిష్కారం కావాలన్నా కొన్నిసార్లు మూడు రోజులు, ఆపై వారం రోజులు కూడా పట్టేది. ఇకపై గంటల్లోనే ఈ సమస్య పరిష్కారం కావాలి. యూపీఐ యాప్స్ లేదా బ్యాంకులు దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుంది. వేరే యూజర్ల నుంచి డబ్బు సెండ్ చేయమని అడిగే ప్రక్రియ ఇకపై కఠినతరం కానుంది. యూపీఐ యూజర్లు రిక్వెస్ట్ పంపించే సంఖ్య తగ్గుతుంది.

### పిఎఫ్‌సి చేతికి ఆర్ఇసి..

దేశీయ విద్యుత్ రంగ ఫైనాన్సింగ్ రంగంలో భారీ విలీనం చోటు చేసుకుంది. ప్రభుత్వ రంగ దిగ్గజం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ (ఆర్ఇసి)లో ప్రభుత్వానికి ఉన్న 52.63 శాతం వాటాను పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఆర్ఎఫ్‌సి) కొనుగోలు చేసింది. దీనితో ఆర్ఇసి ఇప్పుడు పిఎఫ్‌సికి అనుబంధ సంస్థగా మారింది. శుక్రవారం జరిగిన బోర్డు సమావేశంలో ఈ కొనుగోలుకు ఆమోదం తెలపడమే కాకుండా, భవిష్యత్తులో ఈ రెండు సంస్థల పూర్తిస్థాయి విలీనానికి కూడా సూత్రప్రాయంగా అంగీకారం లభించింది. రెండు సంస్థల విలీనం ద్వారా రుణ పంపిణీ సామర్థ్యం పెరిగి, గ్రీన్ హైడ్రోజన్, ఇవి బ్యాటరీ స్టోరేజ్, మెట్రో రైలు వంటి భారీ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం మరింత సులభతరం కానుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నిర్ణయంతో కేంద్రానికి భారీ ఆదాయం సమకూరనుంది. ఇది ఒక రకంగా పెట్టుబడుల ఉపసంహరణే కావడం గమనార్హం. మరోవైపు దీనిపై ఇరు సంస్థల ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విలీనం ద్వారా విద్యుత్ ఫైనాన్స్ రంగంలో పోటితత్వం లోపించే ప్రమాదం ఉందని భావిస్తున్నారు. ఉద్యోగాలు తగ్గుతాయని హెచ్చరిస్తున్నారు.

# ఏఐ రేసులో భారత్.. మూడేళ్లలో రూ.6 లక్షల కోట్లు!

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో ప్రపంచ దేశాల మధ్య పోటీ వేగంగా పెరుగుతున్న వేళ.. పెట్టుబడుల పరంగా భారత్ కూడా ఈ రేసులో ముందంజలోనే ఉందని వరల్డ్ ఎకనమిక్ ఫోరం వెల్లడించింది. 2010 నుంచి 2024 వరకు ఏఐలో అత్యధిక పెట్టుబడులు (జీడీపీలో శాతంగా లెక్కించినప్పుడు) పెట్టిన 11 దేశాల జాబితాలో భారత్‌కు 8వ స్థానం దక్కింది. మరోపక్క.. ఏఐ మనదేశ ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా తెలిపింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి సుమారు రూ.50 లక్షల కోట్లు అదనంగా చేరే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇటీవల దావోస్‌లో.. ప్రముఖ మేనేజ్‌మెంట్ కన్సల్టింగ్ సంస్థ బెయిన్ అండ్ కంపెనీతో కలిసి వరల్డ్ ఎకనమిక్ ఫోరం ఓ శ్వేత పత్రం విడుదల చేసింది. దాని ప్రకారం.. 2010 నుంచి 2024 వరకు ఏఐలో పెట్టుబడుల పరంగా అమెరికా, సింగపూర్, దక్షిణ కొరియా, చైనా తొలి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఇదే సమయంలో.. భారత్‌లో ఏఐ పెట్టుబడులు జీడీపీలో 1.2 నుంచి 1.8 శాతం వరకు ఉన్నాయి. అమెరికాలో ఇది రికార్డు స్థాయిలో 3.4 నుంచి 5.1 శాతం, సింగపూర్‌లో 3.1 నుంచి 4.6 శాతం వరకు ఉంది.




**అమెరికా, చైనా దూకుడు**

20102024 మధ్య కాలంలో ఏఐ రంగంలో పెట్టుబడులు ఏడాదికి సగటున 33 శాతం చొప్పున పెరిగాయని శ్వేతపత్రం తెలిపింది. ఏఐ రంగం అత్యంత ఖరీదైనదనీ, భారీగా పెట్టుబడులు అవసరమైనప్పటికీ తక్షణ లాభాలపై స్పష్టత లేదని పేర్కొనడం విశేషం. కానీ, అమెరికా, చైనా ఈ రంగంలో భారీ పందాలు కాస్తున్నాయి. 2010 నుంచి ఇప్పటివరకు పెట్టిన మొత్తం ఏఐ పెట్టుబడుల్లో 65 శాతం ఈ రెండు దేశాలదే కావడమే అందుకు నిదర్శనం.

**మూడేళ్లలో రూ. 6 లక్షల కోట్లు**

భారత్‌లో వచ్చే మూడేళ్లలో రూ.6.14 లక్షల కోట్లకుపైగా ఏఐ పెట్టుబడులు వాస్తవ రూపం దాల్చనున్నాయని వరల్డ్ ఎకనమిక్ ఫోరం అంచనా వేసింది. అలాగే ఏఐకి అవసరమైన అధునాతన చిప్‌లకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, హార్డ్‌వేర్ రంగంలో పెట్టుబడులు ఏటా 15 నుంచి 25 శాతం వరకు పెరిగే అవకాశముందని తెలిపింది.

**ఆర్థిక వ్యవస్థకూ ఊతం**

భారత్ ఆర్థిక వ్యవస్థకు ఏఐ భారీ ఊతమివ్వనుందని పీడబ్ల్యూసీ ఇండియా అంచనా వేసింది. 2035 నాటికి ఏఐ వల్ల దేశ జీడీపీలోకి రూ.50 లక్షల కోట్లకుపైగా అదనంగా వచ్చి చేరే అవకాశం ఉందని వెల్లడించింది. వ్యవసాయం, విద్య, ఇంధనం, ఆరోగ్యం, తయారీ రంగాల్లో ఏఐ వినియోగం వేగంగా పెరిగితే ఈ వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. 2050 నాటికి 160 కోట్ల జనాభాకు ఆహారం అందించాలంటే వ్యవసాయ ఉత్పత్తిని 70 శాతం వరకు పెంచాల్సి ఉంటుందని, దీనికి డిజిటల్ సాంకేతికతలు, ముఖ్యంగా ఏఐ అవసరమని పేర్కొంది. అలాగే విద్య, వైద్య రంగాల్లోనూ ఏఐ కీలకపాత్ర పోషించనుందని వివరించింది.

## జియో రూ.198 రీఛార్జ్ ప్లాన్: రోజుకు 2 జీబీ డేటా..

భారతదేశపు అతిపెద్ద టెలికాం ఆపరేటర్ అయిన రిలయన్స్ జియో.. తన కస్టమర్ల కోసం ఎప్పటికప్పుడు సరికొత్త 5జీ రీఛార్జ్ ప్లాన్‌లను పరిచయం చేస్తూనే ఉంది. ఇందులో సరసమైన రీఛార్జ్ ప్లాన్స్ కూడా అందుబాటులో ఉన్నాయి.

**రూ.198 రీఛార్జ్ ప్లాన్**

ఇది రిలయన్స్ జియో తన కస్టమర్ల కోసం అందిస్తున్న సరసమైన రీఛార్జ్ ప్లాన్. ఈ ప్లాన్ రీఛార్జ్ చేసుకుంటే.. రోజుకు 2జీబీ డేటా, 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాలింగ్ వంటివి పొందవచ్చు. అయితే దీని వ్యాలిడిటీ కేవలం 14 రోజులు మాత్రమే.

**రూ.349 రీఛార్జ్ ప్లాన్**

ఈ ప్లాన్ ద్వారా రోజుకు 2 జీబీ హైస్పీడ్ డేటా పొందవచ్చు. రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు లభిస్తాయి. దీని వ్యాలిడిటీ 28 రోజులు. జియో హాట్‌స్టార్, జియోసావన్ ప్రో సబ్‌స్క్రిప్షన్‌లతో పాటు.. మూడు నెలలు జొమాటో గోల్డ్ కూడా పొందవచ్చు. జియో టీవీ, జియో సినిమా, జియో క్లౌడ్ వంటి వాటికి యాక్సెస్ కూడా పొందవచ్చు.






స్పోర్ట్స్

# అండర్ -19 ప్రపంచకప్ జట్టులో ముగ్గురు భారత కుర్రాళ్లు.. ఓపెనర్‌గా వైభవ్..!

పురుషుల అండర్ -19 వన్డే ప్రపంచకప్ ఫైనల్లో భారీ శతకంతో చెలరేగిన వైభవ్ సూర్యవంశీ (ఖుఱఎష్ఖుజ ూబతీఖుఝుఅంష్ర్రఱ)కి మరోసారి వార్తల్లో నిలిచాడు. ఇంగ్లండ్ బౌలర్లను ఊచకోత కోసి.. భారత జట్టు ఆరోసారి విజేతగా నిలవడంతో కీలకమైన వైభవ్ టోర్నమెంట్ జట్టుకు ఎంపికయ్యాడు. ఈ మెగా ఈవెంట్‌లో గొప్పగా రాణించిన టీమిండియా కుర్రాళ్లు కనిష్క్ చౌహాన్, పేసర్ హెనిల్ పటేల్ ప్రపంచకప్ జట్టులో చోటు సంపాదించారు. రన్నరప్ ఇంగ్లండ్ టీమ్ నుంచి ముగ్గురిని పదకొండు మంది బృందంలోకి తీసుకున్నారు. ఐసీసీ నిర్వహించే ప్రతి వరల్డ్‌కప్ ముగిశాక తుది జట్టును ప్రకటించడం ఆనవాయితీ. ఈసారి పురుషుల అండర్ -19 ప్రపంచకప్ ముగియడమే ఆలస్యం సంచలన ప్రతిభతో ఆకట్టుకున్న 11 మందితో జట్టును ప్రకటించారు. క్రికెట్ దిగ్గజాలు ఇయాన్ బిషప్, లిడియా గ్రీన్‌వే, ఆండీ ఫ్లవర్, టెల్‌ఫోర్డ్ వైసేలతో కూడిన సెలెక్టర్ల బృందం ఆదివారం టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్‌ను వెల్లడించింది. ఇందులో భారత్ నుంచి వైభ్‌వ్‌తో పాటు కనిష్క్ చౌహాన్, పేసర్ హెనిల్ పటేల్‌కు చోటు దక్కింది. ఇంగ్లండ్ కెప్టెన్ థామస్ రే వరల్డ్‌కప్ జట్టుకు సారథిగా ఎంపికయ్యాడు.



అఫ్గనిస్థాన్ నుంచి ఇద్దరు ఆస్ట్రేలియా, వెస్టిండీస్, పాకిస్థాన్ ఒక్కరు ఈ టీమ్‌లోకి ఎంపికయ్యారు. అండర్ -19 ప్రపంచకప్ టీమ్ ఆఫ్ ది టోర్నమెంట్ : వైభవ్ సూర్యవంశీ, కనిష్క్ చౌహాన్, హెనిల్ పటేల్(భారత్), థామస్ రే(కెప్టెన్, ఇంగ్లండ్), ఒలివర్ పీకే(ఆస్ట్రేలియా), బేన్ మయెస్(ఇంగ్లండ్), నూరిస్తాని ఒమర్‌జాయ్(అఫ్గనిస్థాన్), విరన్ చముదిత (శ్రీలంక), ఫైజల్ ఖాన్ శిన్వారీ (అఫ్గనిస్థాన్), విటెల్ లవేస్(వెస్టిండీస్), మన్నీ లుమ్స్‌డెన్(ఇంగ్లండ్), అలీ రజా(పాకిస్థాన్).

**సూర్యవంశీ పిడుగల్లే**

జింబాబ్వే వేదికగా జరిగిన పురుషుల అండర్ -19 ప్రపంచకప్‌లో భారత జట్టు విజేతగా నిలిచింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో వైభవ్ సూర్యవంశీ(175) పిడుగల్లే విరుచుకుపడగా.. కెప్టెన్ ఆయుశ్ మాత్రే(53), అభిగ్యాన్ కుందు(40)లు చెలరేగారు. ఆఖర్లో కనిష్క్ చౌహాన్(37 నాటౌట్) మెరుపులతో 411 రన్స్ కొట్టిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 311కే కట్టడి చేసింది. అంబ్రిష్(3-56), కనిష్క్(2-63), దీపేశ్(2-64) అద్భుతమైన బౌలింగ్‌తో ఇంగ్లండ్ ఆశలపై నీళ్లు చల్లారు. వంద పరుగుల తేడాతో నెగ్గిన భారత్.. రికార్డు స్థాయిలో ఆరోసారి ట్రోఫీని అందుకుంది.

## ఇంగ్లండ్‌ను భయపెట్టిన నేపాల్.. ఉత్కంఠ పోరులో గట్టెక్కిన మాజీ చాంపియన్..!



టీ20 ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో కొద్దిలో ఓటమి నుంచి తప్పించుకుంది ఇంగ్లండ్. ఉత్కంఠ పోరులో నేపాల్ బ్యాటర్ల విజృంభణతో ఓటమి అంచున నిలిచిన మాజీ ఛాంపియన్ ఆఖరి ఓవర్ థ్రిల్లర్‌లో గట్టెక్కింది. దీపేంద్ర సింగ్ ఐరీ(44) కెప్టెన రోహిత్ పౌడెల్(39) ల మెరుపులతో విజయానికి చేరువైన ప్రత్యర్థికి చివరి ఓవర్లో 10 రన్స్ అవసరమవ్వగా.. సామ్ కరన్(1-27) 5 రన్స్ మాత్రమే ఇచ్చి ఇంగ్లండ్‌ను గెలిపించాడు. సిక్సర్లతో చెలరేగి నేపాల్‌ను విజయతీరాలకు చేర్చిన లోకేష్ బామ్(39 నాటౌట్) కరన్ సంధించిన యార్కర్లను బౌండరీలుగా మలచలేకపోయాడు. దాంతో.. 4 పరుగుల తేడాతో బతికిపోయిన ఇంగ్లండ్ పాయింట్ల ఖాతా తెరిచింది. పొట్టి ప్రపంచకప్‌లో నేపాల్ సంచలనం సృష్టించే అవకాశాన్ని చేజార్చుకుంది. వాంఖడేలో స్వదేశీ అభిమానుల మద్దతుతో చెలరేగిన ఆసియా జట్టు.. బలమైన ఇంగ్లండ్‌ను 184కే కట్టడి చేసింది. ఓపెనర్లు తేలిపోవడంతో కుర్రాడు జాకబ్ బెథెల్(55), హ్యారీ బ్రూక్(53), విల్ జాక్స్ (39నాటౌట్) రాణించారు.

అనంతరం భారీ ఛేదనలో నేపాల్‌కు ఓపెనర్ కుశాల్ భుటెల్(29) శుభారంభమివ్వగా.. మిడిల్ ఓవర్లలో ఇంగ్లండ్ స్పిన్నర్లను దీపేంద్ర సింగ్ ఐరీ(44), సారథి రోహిత్ పౌడెల్(39) ధీటుగా ఎదుర్కొన్నారు. వీరిద్దరి జోరుతో గెలుపు దిశగా సాగిన నేపాల్‌ను సామ్ కరన్ దెబ్బకొట్టాడు. కేవలం రెండే పరుగులిచ్చి డేంజరస్ దీపేంద్రను ఔట్ చేశాడు. ఆ తర్వాత పౌడెల్ సైతం వెనుదిరిగాడు. మ్యాచ్ ఇంగ్లండ్ వైపు తిరిగిన వేళ లోకేష్ బామ్(39 నాటౌట్) బ్రూక్ సేనకు ముచ్చెమటలు పట్టించాడు.

**రెండు సిక్సర్లతో ఉత్కంఠ..**

ఆర్చర్ వేసిన 19వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన లోకేశ్ నేపాల్ శిబిరంలో ఆశలు రేపాడు. అనంతరం.. ల్యూక్ వుడ్ ఓవర్లో తొలి బంతికే కీపర్ వెనకాల బౌండరీ రాబట్టిన అత డు.. మూడో బంతిని మిడాఫ్‌లో ఫోర్‌గా మలిచాడు. కానీ, ఆఖరి బంతికి వుడ్ యార్కర్‌కు గుల్షన్ జా బౌల్డయ్యాడు. చివరి ఓవర్లో విజయానికి 10 రన్స్ అవసరమవ్వగా.. రెండో బంతికి సింగిల్ వచ్చింది. మూడో బంతికి కరన్ కేసీ(1 నాటౌట్) సింగిల్ తీశాడు. నాలుగో బంతికి రెండు రన్స్.. ఐదో బంతి యార్కర్ వేశాడు సామ్ కరన్. చివరిబంతికి ఆరు రన్స్ కొట్టాల్సిరాగా.. ఒకే ఒక పరుగు వచ్చింది. నాలుగు రన్స్ తేడాతో బతికిపోయిన ఇంగ్లండ్ గ్రూప్ సీ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది.

**అర్ధశతకాలతో చెలరేగిన బ్రూక్, బెథెల్**

వాంఖడేలో నేపాల్ బౌలర్లను ఉతికేస్తూ యువకెరటం జాకబ్ బెథెల్(55), కెప్టెన్ హ్యారీ బ్రూక్(53)లు అర్ధ శతకాలతో కదం తొక్కారు. ఓపెనర్లు విఫలమైనా బెథెల్ మెరుపులతో కోలుకున్న జట్టుకు బ్రూక్ వెన్నెముకలా నిలిచాడు. మిడిల్ ఓవర్లలో భారీ షాట్లతో విరుచుకుపడి స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఆఖర్లో విల్ జాక్స్(37 నాటౌట్) నాలుగు సిక్సర్లతో విజృంభించగా నిర్ణీత ఓవర్లలో ఇంగ్లండ్ 184 పరుగులు చేసింది.

## ఆఫ్ఘనిస్తాన్‌పై న్యూజిలాండ్ ఘన విజయం




టీ20 ప్రపంచకప్ 2026లో న్యూజిలాండ్ ఘనంగా బోణీ కొట్టింది. చెన్నై వేదికగా ఇవాళ (ఫిబ్రవరి 8) ఉదయం జరిగిన మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేయగా.. న్యూజిలాండ్ 17.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఆఫ్ఘనిస్తాన్ ఇన్నింగ్స్‌లో గుల్బదిన్ నైబ్ (63) టాప్ స్కోరర్ కాగా.. రహ్మనుల్లా గుర్బాజ్ 27, ఇబ్రహీం జద్రాన్ 10, సెదిఖుల్లా అటల్ 29, దర్విష్ రసూల్ 20, అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 14, మొహమ్మద్ నబీ 10 (నాటౌట్) పరుగులు చేశారు. న్యూజిలాండ్ బౌలర్లలో లోకీ ఫెర్గూసన్ 2, రచిన్ రవీంద్ర, మ్యాట్ హెన్రీ, జేకబ్ డఫీ తలో వికెట్ తీశారు.న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో టిమ్ సీఫర్ట్ 65 పరుగులతో సత్తా చాటగా.. గ్లెన్ ఫిలిప్స్ 42, మార్క్ చాప్‌మన్ 28, డారిల్ మిచెల్ 25 (నాటౌట్), మిచెల్ సాంట్నర్ 17 (నాటౌట్), ఫిన్ అలెన్ ఒక పరుగు చేశారు. రచిన్ రవీంద్ర గోల్డెన్ డకౌటయ్యాడు. ఆఫ్ఘనిస్తాన్ బౌలర్లలో ముజీబ్ రహ్మాన్ 2, ఒమర్‌జాయ్, రషీద్ ఖాన్, నబీ తలో వికెట్ తీశారు.



## బరిలోకి దిగుతున్న 'సంక్రాంతి సోగ్గాళ్లు'

'సోగ్గాడే చిన్ని నాయనా' సీక్వెల్‌ను అధికారికంగా అన్నపూర్ణ స్టూడియో ప్రకటించింది. అయితే, పూర్తి క్లారిటీ కాకుండా ఒక పంచ్ డైలాగ్‌తో పోస్ట్ చేశారు. 2016 సంక్రాంతి కానుకగా విడుదలైన 'సోగ్గాడే చిన్ని నాయనా' భారీ హిట్ అందుకున్న విషయం తెలిసిందే. ఆ తర్వాత 2022 సంక్రాంతికి సీక్వెల్‌గా బంగార్రాజు వచ్చాడు. అయితే, 2027 సంక్రాంతికి మరో సీక్వెల్ రానుందని తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించింది. వాసివాడి తస్సాదియ్యా అంటూ.. 2027 జనవరి 15న సంక్రాంతికి సోగ్గాళ్లు వస్తే పండగ ఇంకా కలర్ ఫుల్‌గా ఉంటాది కదా అని డేట్ మార్క్ చేసుకోమని పోస్ట్ చేశారు. దర్శకుడు కల్యాణ్‌కృష్ణ కురసాల 'సోగ్గాడే చిన్ని నాయనా' చిత్రంతో తొలి ప్రయత్నంలోనే అందరి దృష్టినీ ఆకర్షించి హిట్ కొట్టడమే కాకుండా బంగార్రాజు సీక్వెల్‌తో మెప్పించాడు. దీంతో ఇదే ఫ్రాంఛైజీలో మరో సినిమా రానుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ చేసిన పోస్ట్‌తో ఒక క్లారిటీ ఇచ్చేసింది. కల్యాణ్‌కృష్ణ, నాగార్జున కలిసి పార్ట్-3 ప్లాన్ చేస్తున్నారని తెలుస్తోంది. త్వరలో మరిన్ని విషయాలు వెల్లడించే ఛాన్స్ ఉంది. రాబోయే సంక్రాంతికి సీనియర్ హీరోలు అందరూ పోటీలో ఉన్నారు. చిరంజీవి- బాబీ సినిమాతో పాటు బాలకృష్ణ- గోపీచంద్ మలినేని, వెంకటేశ్- అనిల్ రావిపూడి సినిమాలు రేసులో ఉన్న విషయం తెలిసిందే.

## స్టన్నింగ్ యాక్టింగ్‌తో సినిమాకే హైలెట్‌గా అర్జున్ మహి




ఇష్టంగా సినిమాతో హీరోగా డెబ్యూ ఇచ్చాడు అర్జున్ మహి. ఆ తర్వాత ఎంజాయ్, నువ్వు నేను ఒసేయ్ ఒరేయ్ సినిమాలు చేశాడు. తాజాగా బరాబర్ ప్రేమిస్తా చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చి తన యాక్టింగ్‌తో టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు అర్జున్ మహి. చంద్రహాస్ హీరోగా వచ్చిన బరాబర్ ప్రేమిస్తా చిత్రంలో హీరోయిన్ సోదరుడి పాత్రలో నటించాడు. చంద్రహాస్, అర్జున్ మహి మధ్య వచ్చే సన్నివేశాలు.. ప్రత్యేకించి యాక్షన్ సన్నివేశాలు సినిమాకే హైలెట్‌గా నిలుస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అర్జున్ మహి యాక్టింగ్‌కు ఓ వైపు ప్రేక్షకులు, మరోవైపు క్రిటిక్స్ నుంచి ప్రశంసలు అందుతున్నాయి. అర్జున్ మహి తన పాత్ర కోసం 15 కిలోలు కూడా పెరిగాడంటే ఎంత పట్టుదలగా పనిచేశాడో అర్థం చేసుకోవచ్చు. డెడికేటెడ్ యాక్టర్‌గా తనను తాను నిరూపించుకునే పనిలో ఉన్న అర్జున్ మహి ప్రస్తుతం లీడ్ యాక్టర్‌గా రెండు సినిమాలు ఓకే చేయగా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నాయి. మొత్తానికి ఓ వైపు హీరోగా చేస్తూనే.. మరోవైపు పవర్ ఫుల్ కథలు దొరికితే చేసేందుకు రెడీ అంటూ చెప్పకనే చెబుతూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తున్నాడు.

# భయపెడుతోన్న అమరావతికి ఆహ్వానం ట్రైలర్



ధన్య బాలకృష్ణ, ఎస్తేర్, సుప్రీత, శివ కంఠనేని ప్రధాన పాత్రలో వస్తోన్న హారర్ థ్రిల్లర్ మూవీ అమరావతికి ఆహ్వానం. ఈ సినిమాకు జీవీకే దర్శకత్వం వహించారు. ఈ మూవీని కేఎస్ శంకర్‌రావు, ఆర్ వెంకటేశ్వరరావు నిర్మించారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఇప్పటికే షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ఫిబ్రవరి 13న థియేటర్లలో సందడి చేయనుంది. అమరావతికి ఆహ్వానం ట్రైలర్ చూస్తుంటే హారర్ థ్రిల్లర్ మూవీగానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఏంట్రా ఈ ఊరు మనుషులే కనపడట్లేదు అనే డైలాగ్‌తో ప్రారంభమైంది. ఈ గ్రామంలో జరిగే మిస్టరీ నేపథ్యంలో ఈ సినిమా ఉండనుందని ట్రైలర్ చూస్తుంటే అర్థమవుతోంది. ట్రైలర్‌లో సీన్స్ ఆడియన్స్‌ను భయపెట్టేస్తున్నాయి. దెయ్యాల కాన్సెప్ట్‌తోనే ఈ సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నారు.



## అతన్ని పడేయాలని ట్రై చేశాను.. కానీ...: కంగనా రనౌత్

ధురంధర్ సినిమా ఓటీటీలోకి రావడంతో మరోసారి ట్రెండ్ అవుతోంది. అందులో నటించిన అక్షయ్ ఖన్నా మళ్లీ వైరల్ అవుతున్నాడు. ఈ సందర్భంగా అక్షయ్ ఖన్నాపై బాలీవుడ్ నటి కంగనా రనౌత్ గతంలో చేసిన వ్యాఖ్యలు ఓ వీడియో క్లిప్ అందర్నీ ఎట్రాక్ట్ చేస్తోంది. హీరోయిన్‌గా బాలీవుడ్‌లో టాప్ రేంజ్‌లో కొనసాగిన కంగనా.. బీజేపీలో చేరి హిమాచల్ ప్రదేశ్‌లోని మండి నుంచి ఎంపీగా గెలిచిన విషయం తెలిసిందే. 'ధురంధర్' సినిమా చూసిన వారందరూ సోషల్‌మీడియాలో అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ క్రమంలో కంగనా రనౌత్ పాత ఇంటర్వ్యూ క్లిప్ ఇప్పుడు వైరల్ అవుతుంది. ఈ క్లిప్ 'కాఫీ విత్ కరణ్' కార్యక్రమానికి సంబంధించింది కావడం విశేషం. 2010లో విడుదలైన నో ప్రాబ్లమ్ మూవీ ప్రమోషన్ సమయంలో ఈ కార్యక్రమం జరిగింది. అందులో అనిల్ కపూర్, సంజయ్ దత్‌లతో పాటు అక్షయ్, కంగనా కూడా కలిసి నటించారు. ఈ వీడియోలో కరణ్ జోహార్ మాట్లాడుతూ ఎవరితోనైనా సరసాలాడటానికి ప్రయత్నించారా అని కంగనాను అడగడంతో ఆమె ఏమాత్రం సంకోచించకుండా.., "అవును అంటూ అక్షయ్ ఖన్నా(గూఎంష్ఘుఎవ ఖష్ఘుఅఖు) పేరును చెప్పారు. 'నేను మొదట అక్షయ్‌తో మాట్లాడ్డానికి ప్రయత్నించాను. ఆ తర్వాత అతడ్ని నిజంగానే పడేయాలని ట్రై చేశాను. కానీ అతడు ఎప్పుడూ నాతో మాట్లాడలేదు. నాతోనే కాదు, అతడు ఎవరితోనూ పెద్దగా మాట్లాడడు.' స్వయంగా కంగనా రనౌత్ ఆ షోలో అక్షయ్ ఖన్నా గురించి చెప్పిన ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ధురంధర్ సినిమాలో అక్షయ్ ఖన్నా పోషించిన రెహ్మాన్ డెకాయిత్ పాత్ర సూపర్ హిట్టయిన సంగతి తెలిసిందే. ఈ సినిమాతో రణ్‌బీర్ సింగ్‌కు ఎంత పేరొచ్చిందో, అక్షయ్ ఖన్నాకు కూడా అంతే పేరొచ్చింది. ఈ సినిమా పార్ట్-2 మార్చి 19న రిలీజ్ అవుతోంది.

## నాగ్...పంపిణీ రంగంలో తొలిస్టార్...ఆ హీరోలే స్ఫూర్తిగా...



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున మరో రంగంలోనూ సత్తా చాటనున్నారు. అగ్రస్థాయి నటుడుగా, చిన్నితెర పై టాప్ హోస్ట్‌గా, నిర్మాత, స్టూడియో అధినేత... వంటి బహుముఖ పాత్రలతో రాణిస్తున్న నాగ్... ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలలో సినిమా పంపిణీదారుగా కూడా కొత్త పాత్ర పోషించనున్నారు. పరిశ్రమ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఆయన సినీ పంపిణీ రంగంలోకి లాంఛనంగా అడుగుపెట్టారు, రాబోయే సంవత్సరాల్లో తన పంపిణీ సామ్రాజ్యాన్ని గణనీయంగా విస్తరించాలని యోచిస్తున్నారు.

**బాలీవుడ్ బాటలో...**

ప్రస్తుతం తెలుగు హీరోలలో ఎవరూ పంపిణీ రంగంలో లేని పరిస్థితుల్లో.. ఈ రంగంలోకి దిగిన తొలి తెలుగు హీరోగా నాగార్జున నిలవనున్నారు. బాలీవుడ్ లో చూస్తే రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్ మెంట్ పేరిట షారూఖ్‌ఖాన్, అమీర్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, అజయ్ దేవగణ్, అక్షయ్ కుమార్, దక్షిణాది హీరోల్లో రాజ్ కమల్ ఫిలింమ్స్ ఇంటర్నేషనల్ పేరిట కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్...వంటివారు పంపిణీ రంగంలో ఉన్నారు. ఈ హీరోలు ముఖ్యంగా బాలీవుడ్ హీరోల స్ఫూర్తితోనే నాగార్జున ఈ నిర్ణయం తీసుకున్నారని అనుకోవచ్చు. తెరపై పాత్రల ఎంపిక విషయంలో మాత్రమే కాదు వాణిజ్య ప్రణాళికల విషయంలోనూ ఎప్పుడూ మిగిలిన వారికంటే ఓ అడుగు ముందే నాగ్ ఉంటారనేది గతంలో ఎన్నోమార్లు రుజువైన విషయం.

**తెలుగు రాష్ట్రాల్లో కార్యాలయాలు...**

అన్నపూర్ణ స్టూడియోస్ ఇప్పటికే హైదరాబాద్‌లో ఒక పంపిణీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది ఇప్పుడు విశాఖపట్నంలో కూడా కొత్త కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తోంది, ఇది రెండు తెలుగు రాష్ట్రాలలో పెద్ద ఎత్తున విస్తరణకు సంకేతంగా చెప్పుకోవచ్చు. దాదాపు 50 ఏళ్లకు పైగా చరిత్ర ఉన్న నిర్మాణ సంస్థ నాగార్జున స్వంతం. ఇప్పుడు ఆయన మరిన్ని సినిమాలను నిర్మించాలని మరోవైపు తన పంపిణీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయాలని యోచిస్తున్నారని తెలుస్తోంది..ఆర్థికపుష్టి ఉన్న అగ్రహీరోల్లో ఒకరైన నాగార్జున డిస్ట్రిబ్యూషన్ రంగంలోకి అడుగుపెట్టడం ప్రస్తుత అగ్రగామి పంపిణీదారులకు గట్టి పోటీ ఇవ్వడం ఖాయమని సినీ వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# ఏపీ పెద్దపులి చిక్కింది సరే! తెలంగాణ పులుల సంగతేంటో?

**తెలుగు రాష్ట్రాలను వణికించిన పెద్ద పులులలో ఒక్కటి చిక్కినవైనం**
**జనగామలోని పులి పట్టుకునే ప్రయత్నాలు ఫలించని పరిస్థితి**
**మరోవైపు అదిలాబాద్ జిల్లా తాంసీలో సంచరిస్తున్న పెద్ద పులి**

(చెన్నూరి అన్వేషి)
(ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)





తెలుగు రాష్ట్రాలను వణికించిన పెద్దపులులలో ఒక్కటి చిక్కింది. తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడు రోజులుగా పంటపొలాలు, జనావాసాల్లో సంచరిస్తూ రైతులను, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న పెద్దపులిని కూర్మపురం సమీపంలో అటవీశాఖ అధికారులు 4 గంటలు రెస్క్యూ ఆపరేషన్ చేసి ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. తెలంగాణలో జనగామ, తాంసీలలో సంచరిస్తున్న పెద్దపులులను పట్టుకునే ప్రయత్నాలు మాత్రం ఇంకా ఫలించలేదు.తెలుగు రాష్ట్రాలను వణికించిన పెద్దపులులలో ఒక్కటి చిక్కింది. తూర్పు గోదావరి జిల్లాలో గత ఏడు రోజులుగా పంటపొలాలు, జనావాసాల్లో సంచరిస్తూ రైతులను, ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న పెద్దపులిని కూర్మపురం సమీపంలో అటవీ శాఖ అధికారులు 4 గంటలు రెస్క్యూ ఆపరేషన్ చేసి ఎట్టకేలకు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. ఏపీ అటవీశాఖ అధికారులు, పుణె నుంచి వచ్చిన రెస్క్యూ నిపుణుల బృందం సంయుక్త వ్యూహంతో మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కూర్మాపురం గ్రామంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చాకచక్యంగా దాన్ని బంధించారు. పెద్దపులిని పట్టుకునే క్రమంలో తొలి ప్రయత్నంలో గన్‌తో మత్తు ఇంజక్షన్ ప్రయోగించినా అది పనిచేయలేదు. ఆ తర్వాత వంద మీటర్ల దూరం వెళ్లిన పులిపై రెండోసారి ప్రయోగించగా మత్తెక్కి అక్కడి చెరువుగట్టు వద్ద పడిపోయింది. తర్వాత బోనులో బంధించి రాజమహేంద్రవరం తరలించారు. వైద్యపరీక్షలు నిర్వహించి విశాఖపట్నంలోని జంతు సంరక్షణ కేంద్రానికి (జూపార్కు) తరలించి పర్యవేక్షిస్తున్నారు. మహారాష్ట్రలోని తడోబా అభయారణ్యం ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లాలోకి వచ్చిన పులి వారంరోజులుగా 600కిలో మీటర్లు నడిచి తూర్పుగోదావరి జిల్లాలోని అభయారణ్యాలు, గోదావరి నది దాటి పరీవాహక ప్రాంతాలు, పొలాల్లో సంచరించింది. రాజానగరం, రాజమహేంద్రవరం గ్రామీణ మండలాల్లో 8 మూగజీవాలను వధించింది.

**జనగామలో సంచరిస్తున్న పట్టుకునే ప్రయత్నాలు ఫలించని పరిస్థితి**

ఏపీలోని పెద్దపులిని బంధించడంతో అక్కడి ప్రజలు, రైతుల భయాలు, కష్టనష్టాలు తీరిపోయాయి. అయితే తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా వాసులను వణికించి ప్రస్తుతం జనగామ జిల్లా రఘునాథపురంలో సంచరిస్తున్న నాలుగేళ్ల రాయల్ బెంగాల్ టైగర్ మాత్రం ఇంకా అటవీ అధికారులకు చిక్కలేదు. మహారాష్ట్ర తడ్వాయి టైగర్ రిజర్వ్ జోన్ నుంచి 300కిలో మీటర్ల మేరకు ప్రయాణించి ఆదిలాబాద్, నిర్మల్, సిద్దిపేట జిల్లా అటవీ ప్రాంతం నుండి వచ్చిన పులి యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా సంచరిస్తూ జనగామ జిల్లా లింగాల గణపురం మండలంలోని కుందారం గ్రామంలోకి ప్రవేశించింది. అక్కడ లేగదూడను చంపిన పెద్దపులి సంచారంతో ప్రజలు వణికిపోతున్నారు. పెద్దపులి సిద్దిపేట జిల్లాలోకి వెళ్లిందని వారు చెబుతున్నారు.

**మరోవైపు అదిలాబాద్ జిల్లా తాంసీలో సంచరిస్తున్న పెద్ద పులి**

మరోవైపు అదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం లో తాంసీలో సంచరిస్తున్న పెద్ద పులినిబంధించేందుకు ట్రాప్ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో దాని సంచారాన్ని గుర్తిస్తూ పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందుకోసం రెండు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఈ పెద్దపులి మహారాష్ట్ర లోని తిప్పేశ్వర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నుండి పెన్‌గంగ నది దాటి వచ్చినట్లు అధికారులు తెలిపారు.

# ఎలాంటి పొరపాట్లు లేకుండా పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి





**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**ధర్మ ఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 08:**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జనవరి 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఎస్ఎం ఫంక్షన్ హాల్ లో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే), 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఎన్నికల విధులలో నిర్లక్ష్యం వహించినట్లయితే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని సందర్శించి నమోదైన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు నిర్వహించే ప్రతి ఒక్కరు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ ను మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి సందర్శించి భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. సిసి కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మంచిర్యాలలో దొరల రాజ్యం పోవాలి, బహుజన రాజ్యం రావాలి



**మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ పార్టీ లను ఓడించి, బీఎస్పీ అభ్యర్థులను గెలిపించండి**
**బీఎస్పీ రాష్ట్ర కో ఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం**

**ధర్మ ఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 08:**

మంచిర్యాలలో దొరల రాజ్యం పోవాలి, బహుజన రాజ్యం రావాలంటే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్, బీజేపీ పార్టీ లను ఓడించి, బీఎస్పీ అభ్యర్థులను గెలిపించాలని బీఎస్పీ స్టేట్ కో ఆర్డినేటర్ అడ్వకేట్ నిషాని రామచంద్రం తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 4, 5 డివిజన్ లలో కాదసి భాగ్యలక్ష్మి, శెట్టి ప్రవళిక ల తరుపున ఎన్నికల ప్రచార ర్యాలీ లో పాల్గొని, అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, మంచిర్యాలలో దొరల పాలన వల్లనే బహుజనుల బ్రతుకులు మారలేదన్నారు. మంచి బంగారు బవిష్యత్ ఉండాలంటే, రాజ్యాంగం రక్షించబడాలంటే బీఎస్పీ ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ ప్రచార సభ లో జోన్ ఇంచార్జ్ కాదసి రవీందర్, జిల్లా ఇంచార్జ్ నాగుల కిరణ్ బాను, జిల్లా అధ్యక్షులు ముల్కల రాజేంద్ర ప్రసాద్ లు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో వసతులపై సమీక్ష సమావేశం...

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ జె.అరుణశ్రీ**

**ధర్మఘంట,ఫిబ్రవరి08,రామగుండం :**






ఫిబ్రవరి 11 న మునిసిపల్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లోవసతులు ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులు , సిబ్బందితో సమీక్షించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో త్రాగు నీరు , మరుగు దొడ్లు , విద్యుత్ దీపాలు , చక్రాల కుర్చీలు తదితర కనీస వసతులు తప్పనిసరిగా ఉండాలని అన్నారు . అలాగే ఓటర్ల సహాయార్థం హెల్ప్ డెస్క్ , వైద్య శిబిరం తో పాటు అవసరమైన సేవలు అందించడానికి వాలంటరీలను కూడా సిద్దంగా ఉంచాలని అన్నారు. పోలింగ్ ప్రక్రియ సాఫీగా జరిగేలా ఆయా పోలింగ్ కేంద్రాల్లో సంబందిత వార్డు అధికారులు , వార్డు అసిస్టెంట్లు ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు పర్యవేక్షించాలని అన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి , అసిస్టెంట్ కమిషనర్ వెంకటేశ్వర్లు , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి , ఆర్ ఓ ఆంజనేయులు , డి . ఇ శాంతి స్వరూప్ , ఎ ఇ జమీల్ , టి పి ఎస్ నవీన్ , సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం

**పోలింగ్, కౌంటింగ్ సందర్భంగా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలి**

**ధర్మ ఘంట,నిజామాబాద్, ఫిబ్రవరి 08 :**




మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను పురస్కరించుకుని రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు జరుగనున్న నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, భీంగల్ పట్టణాలలో ఈ నెల 09వ తేదీ సాయంత్రం 5.00 గంటల నుండి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని, ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్ సమయంలో పై పట్టణాలలో ఎవరు కూడా బహిరంగ ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. ఎఫ్.ఎస్.టి, ఎస్.ఎస్.టి, ఎం.సి.సి బృందాలు, పోలీస్ అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని, కట్టుదిట్టమైన నిఘా కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. కాగా, మున్సిపల్ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా ఈ నెల 9వ తేదీ సోమవారం సాయంత్రం 5.00 గంటల నుండి 11వ తేదీ పోలింగ్ ముగిసేంత వరకు మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసివేయించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియను పురస్కరించుకుని ఈ నెల 13న కూడా మద్యం, కల్లు దుకాణాలు మూసివేయాలని, కౌంటింగ్ ముగిసేంత వరకు డ్రై డే అమలు లో ఉంటుందని తెలిపారు.

# మరో 10 ఏళ్లు కాంగ్రెస్ పార్టీదే అధికారం..



**నల్లగొండను మహానగరంగా తీర్చిదిద్దుతా...**
**కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలి**
**రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 8,**

నల్గొండ:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేద ప్రజలకు పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా ఆదివారం డివిజన్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయా కాలనీలలో మంత్రి రోడ్ షో నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండను అన్ని రంగాలలో అభివృద్ధి చేసుకోవడం కోసమే నల్గొండ మున్సిపాలిటీని కార్పొరేషన్ గా ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు.మున్సిపాలిటీ నుంచి నల్గొండ కార్పొరేషన్ గా మారడంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో సూపర్ స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేసుకోవచ్చని పేర్కొన్నారు.గత రెండేళ్లలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు రూ.700 కోటతో బైపాస్ రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు.ముఖ్యంగా పట్టణంలోని అన్ని కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులను పూర్తి చేయడంతో పాటు 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా ఇప్పటికే చర్యలు చేపట్టినట్లు తెలిపారు.34వ డివిజన్లో ఉన్న బక్కతాయి కుంటను సందర్శకులకు ఆహ్లాదం కలిగించే విధంగా అభివృద్ధి చేసేందుకు తగిన నిధులు వెచ్చిస్తానని తెలిపారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం నల్లగొండ అభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపట్టలేదని విమర్శించారు.అధికారంలో ఉన్నప్పుడు కెసిఆర్ ,కేటీఆర్, హరీష్ రావులు చేసిన అవినీతిపై సొంత సొంత కూతురు ప్రశ్నిస్తున్న వారి వద్ద సమాధానం లేదని విమర్శించారు.ప్రాజెక్టుల పేరుతో దోసుకున్నారే తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేదని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే పేద ప్రజలకు రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాలతో పాటు ఇంకా ఎన్నో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని పేర్కొన్నారు.ఈనెల 11న జరిగే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డితో పాటు అన్ని డివిజన్లో పార్టీ అభ్యర్థులను రికార్డు స్థాయి మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఇతర పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే ఆయా ప్రాంతాలలో పేద ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ప్రభుత్వ నిధులతో పాటు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా తన సొంత నిధులతో పేద విద్యార్థులకు మంచి నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు.ఇప్పటికే 8 కోట్ల రూపాయలతో ప్రకాశం బజార్లో కోమటిరెడ్డి ప్రతీక్ రెడ్డి బొట్టుగూడ నూతనంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.అన్ని వసతులతో ఇలాంటి పాఠశాల దేశంలో కూడా ఎక్కడ లేదన్నారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో చేయి గుర్తుకు ఓటు వేసి పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ హఫీజ్ ఖాన్,నల్లగొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గుమ్ముల మోహన్ రెడ్డి, తిప్పర్తి మాజీ జెడ్పిటిసి పాశం రామ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేయర్ అభ్యర్థి బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, 34 డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఏదుళ్ల శ్రీధర్ రెడ్డి,13 డివిజన్ అభ్యర్థి గుమ్ముల జానకి మోహన్ రెడ్డి, 33 వ డివిజన్ అభ్యర్థి రేగట్ట అండాలు లింగస్వామి, 31 డివిజన్ అభ్యర్థి కౌసర్, 24వ డివిజన్ అభ్యర్థి ఆతియా కౌసర్, 23వ డివిజన్ అభ్యర్థి మహమ్మద్ మహబూబ్ అలీ, 44వ డివిజన్ అభ్యర్థి మహమ్మద్ ఇర్ఫాన్ ఆమేద్, 22వ డివిజన్ అభ్యర్థి అమీనా ఫరీనా, 45వ డివిజన్ అభ్యర్థి అష్రఫ్ అలీ, 46వ డివిజన్ అభ్యర్థి మహమూద్ అలీ, 43వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థి ఎండి ఖలీల్, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలి






**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**

**ధర్మ ఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 08:**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా జనవరి 11వ తేదీన జరుగనున్న పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మాస్టర్ ట్రైనర్ల ఆధ్వర్యంలో పిఓ, ఎపిఓ లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలలో భాగంగా పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 800 ఓటర్లకు మించకుండా పోలింగ్ జరిగేలా ఏర్పాట్లు చేయడం జరిగిందని, ప్రతి పోలింగ్ కేంద్రంలో కేటాయించబడిన సిబ్బందికి పోలింగ్ ప్రక్రియలోని ప్రతి అంశం తెలిసి ఉండాలని, ఓటింగ్ కంపార్ట్మెంట్ గోప్యత నిర్వహణ సక్రమంగా చేయాలని తెలిపారు. ఇతరులకు బదులుగా ఓటు వేయడం, ఒకటికి మించి ఓటు వేయడం జరుగకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని, పోలింగ్ ముగిసిన తరువాత తీసుకోవలసిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలపై శిక్షణలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ అధికారులకు కేంద్రాలలో త్రాగునీరు, మూత్రశాలలు, లైటింగ్, ఫ్యాన్ వంటి అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పోలింగ్ రోజున ఓటింగ్ సంబంధిత ప్రతి నమూనాను పూర్తిగా నింపాలని, పోలింగ్ నిర్వహణ ప్రక్రియలో పొరపాట్లకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ప్రతి ఒక్కరూ పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. 11వ తేదీన పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని, 12వ తేదీన రీపోలింగ్ (ఏమైనా ఉన్నట్లయితే) 13వ తేదీన ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఎన్నికలలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించుకోవాలని, అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పౌరుల నిర్లక్ష్యం ప్రజాస్వామ్యానికి ముప్పు

నగరం మారాలంటే విమర్శలు సరిపోవు,
నగర భవిష్యత్తుకోసం ఓటు వేయాలి

**ధర్మఘంట, ఫిబ్రవరి 08, హైదరాబాద్ :**

పట్టణాలు అభివృద్ధి కేంద్రాలుగా భావించబడుతున్నాయి. ఎత్తైన భవనాలు, ఆధునిక సదుపాయాలు, వేగంగా మారుతున్న జీవనశైలి నగరాల ప్రతిరూపంగా కనిపిస్తున్నాయి. అయితే ఈ మెరుపు వెనుక ఒక కఠిన వాస్తవం ఉంది. చెత్త సమస్యలు, కాలుష్యం, పాడైన రహదారులు, నీటి కొరత, ట్రాఫిక్ ఇబ్బందులు పట్టణ జీవనాన్ని కష్టతరం చేస్తున్నాయి. ఈ సమస్యలకు ప్రధాన కారణాల్లో ఒకటి పట్టణ పౌరుల నిర్లక్ష్యం. మున్సిపాలిటీలు ప్రజలకు అత్యంత సమీప ప్రభుత్వ వ్యవస్థ. నీరు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, రహదారులు వంటి ప్రాథమిక సేవలన్నీ వాటి పరిధిలో ఉంటాయి. ఈ సంస్థలను నడిపే వారిని ఎన్నుకునేది ప్రజలే. అయినప్పటికీ పట్టణాల్లో ఎన్నికల సమయంలో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం ఆందోళనకరం. ఓటు వేయకుండా ఉండటం అంటే మన భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే హక్కును ఇతరులకు అప్పగించడం వంటిదే. ఎత్తైన భవనాలు, రద్దీ వీధులు, మెరిసే దీపాలు అభివృద్ధి చిత్రాన్ని చూపిస్తాయి. అయితే ఈ చిత్రానికి వెనుక ఒక కఠినమైన వాస్తవం దాగి ఉంది – మన నగరాలు ఎన్నో సమస్యలతో పోరాడుతున్నాయి. పొంగిపొర్లే చెత్త కుండీలు, పాడైన రహదారులు, కాలుష్యభరితమైన గాలి, నీటి కొరత, అంతులేని ట్రాఫిక్ జామ్‌లు ఇప్పుడు రోజువారీ జీవితంలో భాగమైపోయాయి. ఈ సమస్యలు ఒక్కరోజులో ఏర్పడినవి కావు; అలాగే పౌరులు బాధ్యత తీసుకోకపోతే ఇవి ఒక్కరోజులో పోవు. పట్టణ స్థానిక సంస్థలు, అంటే మున్సిపాలిటీలు, ప్రజలకు అత్యంత సమీపమైన ప్రభుత్వ వ్యవస్థ. మన రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేసే నీటి సరఫరా, పారిశుద్ధ్యం, రహదారులు, ఆరోగ్యం, గృహవసతి వంటి సేవలను ఇవే నిర్వహిస్తాయి. ఈ సంస్థలను నడిపించే వారు మనమే ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు. కాబట్టి నిజాయితీ, నిబద్ధత, దూరదృష్టి కలిగిన నాయకులను




ఎన్నుకోవడం కేవలం ముఖ్యమే కాదు; నగర జీవనానికి అత్యవసరం. ఓటు వేయడం పౌరుని బలమైన స్వరం. అయితే విచారకరమైన విషయం ఏమిటంటే పట్టణ భారతదేశం తరచుగా ఈ స్వరాన్ని వినిపించడంలో వెనుకబడుతోంది. ఇటీవల జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ఒక ఆందోళనకరమైన వాస్తవాన్ని వెల్లడించాయి. ఛత్తీస్‌గఢ్‌లో 72.9 శాతం పోలింగ్ నమోదవగా, హర్యానాలో కేవలం 46 శాతం మాత్రమే నమోదైంది. రాయ్‌పూర్ నగరంలో 44.5 శాతం మాత్రమే ఓటింగ్ జరిగింది; ఉత్తరప్రదేశ్‌లోని మథురలో ఇది 38.5 శాతానికి పడిపోయింది. ఈ సంఖ్యలు ఒక బాధాకరమైన నిజాన్ని చెబుతున్నాయి. మెరుగైన విద్య, సౌకర్యాలు ఉన్నప్పటికీ పట్టణ ప్రజలు గ్రామీణ ప్రజల కంటే తక్కువగా ఓటు వేస్తున్నారు. ఈ నిర్లక్ష్యం ప్రమాదకరం. ఎన్నికల రోజున ఒక పౌరుడు ఇంట్లోనే ఉండిపోతే, తన భవిష్యత్తును ఇతరుల చేతుల్లోకి వదిలేస్తున్నట్టే. అలా చేయడం అంటే చెడు పరిపాలనను మౌనంగా అంగీకరించడం. అవినీతి, పనితీరు లోపం, నెరవేరని హామీలపై చాలామంది ఫిర్యాదు చేస్తారు; కానీ మార్పు తీసుకురాగల ఒక చిన్న చర్య అయిన ఓటు వేయడంలో వెనుకడుగు వేస్తారు. మనం ఓటు వేయకపోతే, ప్రభుత్వాన్ని ప్రశ్నించే నైతిక హక్కును కూడా కోల్పోతాము. నిరాశతోనే వీధులు శుభ్రం కావు, డ్రైనేజీలు సరిచేయబడవు, పాఠశాలలు మెరుగుపడవు. చర్య మాత్రమే మార్పును తీసుకువస్తుంది. పట్టణ సమస్యలు తీవ్రమైనవే కాక తక్షణ పరిష్కారం అవసరమైనవిగా ఉన్నాయి. చిన్నారులు చెత్త కుప్పల మధ్యగా పాఠశాలకు వెళ్తున్నారు. రోగులు గుంతలతో



నిండిన రహదారులపై ఆసుపత్రులకు చేరుతున్నారు. కుటుంబాలు కాలుష్య గాలిని పీలుస్తూ, సురక్షితం కాని నీటిని తాగుతున్నారు. ఇవి కేవలం భావనలలోని సమస్యలు కావు – ఇవి ఆరోగ్యం, గౌరవం, జీవితం మీద ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి. బాధ్యతగల, సామర్థ్యవంతమైన మున్సిపల్ ప్రతినిధి సరైన ప్రణాళిక, ప్రజల మాట వినడం, ప్రజాధనాన్ని నిజాయితీగా వినియోగించడం ద్వారా ఈ పరిస్థితిని మార్చగలడు. ప్రజాస్వామ్యం పార్లమెంట్ లేదా అసెంబ్లీలలో మాత్రమే ఉండదు; అది మన వీధుల్లో, వార్డుల్లో, పక్కవాడలలో జీవిస్తుంది. మార్పు ఎప్పుడూ గొప్ప ప్రసంగాలతోనే మొదలవదు; ఒక ఓటుతో మొదలవుతుంది. పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో ఓటు వేస్తే నాయకులు పనిచేయాల్సిందే, ప్రజల మాట వినాల్సిందే.

మన నగరాలు మెరుగైన పరిస్థితిని అర్హిస్తున్నాయి. మన పిల్లలు పరిశుభ్రమైన వీధులు, సురక్షితమైన ఇళ్లను అర్హిస్తున్నారు. మన భవిష్యత్తు పాలించేవారిని కాదు, సేవ చేసేవారిని కోరుకుంటోంది. అలసత్వాన్ని, నిరాశను దాటి ఎన్నికల రోజున బయటికి వచ్చి తెలివిగా ఓటు వేయాలి. ఓటు ద్వారా మన హక్కులను కాపాడుకోవచ్చు, మన నగరాలను రూపుదిద్దుకోవచ్చు, మన దేశాన్ని బలోపేతం చేయవచ్చు. మన నగరాలను మార్చే శక్తి నినాదాల్లో కాదు, సామాజిక మాధ్యమాల్లో కాదు అది మన చేతుల్లో ఉంది. ఆ శక్తి పేరు ఓటు. ప్రభుదాస్ గండమళ్ల ఇండియన్ గ్రీన్ గ్యాస్ ఎక్విప్‌మెంట్స్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు, వాషింగ్టన్ డి.సి, అమెరికా.
9441464767 ; 9390381267

# పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరం

**– శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 08, కడ్తాల్ :** పర్యావరణాన్ని మనం ఎంతగా నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసానాలు మానవ జాతి మనుగడకు అంత ప్రమాదకరంగా పరిణమిస్తాయని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. పాత వ్యవసాయ పద్ధతులను పరిరక్షించుకోవడం వల్ల భూసారం, మనుషుల ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందని, ఆ దిశగా ప్రజలు చైతన్యం పెంచుకోవాలని కోరారు.పశు సంపదను పెంచు కోలేకపోతే వచ్చే 5 ఏళ్లలో మన భూమి,మన వ్యవసాయం మనకు కాకుండా పోతాయని ఆయన హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా కడ్తల్ మండలం అన్మాసుపల్లి లో ని ఎర్త్ సెంటర్ లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్, భారత్ బీజ్ స్వరాజ్ మంచ్ సంయుక్తాధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగిన తెలంగాణ ద్వితీయ వార్షిక విత్తన పండుగ ముగింపు సమావేశం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ ముగింపు సమావేశంలో జాతీయ జీవవైవిధ్య ప్రాధికార సంస్థ మాజీ అధ్యక్షుడు అచలేందర్ రెడ్డి తదితర ముఖ్యులు పాల్గొన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత చింతల



వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాల గ్రేడింగ్ తో ప్రకృతి వ్యవసాయం లో కూడా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి మాట్లాడుతూ... దేశీ విత్తనాలు దేశ సంపద అని, వాటి విస్తృత వినియోగానికి ప్రోత్సాహం ఇచ్చే రీతిలో ప్రణాళికా బద్ధమైన ప్రభుత్వ విధానాలు అవసరం అన్నారు. రైతు ప్రయోజనాలు, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఈ విధానాలు రూపొందాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇస్తేనే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వినియోగం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ విధానాలలో మార్పు వచ్చినప్పుడే ప్రకృతి వ్యవసాయం సాధ్యమవుతుందని ఏపీ మాస్ వ్యవస్థాపకులు సీఎస్ రెడ్డి అన్నారు. రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు ఈ ఉద్యమం లో కీలక పాత్ర ఉందన్నారు. దేశీ విత్తనాల తో పంట దిగుబడి తగ్గుతుందనేది కేవలం ఒక అపోహేనని , వాటి వినియోగం వల్ల భూమి, మనుషుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి అనుగుణమైన ప్రత్యామ్నాయ విత్తన వ్యవస్థ ను బలోపేతం చేయాలన్నారు.

ప్రముఖ పర్యావరణ వేత్త దొంతి నర్సింహా రెడ్డి మాట్లాడుతూ... ప్రస్తుతం దేశంలో హైబ్రిడ్, దేశీ విత్తన వ్యవస్థల మధ్య సంఘర్షణ జరుగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో కార్పొరేట్ ప్రయోజనాలతో కూడిన విత్తన వ్యవస్థను రైతులు సవాలు చేస్తూ ప్రకృతి వ్యవసాయ ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ప్రెసిడెంట్ లీలా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రైతులు, శాస్త్రవేత్తలు, విధాన నిర్ణేతలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయ భాగస్వామ్యం తో విత్తన పండుగను విజయవంతంగా నిర్వహించామన్నారు. లక్ష్యం దిశగా ప్రయాణించాల్సిన దూరం ఇంకా చాలా ఉందని, మరింత స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక తో ముందుకు సాగుతామని ఆమె చెప్పారు.

# మంత్రి ఉత్తమ్ మీటింగ్ అంతిమ యాత్రను ఆపేసిన కోరుట్ల ఖాకీలు

స్వామి భక్తి ఎక్కువైతేఅనూహ్యరీతి లో షాకులు
**అసలేమంత్రిగారుఅందునారాష్ట్రంలో పవర్ ఫుల్ మంత్రుల్లో ఒకరు**
**అంతిమ యాత్రను సైతం అరగంట పాటు ఆపిన వైనం**
**నేతల్లో ఎవరో ఒకరు గుర్తించినా బాగుండేదన్న**

(చెన్నూరి అన్వేషి)
(ఎగ్జికూటివ్ ఎడిటర్)

స్వామి భక్తి ఎక్కువైతేఅనూహ్యరీతి లోషాకులుఎదురవుతాయి. ఇలాంటి ఉదంతాలతో ఉన్న మైలేజీ పోయి డ్యామేజ్ మిగిలుతుంది. తమకు సంబంధం లేకుండానే వివాదాల్లో ఇరుక్కొని ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు కొందరు రాజకీయ నేతలు.ఇప్పుడు అలాంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నారు తెలంగాణ రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. పోలీసులు ప్రదర్శించిన స్వామిభక్తి తో ఎలాంటి తిప్పలు ఎదురవుతాయన్న దానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తుంది ఈ ఉదంతం. మంత్రిగారి కార్నర్ మీటింగ్ పేరుతో ఆ మార్గంలో వస్తున్న అంతిమ యాత్రను సైతం అరగంట పాటు ఆపిన వైనం ఇప్పుడు వివాదంగా మారింది. జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. అసలే మంత్రిగారు అందునా రాష్ట్రంలోని పవర్ ఫుల్ మంత్రుల్లో ఒకరైన మంత్రి కావటంతో ఆయన మీటింగ్ కు గట్టిగా బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు భారీగా పోలీసులను మోహరించారు. ఇదేం తప్పు కాదు.కానీ ఇక్కడే మంత్రిగారి మనసు దోచుకోవాలనుకున్నారో? ఆయన ప్రసంగ ఫ్లోకు బ్రేకులు పడకూడదనుకున్నారో? ఏమో కానీ ఉత్తమ్ కార్నర్ మీటింగ్ జరుగుతున్న సమయంలోనే ఒక అంతిమ యాత్ర మీటింగ్ సమీపానికి వచ్చింది.పట్టణానికి చెందిన కళావతి మరణించగా ఆమె అంతిమయాత్ర సరిగ్గా మంత్రి ఉత్తమ్ కార్నర్ మీటింగ్ జరుగుతున్న సమయంలోనే చేరుకుంది. కార్నర్ మీటింగ్ ఉందని ఆ వైపు వెళ్లేందుకు వీల్లేదని మంత్రిగారి మీటింగ్ అయ్యే వరకు వెయిట్ చేయాల్సిందేనని



నిలిపేశారు. ఓవైపు మంత్రిగారు మరోవైపు పోలీసులు అసలే తమ మనిషి పోయిందన్న వేదనలో ఉన్న వారు మారు మాట్లాడకుండా తమ అంతిమయాత్రను ఆపేసి వెయిట్ చేయసాగారు. దాదాపు 30 నిమిషాల పాటు పాడెను మోస్తూనే ఉండిపోయారు. దీంతో మహిళలు పెద్ద వయస్కులు ఇబ్బందులకు గురయ్యారు. ఈ సంగతి తెలుసుకున్న మంత్రిగారి మీటింగ్ ను కవర్ చేయటానికి వచ్చిన జర్నలిస్టులు పోలీసుల పనిని కవర్ చేసేందుకు ఆ వైపునకుపెద్ద ఎత్తున వెళ్లారు. ఫోటోలు తీయటం మొదలుపెట్టారు. అనుకోని రీతిలో చోటుచేసుకున్న ఈ వైనంతో పోలీసు ఉన్నతాధికారులు ఏం జరిగిందో తెలుసుకొని వెంటనే దిద్దుబాటు చర్యలకు ఆదేశించారు. అరగంటకు పైగా ఆపేయించిన అంతిమయాత్రను కంటిన్యూ అయ్యేలా చేసి కార్నర్ మీటింగ్ లో నాయకుల ప్రసంగాన్ని కాసేపు ఆపించారు. అంతిమయాత్ర సాగేందుకు దారి కల్పించారు. ఇదేదో ముందే చేసి ఉంటే మంత్రి ఉత్తమ్ కార్నర్ మీటింగ్ వివాదంలో చిక్కుకునేది కాదుగా అన్న మాట వినిపిస్తోంది. అంతిమయాత్రకు సంబంధించిన మేళాలు మోతల్ని నేతల్లో ఎవరో ఒకరు గుర్తించినా బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# ఖాఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంలో అసలు నిజం ఏది?

**మంటలు చల్లారిపోయినా ఆగని**
**రాజకీయ విమర్శల సెగలు?**
**అగ్నిప్రమాద ఘటన తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్!**
**అనుమానించిన అనుమానమే నిజమైంది బీఆర్ఎస్**
**కుట్రచేసే అవసరం మీకే ఉంది ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్**
**బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సైతం అదే విమర్శల దాడి**
**పోలీసు ఫిర్యాదులో కీలక అంశాలు**
**ఎఫ్ఎస్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీవాస్‌రెడ్డి**
**అదంతా దుష్ప్రచారం ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్**

(చెన్నూరి అన్వేషి)
(ఎగ్జికూటివ్ ఎడిటర్)

నాంపల్లి తెలంగాణ ఫోరెన్సిక్ ల్యాబ్ లో చెలరేగిన అగ్ని ప్రమాదం మంటలు చల్లారిపోయినా ఈ ఘటన తో అధికార, ప్రతిపక్షాల మధ్య రేగిన రాజకీయ ఆరోపణలు మంటలు మాత్రం రోజురోజుకు ప్రజ్వరిల్లుతుండటం ఆసక్తికరంగా మారింది. నాంపల్లిలోని తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ లో అగ్నిప్రమాద ఘటన ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. మంటల్లో కాలిపోయిన ఫోరెన్సిక్ ఆధారాలు ఎంతమేరకు కాలిపోయాయన్న దానిపై ప్రస్తుతానికి స్పష్టత లేకపోయినప్పటికి ఘటన పై ఇటు అధికార కాంగ్రెస్ పార్టీ సహా ఉన్నతాధికారులు చేస్తున్న ప్రకటనలు ఓ వైపు, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు చేస్తున్న ఆరోపణలు మరోవైపు మున్సిపల్ ఎన్నికల వేళ రాజకీయ సెగలు రేపుతున్నాయి. ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదంలో రాష్ట్రంలో సంచలనం రేపిన సీఎం రేవంత్ రెడ్డి గతంలో ఎదుర్కొన్న ఓటుకు నోటు ఏసీబీ కేసు, బీఆర్ఎస్ ముఖ్యనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఎదుర్కొంటున్న ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు ధగ్ధమయ్యాయన్న అనుమానాలు అధికార, ప్రతిపక్షాల మధ్య రచ్చకు కారణంగా మారాయి.

**అనుమానించిన అనుమానమే నిజమైంది బీఆర్ఎస్**

నాంపల్లి ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ఓటుకు నోటుతో సహా కీలక కేసుల ఆధారాలు దగ్ధమయ్యాయని దీనిపై అధికార కాంగ్రెస్ పార్టీ కుట్ర దాగి ఉందంటూ కేటీఆర్ సహా బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆరోపణలు సంధించారు. ఇందుకు ప్రమాదంపై ఎఫ్ ఎస్ ఎల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి చేసిన ఫిర్యాదు నిదర్శనమని బీఆర్ఎస్ ఆరోపిస్తుంది. మొత్తం ఐదు రూమ్స్‌లోని కీలకమైన ఫైల్స్ కాలిపోయాయని, సర్వర్ రూమ్, కంప్యూటర్ ఫోరెన్సిక్ లాబరేటరీ, ప్రాపర్టీ రూమ్, కేస్ వెరిఫికేషన్ ఛాంబర్, అనాలసిస్ ఛాంబర్‌లోని ఫైల్స్ బూడిదయ్యాయంటూ బీఆర్ఎస్ ఆరోపిస్తుంది.

**పోలీసు ఫిర్యాదులో కీలక అంశాలు**
**ఎఫ్ఎస్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీవాస్‌రెడ్డి**

ఎఫ్ఎస్ఎల్ ఇన్‌స్పెక్టర్ శ్రీవాస్‌రెడ్డి ఫిర్యాదులో మొదట ప్రాపర్టీ రూమ్‌లో భారీగా నల్ల పొగతో కూడిన మంటలు వ్యాపించాయని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఆ తర్వాత మంటలు ఇతర గదులకి వ్యాపించాయని తెలిపారు. శనివారం ఉదయం 10.08 గంటలకు అగ్ని ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో వెల్లడించారు. ల్యాబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగి శ్రీ సాయి కృష్ణ ప్రమాదంపై సమాచారం ఇచ్చారని, కంప్యూటర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ప్రాపర్టీ రూమ్, కేసు వెరిఫికేషన్ ఛాంబర్, సర్వర్ రూమ్, అనాలసిస్ ఛాంబర్, హెచ్‌ఆర్డీ హాల్‌తో పాటు ఫర్నిచర్ పరికరాలు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని ఫిర్యాదు చేశారు. జీరోఎఫ్ఐఆర్ ఫైర్ యాక్సిడెంట్ కింద పోలీసులు కేసు నమోదు చేసి ఫైర్ అక్సిడెంట్ కింద దర్యాప్తు చేస్తున్నారు.

**బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సైతం అదే విమర్శల దాడి**

అటు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కూడా బీఆర్ఎస్, కాంగ్రెస్ కుమ్మక్కై వారి సాగించిన అవినీతి, అక్రమాల కేసుల నుంచి పరస్పరం కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఇందులో భాగంగానే గతంలో సచివాలయంలో అగ్నిప్రమాదం ఇప్పుడు ఎఫ్ ఎస్ ఎల్ ల్యాబ్ లో అగ్నిప్రమాదాలు జరిగాయని ఆరోపించారు. ఎఫ్ఎస్ఎల్ అగ్ని ప్రమాదంలో రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు, కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ కేసు కీలక ఆధారాలు ధ్వంసమైనట్లేనంటూ కీలక ఆరోపణలు చేశారు. ప్రతిపక్షాల ఆరోపణల నేపథ్యంలో ఎఫ్ ఎస్ ఎల్ అగ్ని ప్రమాదం కుట్ర ప్రకారమే జరిగిందా? అనే అనుమానాలు వ్యాప్తి చెందుతున్నాయన్నారు.

**కుట్రచేసే అవసరం మీకే ఉంది ఎంపీ కిరణ్ కుమార్ రెడ్డి ఫైర్**

ఫోరెన్సిక్ ల్యాబ్‌లో జరిగిన అగ్ని ప్రమాదాన్ని బీఆర్ఎస్ నేత కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డికి ముడి పెట్టడంపై కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫోరెన్సిక్ ల్యాబ్ ఘటనలో ఏదైనా కుట్ర ఉంటే అది మీ తరపు నుంచే జరిగి ఉండాలని కేటీఆర్ పై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఎటాక్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు ఉన్నందునా కుట్ర చేసే అవసరం మీకే ఉందని..అందుకేనా ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు అని చామల ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాల కోసమే కేటీఆర్ దుష్ప్రచారానికి దిగారని విమర్శించారు. గత బీఆర్ఎస్ పదేళ్ల దరిద్రపు పాలనను మర్చిపోయి ప్రజలు మీకు మున్సిపల్ ఎన్నికల్లో ఓట్లు వేస్తారని ఎలా అనుకుంటున్నారని మండిపడ్డారు.

**అదంతా దుష్ప్రచారం ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్**

అయితే ఎఫ్ఎస్ఎల్ డీజీ శిఖా గోయల్ మాత్రం అగ్ని ప్రమాదంలో ప్రధాన కేసులుగా ఉన్న ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు ఆధారాలు ఏవి దగ్ధం కాలేదంటూ ప్రకటించడం డీజీపీ శివధర్ రెడ్డి సైతం ఎలాంటి ఎవిడెన్స్ డామేజ్ జరుగలేదని చెప్పడం ఆసక్తికరంగా మారింది. ప్రమాద ఘటనపై ప్రెస్‌నోట్ సైతం అధికారులు విడుదల చేశారు. పూర్తి వివరాలను పబ్లిక్ డొమైన్ లో పెడుతామని శిఖా గోయల్ ప్రకటించారు.ఎఫ్ఎస్ ఎల్ అగ్ని ప్రమాదం తర్వాత రెండు ముఖ్యమైన కేసుల గురించి సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు అని డీజీ శిఖా గోయల్ మీడియాకు వివరణ ఇచ్చారు. వాటిలోని మెదటి కేసు ఏసీబీ కేసు 2015లో 16 ఐటమ్స్ ఎఫ్ఎస్ఎల్ కి పంపించారు అని, దానికి సంబంధించిన అన్ని రిపోర్ట్స్ 2015లోనే ఫోరెన్సిక్ ల్యాబ్ తిరిగి పంపించింది అని, ఆ కేసుకు సంబంధించిన అన్ని మెటీరియల్స్ 2021లో కోర్టుకు సమ్మిట్ చేశామని, ఆ కేసుకు సంబంధించి ఎలాంటి మెటీరియల్ కూడా ఫోరెన్సిక్ ల్యాబ్ లో లేదు అని తెలిపారు.

రెండో కేసు పంజాగుట్టలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో 2024 నుంచి 2026 వరకు 136 ఐటమ్స్ ఫోరెన్సిక్ ల్యాబ్ కి పంపించారు అని, ఇందులో 129 ఐటమ్స్ ఎనాలసిస్ చేసి రిపోర్ట్స్ ని సంబంధించిన దర్యాప్తు సంస్థకు పంపించాం అని, ఏడు రిపోర్ట్స్ ఇవ్వాల్సి ఉంది అని తెలిపారు. దగ్ధమైన ప్రాపర్టీకి సంబంధించి విచారణ చేస్తున్నామని, అందులో ఉన్న సమాచారాన్ని ఫోరెన్సిక్ ల్యాబ్ దగ్గర ఉన్న ఎక్విప్‌మెంట్ తో మళ్లీ రీట్రేవ్ చేయవచ్చని, ఎటువంటి ఆధారాలు మిస్ అయ్యే అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదంలో ఆధారాలన్ని దగ్ధమైనట్లుగా సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారాన్ని ప్రజలు నమ్మ వద్దు అని కోరారు. సీజ్ చేసిన ప్రాపర్టీ కొంతమేర మాత్రమే కాలిపోయిందని వెల్లడించారు. మొత్తం మీద ఫోరెన్సిక్ ల్యాబ్ లో చెలరేగిన అగ్ని ప్రమాదం మంటలు చల్లారిపోయినా ఈ ఘటనతో అధికార, ప్రతిపక్షాల మధ్య రేగిన రాజకీయ ఆరోపణలు మంటలు మాత్రం రోజురోజుకు ప్రజ్వరిల్లుతుండటం ఆసక్తికరంగా మారింది. .



ధర్మఘంట

# నగర పోలీసుల అంకితభావానికి గౌరవం

**1,446 మందికి అవార్డులు అందజేసిన పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్**
**నగర చరిత్రలో తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో సరికొత్త అధ్యాయం**
**విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ చూపిన వారికి సముచిత గౌరవం**





**ధర్మఘంట. ఫిబ్రవరి 08. హైదరాబాద్..**

విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన 1,446 మంది పోలీసు సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు ఆదివారం రివార్డులు అందజేశారు. నగర పోలీసు చరిత్రలో తొలిసారిగా ప్రవేశపెట్టిన 'ఎక్స్‌ట్రా మైల్' పురస్కారాలతో పాటు 'గుడ్ వర్క్ డన్' రివార్డులను పోలీస్ సిబ్బందికి ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రదానం చేశారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (టీజీఐసీసీసీ) వేదికగా ఈ పురస్కారాల ప్రదానోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలను అభినందిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ గారు కీలక ప్రసంగం చేశారు. పోలీసు వృత్తి కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యత అని ఆయన గుర్తు చేశారు. విధులకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని, ప్రతి పనిలోనూ సృజనాత్మకత, మానవీయత ప్రతిబింబించాలని పిలుపునిచ్చారు. అప్పగించిన పనిని పూర్తి చేయడం కంటే, బాధితులకు ఎంతటి భరోసాను కల్పించామన్నదే అసలైన విజయమని స్పష్టం చేశారు. విధులకు అతీతంగా సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో గౌరవం పెరుగుతుందని పేర్కొన్నారు. సిబ్బందిలో ఉన్న అసాధారణ ప్రతిభను, వినూత్న ఆలోచనలను, విధులకు అతీతమైన సేవలను గుర్తించి, గౌరవించాలనే ఉద్దేశంతోనే కమిషనరేట్ చరిత్రలోనే తొలిసారిగా 'ఎక్స్‌ట్రా మైల్' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. విధులకు అతీతంగా సమాజానికి మేలు చేసే ప్రతి పోలీసు అధికారిని ఈ వేదిక గౌరవిస్తుందని చెప్పారు. ఇది కేవలం ఒక అవార్డు మాత్రమే కాదని, అంకితభావానికి దక్కిన గుర్తింపు అని అన్నారు. ఈ గుర్తింపు పోలీసుల్లో నూతనోత్తేజాన్ని నింపుతుందని, ఇతరులు నిబద్ధతతో పనిచేసేలా ప్రేరణనిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాంకేతికత ఎంత పురోగమించినా, క్షేత్రస్థాయిలో పోలీస్ సిబ్బంది చూపే చిత్తశుద్ధికి, ఆపదలో ఉన్న వారి పట్ల ప్రదర్శించే మానవత్వానికి ఏ టెక్నాలజీ సాటిరాదని గుర్తు చేశారు. హోంగార్డు నుంచి ఉన్నతాధికారి వరకు ప్రతి ఒక్కరూ ఒకే బృందంగా పనిచేయడం వల్లే నగరంలో శాంతిభద్రతలు సమర్థంగా ఉన్నాయని కొనియాడారు.

ఈ పురస్కారాలు ఇక్కడితో ఆగిపోవని, ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేందుకు ఇకపై ప్రతి నెల జోనల్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్‌హెచ్‌ఓలు, ఎస్ఐలు, కానిస్టేబుళ్లకు రివార్డులు అందజేస్తామని తెలిపారు. పోలీస్ సిబ్బంది కృషి, నిజాయితీ వృథా కాదని, కష్టానికి తగ్గ గుర్తింపు కచ్చితంగా ఉంటుందన్నారు. కాగా, గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన 2, 3, 4వ త్రైమాసికాల్లో ఉత్తమ ప్రతిభ చూపిన వారిని ఈ అవార్డులకు ఎంపిక చేశారు. ఎక్స్ ట్రా మైల్ లో భాగంగా విధి నిర్వహణలో విధులకు అతీతంగా సేవలందించిన 271 మందికి ఈ పురస్కారం దక్కింది. గుడ్ వర్క్ డన్ లో భాగంగా విధుల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన 1,175 మందికి ఈ రివార్డులు వరించాయి. పురస్కారాలు అందుకున్న వారిలో అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, హోంగార్డులతో పాటు మినిస్టీరియల్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఉన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ శ్రీ.ఎం. శ్రీనివాసులు, ఐపీఎస్, జాయింట్ సీపీ నార్త్ రేంజ్ శ్రీమతి ఎన్ .శ్వేత, ఐపీఎస్, డీసీపీలు శ్రీ.ఎస్.చైతన్య కుమార్, ఐపీఎస్, శ్రీమతి శిల్పవల్లి, ఐపీఎస్, శ్రీ.వి.అరవింద్ బాబు, శ్రీమతి లావణ్య నాయక్ జాదవ్ , శ్రీమతి కె. వెంకట లక్ష్మి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోపిడీ చేసినందుకు బీఆర్ఎస్ కు ఓటు వేయాలా?



**పది సంవత్సరాల్లో బీఆర్ఎస్ పార్టీ ఒక్క ఇల్లు, ఇంటి స్థలం ఇవ్వలేదు**
**ప్రతి పైసా పోగు చేస్తాం.. పేదలకు పంచుతాం**
**పేదల ఆత్మగౌరవం కోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేస్తాం**
**అర్హత కలిగిన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు**
**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**





**ఖమ్మం/ ఫిబ్రవరి 8 వైరా ధర్మ ఘంట**

ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ ఎన్నికల సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు అడుగుతున్నారు.. వారికి ఎందుకు ఓటు వేయాలని పట్టణ ప్రజలంతా ప్రశ్నించండి, ఆలోచించండని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. పది సంవత్సరాలు రాష్ట్రాన్ని దోపిడీ చేసినందుకు వారికి ఓటు వేయాలా? మనందరినీ తాకట్టు పెట్టి రాష్ట్రాన్ని ఎనిమిది లక్షల కోట్ల అప్పుల్లో ముంచినందుకు వారికి ఓటు వేయాలా అని డిప్యూటీ సీఎం ప్రశ్నించారు. ఇక చాలు వారి పరిపాలన ముగిసిపోయింది అన్నారు. టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక ఇల్లు కానీ ఒక ఇంటి స్థలం కానీ ఇవ్వలేదని డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. 10 సంవత్సరాల క్రితం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాలే పేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించాయి తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చాకే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభమైందని.. ఈ విషయాన్ని పేదల ఇంటికి సంబంధించిన ఏ ఇటుక పెళ్ళని అడిగినా చెబుతుందని డిప్యూటీ సీఎం అన్నారు. రాష్ట్ర వనరులు, ఆస్తులు, వ్యవస్థలు, ప్రజల కోసం ఖర్చు పెడతామని మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి పోయింది అన్నారు. పేదలు బడుగుల బాధలు అర్థం చేసుకునే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి వచ్చాకే పేదలు ఆత్మగౌరవంతో తలెత్తుకొని జీవించేలా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి 5 లక్షలు ఖర్చు చేస్తున్నావ్ రాష్ట్రంలో మొదటి దశలో నాలుగున్నర లక్షల నిర్మాణం జరుగుతుంది ఇందుకుగాను 22,500 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తాం వారు ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించేలా చేస్తామన్నారు.

టిఆర్ఎస్ 10 సంవత్సరాల కాలం పాలనలో పేదలు రేషన్ కార్డు కోసం తిరిగి తిరిగి అలిసిపోయారు ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ కార్డులను మంజూరు చేశాము రాష్ట్రంలో 1.15 కోట్ల కుటుంబాలు ఉండగా 1.02 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నాం అన్నారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన దొడ్డు బియ్యం తినలేక కోళ్ళ దానాకు ఉపయోగించేవారు కానీ నేడు కిలో 50 రూపాయల ఖరీదు చేసే సన్నబియ్యాన్ని మనిషికి ఆరు కిలోల చొప్పున ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తుందని తెలిపారు. వృద్ధులు కుటుంబ సభ్యులు అనారోగ్యం పాలైతే ఆస్తులు పుస్తెలు తాకట్టు పెట్టుకునే పరిస్థితి ఇబ్బంది నుంచి పేదలను బయటపడేసేందుకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పది లక్షల వరకు ఉచితంగా వైద్యం అందిస్తున్నామని, పేదల సంక్షేమం కోసం ఎంతటి ఖర్చుకైనా ప్రజా ప్రభుత్వం వెనుకాడ బోధని తెలిపారు. మహిళలను మహాలక్ష్మి గా చూసుకునే సంప్రదాయం మనది వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేస్తామని ప్రకటించాం, మేం ప్రకటించగానే ఇది సాధ్యమా అని కొందరు ఎద్దేవా చేశారు మరి కొందరు హేళనగా నవ్వారు కానీ మేం ఇచ్చిన మాటను నెరవేర్చడమే కాదు అంతకుమించి మొదటి సంవత్సరంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు 27 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి పైసా పోగేస్తాం పేదలకు పంచుతామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మహిళలు రాష్ట్రంలోని ఒక మూల నుంచి మరో మూలకు ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణం చేసేందుకు అవకాశం కల్పించాం మహిళల పక్షాన ప్రతినెల రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీకి డబ్బులు చెల్లిస్తుందని తెలిపారు. డబ్బులు మిగిలితే ఇంట్లో ఇల్లాలు పిల్లల అభివృద్ధి కోసం ఖర్చు పెడతారు అన్న ఆలోచనతో 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం విద్యుత్ సంస్థలకు ప్రతినెల పేదల పక్షాన ప్రభుత్వమే చెల్లిస్తుంది అని తెలిపారు. పది సంవత్సరాలు గ్రూప్ వన్ పరీక్ష నిర్వహించలేకపోయారు, పిల్లలు చదువుకునే ఉద్యోగాల్లో స్థిరపడతారని పేద తల్లిదండ్రులు కూలి నాలి చేసి డబ్బులు పంపితే మీరు పది సంవత్సరాలు పరీక్షలు నిర్వహించలేకపోయారు అని డిప్యూటీ సీఎం ఎద్దేవా చేశారు. కానీ ప్రజా ప్రభుత్వం రాగానే గ్రూప్ వన్ పరీక్షను విజయవంతంగా నిర్వహించడమే కాదు ప్రజల సమక్షంలో ఉద్యోగ పత్రాలు అందజేశామని, అదేవిధంగా గ్రూప్ టు త్రీ పరీక్షలు విజయవంతంగా నిర్వహించారు రెండు సంవత్సరాల కాలంలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత ప్రజా ప్రభుత్వాన్ని తెలిపారు.

### వైరా వాసిగా, డిప్యూటీ సీఎం గా పట్టణ అభివృద్ధి బాధిత తీసుకుంటా

ఈ ఎన్నికలు వైరా పట్టణ అభివృద్ధికి సంబంధించిన ఎన్నికలు వైరా పట్టణ ఎదుగుదలను ఎవరు అడ్డుకుంటారో చూస్తాం

వైరా పట్టణంలో జరిగిన ప్రతి అభివృద్ధి కాంగ్రెస్ హయాంలోనేయంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఓ వరం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, చిరు వ్యాపారులకు షాపింగ్ కాంప్లెక్స్‌మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వైరా ప్రాంతవాసిగా డిప్యూటీ సీఎం గా తాను వైరా పట్టణ అభివృద్ధి బాధ్యత తీసుకుంటానని, వైరా పట్టణ అభివృద్ధిని ఎవరు అడ్డుకుంటారో చూస్తామని, మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి అభ్యర్థులు అందరినీ గెలిపించాలని డివిడి సీఎం కోరారు. రోడ్లు డ్రైనేజీలు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసుకొని భవిష్యత్తు తరాలకు ఒక మోడల్ వైరా పట్టణాన్ని అందిద్దామని డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. ఈ మున్సిపల్ ఎన్నికలు వైరా పట్టణ అభివృద్ధికి సంబంధించిన అభివృద్ధి చేసుకుందామా? లేదా? గత పది సంవత్సరాల మాదిరిగానే పట్టణాన్ని వదిలేద్దామా అనేది ఓటర్లు ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం కోరారు.

వైరా పట్టణంలో జరిగిన ఏ అభివృద్ధి కార్యక్రమం శంకుస్థాపన, ప్రారంభం అన్ని కాంగ్రెస్ హయాంలో జరిగినవి 10 సంవత్సరాలు రాష్ట్రాన్ని పాలించిన వారు చేసిన కొత్త పని ఒకటి లేదన్నారు. శాంతి కాలనీ ఎస్సీ ఎస్టీ కాలనీ అన్ని కాంగ్రెస్ హయాంలో ఏర్పడినవే అన్నారు. కరెంటు, ఆసుపత్రి, కాలేజీ, డిగ్రీ కళాశాల అన్ని కాంగ్రెస్ హయాంలోనే వచ్చాయన్నారు. 200 కోట్లతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్ వైరా పట్టణానికి ఓ వరం అన్నారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించేందుకు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుందని, విద్యా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు జూనియర్ కళాశాల నిర్మాణానికి నిధులు కేటాయించారు అని తెలిపారు. ఐటిఐ ని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్గా మార్చం పాలిటెక్నిక్ కళాశాలలో మంజూరు చేశామని తెలిపారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే షాపులను కూలగొట్టి ఐదు సంవత్సరాలు అయ్యింది మొండి గోడలతో వైరా పట్టణం కలతప్పింది అని స్థానికులు వివరిస్తే నిన్నటికి నిన్న ఇక్కడే ఫైల్ తెప్పించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి సాంక్షన్ చేయించినట్టు వివరించారు.

వైరాకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం ఫైల్ వడివడిగా ప్రాసెస్ జరుగుతుంది అని తెలిపారు. ఇక్కడి ప్రజలంతా వ్యవసాయంపై ఆధారపడిన వారే వైరా ప్రాజెక్టును అభివృద్ధి చేసుకోవాలని కుడి ఎడమ కాలువలకు లైనింగ్ చేశాం తిరిగి ప్రజా ప్రభుత్వం వచ్చాకే రెండవ దశ లైనింగ్ కార్యక్రమం ప్రారంభమైంది ఇందుకోసం ఎన్ని కోట్లయినా ఖర్చు చేస్తామని తెలిపారు. గతంలో గ్రామపంచాయతీ బిల్డింగ్ చెరువు ఒడ్డున ఉండేది కానీ దాని ప్రధాన రహదారి మీదకు తీసుకొచ్చి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరును కట్టించిన ఘనత నాటి కాంగ్రెస్ సర్పంచ్ దుర్గాప్రసాద్ అని తెలిపారు. ధునిక వసతులతో స్మశాన వాటిక, ముస్లిం మైనార్టీ సోదరులకు బడ్జెట్ పెంచాం ఇదిగా నిర్మాణానికి నిధులు కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, హస్తకళల చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూవ్వాళ్ళ దుర్గాప్రసాద్, బొర్రా రాజశేఖర్, సూతకని జైపాల్, కట్ల రంగారావు, శీలం నర్సిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల సామాగ్రీ పంపిణీ, పోలింగ్, కౌంటింగ్ కు సర్వం సిద్ధం : మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్.





**ధర్మఘంట, ఫిబ్రవరి 08, కరీంనగర్:**

ఎన్నికల సామాగ్రీ పంపిణీ, పోలింగ్, కౌంటింగ్ కు సర్వం సిద్ధం చేశామని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ 2 వ సాధారణ ఎన్నికల్లో భాగంగా ఆదివారం రోజు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్, పోలీస్ కమీషనర్ గౌస్ ఆలం ఎస్.ఆర్.ఆర్ కళాశాలను సందర్శించారు. నగరపాలక సంస్థ అధికారులు, పోలీస్ అధికారులతో కలిసి ఎన్నికల సామాగ్రి పంపిణీ చేసే సెంటర్ తో పాటు బ్యాలెట్ బాక్సులు భద్రపరుచు గదులు, కౌంటింగ్ హాల్ ను తనిఖీ చేసి పరిశీలించారు. పోలీస్ భద్రత ఏర్పాట్ల నేపథ్యంలో పోలీస్ బంధోబస్తు నిర్వహణకు కౌంటింగ్ హాల్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను సీపీ గౌస్ ఆలం నిశితంగా పరిశీలించి పోలీస్ అధికారులకు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. భారీ బంధోబస్తు ఏర్పాటు పై కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ తో సుదీర్ఘంగా చర్చించారు. బారీ బంధోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ నగరపాలక సంస్థ సంస్థ అధికారులతో కలిసి నగరంలోని పోలింగ్ స్టేషన్ ను సందర్శించి పోలింగ్ ప్రక్రియకు ఏర్పాటు చేసిన వసతులు సౌకర్యాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ సాధారణ ఎన్నికల నిర్వహణ కు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భారీ పోలింగ్ బంధోబస్తు మద్య పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. 11 వ తేదిన జరగబోయే పోలింగ్ కోసం 477 పోలింగ్ స్టేషన్లను గుర్తించి పోలింగ్ కు కావల్సిన ఏర్పాట్లు అన్ని పూర్తి చేశామన్నారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేలా వసతి సౌకర్యాలు పూర్తి చేశామన్నారు. ఇందులో సమస్యాత్మక అతి సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించామని సంబంధిత పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలిస్ బధ్రతతో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ సహకారంతో పోలీస్ బధ్రత ఏర్పాటు చేసేలా చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. అంతే కాకుండా పోలింగ్ సామాగ్రీ పంపిణీ కి సర్వం సిద్దం చేశామన్నారు. పోలింగ్ సామాగ్రీని సిబ్బందికి పంపిణీ చేసేందుకు డివిజన్ వారిగా పోలింగ్ స్టేషన్ ప్రకారం కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద లైటింగ్ ఫర్నిచర్, త్రాగు నీటి వసతి, రవాణా కోసం బస్సు సౌకర్యం ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో జాగ్రత్తలు పాటిస్తున్నట్లు తెలిపారు. మరో వైపు కౌంటింగ్ ప్రక్రియ కోసం కావాల్సిన వసతి సౌకర్యాలు కల్పించామన్నారు. కౌంటింగ్ ప్రక్రియ కోసం ప్రత్యేకంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు బ్యాలెట్ లెక్కింపు కోసం ట్రేలు, ర్యాకులు, టేబుల్స్ కూడ ఏర్పాటు చేసేలా తగిన చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణం లో ముగించేలా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ దిలీప్ కుమార్, ఏసిపి వెంకటరమణ, సిఐలు సృజన్ రెడ్డి, రాంచంధర్ రావు, తిరుమల్, నగరపాలక సంస్థ అధికారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హుస్నాబాద్ లో ఒక్క ఛాన్స్ ఇవ్వండి





**చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే అభివృద్ధి చేసి చూపిస్తా**
**గుర్తుంచుకోండి..నిధులిచ్చేది మోడీ. తెచ్చేది బండి**
**పొరపాటున కాంగ్రెస్, బీఆర్ఎస్ లను గెలిపిస్తే కేంద్ర నిధులు దారిమళ్లిస్తారు**
**నిండు మనుసుతో బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించండి**

**ధర్మఘంట, ఫిబ్రవరి 8 హుస్నాబాద్ ,**

మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క అవకాశమిచ్చి హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ స్థానిక ప్రజలకు విజప్తి చేశారు. బీజేపీని గెలిపిస్తే కేంద్రం నుండి అధిక నిధులు తీసుకొచ్చి హుస్నాబాద్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హుస్నాబాద్ పట్టనానికి విచ్చేసిన బీజేపీ నేతలు నిర్వహించిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడారు. హుస్నాబాద్ ఎన్నికల ఇంఛార్జీ కూరపాటి విజయ్, రాష్ట్ర అధికార ప్రతినిధి జె.సంగప్ప, నియోజకవర్గ నాయకులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ సభలో బీజేపీ అభ్యర్థులను గెలపించాలని విజప్తి చేశారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ హుస్నాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో అంతో ఇంతో అభివృద్ధి జరుగుతోందంటే కేంద్ర నిధులతోనే.. వీధిలో వెలిగే విద్యుత్ లైట్ మొదలు రోడ్లు, డ్రైనేజీ, నీళ్ల సరఫరా, పార్కుల ఏర్పాటు దాకా అన్నీ మోదీగారు ఇచ్చే నిధులతోనే. ఎల్కతుర్తి నుండి సిద్దిపేట వరకు 4 లేన్ విస్తరణకు వందల కోట్లు తీసుకొచ్చిన. 14, 15వ ఆర్థిక సంఘం ద్వారా , స్వచ్ఛ భారత్ ద్వారా పెద్ద ఎత్తున కేంద్రం నిధులిచ్చింది. స్వనిధి ద్వారా 2431 మందికి 4కోట్ల 35 లక్షల రూపాయలు లబ్ది చేకూర్చినం. ప్రభుత్వ స్కూళ్లలో టెన్త్ చదివే విద్యార్థులందరికీ ఉచితంగా బ్రాండెడ్ సైకిళు ఇచ్చిన. టెన్త్ విద్యార్థులందరికీ పరీక్ష ఫీజు చెల్లించిన. ఆసుపత్రులకు మెడికల్ ఎక్విప్‌మెంట్స్ అందించిన. ఒకప్పుడు గ్రామ పంచాయతీగా ఉన్న హుస్నాబాద్ ను మున్సిపాలిటీగా మార్చిన తరువాత ఏమైనా అభివృద్ధి జరిగిందా. కాంగ్రెస్, బీఆర్ఎస్ ను గెలిపిస్తే ఏమైనా హుస్నాబాద్ ను అభివృద్ధి చేశారా? ఇప్పటికీ వర్షాకాలం వస్తే వరద నీటితో అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాలు జలమయమవుతున్నాయి. అడ్డగోలు ఇంటి పన్నులు పెంచడంతో వ్యాపార, వాణిజ్య వర్గాలు ఇబ్బంది పడుతున్నాయి. స్మశానవాటిక లేక ఆరెపల్లి వాసుల ఇబ్బందులు పడుతున్నారు. హుస్నాబాద్ చైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే. వరద ముప్పు లేకుండా అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ ప్రాంతాలను అభివృద్ధి చేస్తా. ఇంటి పన్నును క్రమబద్ధీకరిస్తా..ఆరెపల్లికి స్మశాన వాటికను నిర్మిస్తా..పట్టణాన్ని అమ్రుత్ స్కీం పరిధిలోకి తీసుకొస్తా.స్లమ్ ఏరియాలను అభివృద్ధి చేస్తా. బంజారా భవన్ ను పూర్తి చేయిస్తా.... సైనిక్ స్కూల్, ఏకలవ్య, నవోదయ స్కూళ్లను హుస్నాబాద్ లోనే ఏర్పాటు చేసేందుకు క్రుషి చేస్తా.. పొట్లపల్లి దేవస్థానం వరకు 4 లేన్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయిస్తా.

# కొట్లాడి టిక్కెట్ ఇప్పించా గెలిపించే బాధ్యత గ్రామస్తులదే

**మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**





**ధర్మఘంట, ఫిబ్రవరి 9,కరీంనగర్** కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో కొట్లాడి 7వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బండి మమత-మల్లేశం కు టిక్కెట్ ఇప్పించానని, తన శ్రమ వృథా కాకుండా ఆమెను గెలిపించుకోవాల్సిన బాధ్యత సదాశివపల్లి గ్రామస్తులపైన ఉందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.ఆదివారం కరీంనగర్ నగరపాలక సంస్థ ఏడవ డివిజన్ పరిధిలోని సదాశివపల్లి గ్రామంలో డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి బండి మమత కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కవ్వంపల్లి 1250 మంది ఓటర్లు మాత్రమే ఉన్న సదాశివపల్లి టిక్కెట్ ఇచ్చేందుకు నిరాకరిస్తే పట్టుబట్టి బండి మమతకు కాంగ్రెస్ టికెట్లు ఇప్పించానన్నారు. సదాశివ పల్లి ప్రజలంతా ఏకమై ఆమెను గెలిపిస్తారనే నమ్మకంతోనే మమతకు సీటు ఇప్పించినట్లు ఆయన వివరించారు. ఉన్న ఊరు కన్నతల్లి లాంటిదని, కన్నతల్లి లాంటి ఊరుకు సేవ చేసే అదృష్టం బండి మమతకు దక్కిందని ఆయన చెప్పారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ప్రజలంతా ఏకమై అఖండ మెజార్టీతో మమతను గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి కోరారు. ఒక్క ఓటు కూడా వృథా కాకూడదని, చేతి గుర్తుకు ఓటు వేసి మమతను ఆశీర్వదించాలని కోరారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్ ను గెలిపిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. సదాశివపల్లి గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే నిధుల నుంచే కాకుండా సుడా నిధులతో కూడా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. బండి మమతను కార్పొరేటర్ గా గెలిపిస్తే ఈ గ్రామానికి అవసరమైన పనులకు నిధులు కేటాయిస్తానని చెప్పారు. మమతను సదాశివపల్లి ప్రజలు గెలిపిస్తారని నమ్మకం తనకు ఉందని, ఆ నమ్మకాన్ని వమ్ము కాకుండా చూడాల్సిన బాధ్యత సదాశివపల్లి గ్రామస్తుల పైననే ఉందని ఆయన పేర్కొన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి బండి మమతను గెలిపించడం ద్వారా సదాశివపల్లి గ్రామస్తులు అభివృద్ధికి బాట వేయాలన్నారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో శూన్యమని విమర్శించారు. గత పాలకులు ఏమి అభివృద్ధి చేశారో చూసామన్నారు. ఒక్కరికి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని, సన్న బియ్యం ఇవ్వలేదని, రైతు మాఫీ చేయలేదని ఆయన ఎద్దేవా చేశారు. అభివృద్ధి కోసం కాంగ్రెస్ కార్పోరేటర్ గా మమతను గెలిపించుకోవడానికి సదాశివపల్లి ప్రజలు కంకణబద్దులు కావాలని ఆయన కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో 8వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థి బండి మమత, డివిజన్ పార్టీ అధ్యక్షుడు బండి మల్లేశం,
మానకొండూర్,శంకరపట్నం,తిమ్మాపూర్,గన్నేరువరం మండల పార్టీ అధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, గోపగోని బస్వయ్య గౌడ్, బండారి రమేష్, ముస్కు ఉపేందర్ రెడ్డి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఒగ్గు దామోదర్, పార్టీ నాయకులు తాళ్లపల్లి సంపత్, మోరపల్లి రమణారెడ్డి,తుమ్మనపల్లి శ్రీనివాసరావు, ఊట్కూరి వెంకట రమణారెడ్డి, మర్రి ఓదెలు యాదవ్, పులి కృష్ణ, తిరుమల్ రెడ్డి, ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, ద్యావ శ్రీనివాస్ రెడ్డి, కొమ్మెర రవీందర్ రెడ్డి, డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, మాడ తిరువతిరెడ్డి, గొల్లెన గొల్లెన కొమురయ్య, హరీష్, బుర్ర శ్రీధర్, బొట్ల కిషన్, బుర్ర తిరుపతి గౌడ్,సాయిరి దేవయ్య, కానిగంటి రమేష్, తమ్మిశెట్టి రాజేష్, దుడ్డెల కుమార్, దూలం దేవేంద్ర, మడుపు ప్రేమ్ కుమార్, రామిడి తిరుపతి, సాదవేణి సత్తయ్య, సింగిరెడ్డి అనంతరెడ్డి, ఏనుగు చుక్కారెడ్డి,ఏనుగు ఎల్లారెడ్డి, ఏనుగు కోటి, సింగిరెడ్డి మనోహర్ రెడ్డి,సింగిరెడ్డి మల్లారెడ్డి, బండి చంద్రయ్య, ఎండీ బాబు, నాగెల్లి నర్సయ్య, లచ్చయ్య, కందుకూరి వెంకటస్వామి, కిషన్, భాస్కర్, నాగిశెట్టి రాజయ్య, బక్కారెడ్డి, భాగ్యలక్ష్మి, కోంద్ర సురేష్, కనకం అశోక్, వేగోళపు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ పోరు ఎఫెక్ట్ విస్తృత తనిఖీలు భారీగా పట్టుబడిననగదు








**నగదు, బంగారం, మద్యం, ఉచిత వస్తువులు, తదితర సామాగ్రి తనిఖీ**

**వారం రోజుల్లో రూ. 2కోట్ల కు పైగా విలువ గల సొత్తు స్వాధీనం**

**(చెన్నూరి అన్వేషి)**
**(ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)**

తెలంగాణలోని మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో పోలీసులు విస్తృతతంగా తనిఖీలు చేపట్టారు. అయితే ఈ సారి టార్గెట్ మనీ పేరుతో లెక్కకు మించి చేతికి దొరికిన ప్రతిదానిని సీజ్ చేస్తున్నారు పోలీసులు. నగదు, బంగారం, మద్యం, ఉచిత వస్తువులు, తదితర సామాగ్రిని ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ సీజ్ చేసి వాటిని ఎన్నికల సంఘానికి రోజు వారీగా లెక్కలు పంపుతున్నారు. ఎప్పుడూ లేవి విధంగా సీజింగ్ టార్గెట్ పెట్టుకోని మరి తనిఖీలు నిర్వహిస్తున్నారు పోలీసులు. షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఈ రోజు వరకు అధికారులు స్వాదినం చేసుకున్న మొత్తం సొమ్ము 2కోట్లు దాటింది. పట్టుబడిన మొత్తంలో రూ. 89 లక్షల ముప్పైవేల నగదు, 84 లక్షల 89వేల విలువై మద్యం ఉన్నాయి. అలాగే రూ. 14 లక్షల 69 వేల విలువగల గల గోల్డ్ ,సిల్వర్ లాంటి విలువైన మెటల్ వస్తువులు ఉన్నట్లు ఈసీ లెక్కలో పేర్కొన్నారు. ఇవి కాకుండా ఉచితాలకి సంబంధించిన బియ్యం, చీరెలు, ల్యాప్ టాప్స్, క్రీడా సామాగ్రి, వాహనాలు ఉన్నట్లు తెలిపారు. గడిచిన వారం రోజుల్లో అన్ని రకాలు కలిపి రూ. 2కోట్ల కు పైగా విలువ గల సోత్తును స్వాదినం చేసుకున్నట్టు అధికారులు తెలిపారు. .

## 420 హామీలు 6 గ్యారెంటీ లతో తెలంగాణ ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్ పార్టీ...





**కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసం**
**మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**
**ధర్మఘంట,ఫిబ్రవరి08,రామగుండం:**

420 హామీలు 6 గ్యారెంటీ లతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ అని , కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. రామగుండం కార్పోరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో 26,27,25,2, 37, 35,56,45 డివిజన్ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఇంచార్జి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొని విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 420 హామీలు 6 గ్యారెంటీ లతో తెలంగాణ ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ అని రెండేండ్ల పాలనలో చేసింది ఎమి లేదని అన్నారు రైతులకు రైతుబంధు మహిళలకు 2500, తులం బంగారం, అవ్వ తాతలకు 4000 పింఛన్లు విద్యార్థులకు స్కూటీలు ఇస్తానని చెప్పి అన్ని వర్గాలను మోసం చేశాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని అన్నారు. కెసిఆర్ ఆడపడుచులకు కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా లక్ష రూపాయలు ఇచ్చిండు, కానీ ఓట్లు కావాలి కాబట్టి తులం బంగారం తో పాటుగా తులం బంగారం ఇస్తామని చెప్పి ఓట్లు వేయించుకుని గద్దెనెక్కిందని అన్నారు.కార్పోరేషన్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డి రోజుకో అబద్దం చెబుతూనే ఉన్నాడన్నారు. అబద్ధపు హామీలు నమ్మి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి ఇప్పుడు ప్రజలు బాధపడుతున్నారని అన్నారు. రామగుండం కార్పోరేషన్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ కార్పొరేటర్ సభ్యులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు అయులయ్య యాదవ్ కౌశిక లత బోడ్డుపల్లి శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొనడం జరిగింది

# తెలంగాణ మీడియాలో అక్రిడిటేషన్ల అలజడి...!

తెలంగాణలో మీడియా అక్రిడిటేషన్ వ్యవహారం ఇప్పుడు సందడిగా మారింది.గత ప్రభుత్వ కాలంలో జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ఆలస్యమై,కాలయాపన జరిగింది.ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కూడా రెండున్నర ఏళ్ళు గడిచిపోయాయి. మీడియా సంస్థల,జర్నలిస్టు సంఘాల విజ్ఞప్తుల మేరకు మీడియా అకాడమీ,రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి పెట్టి, తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025ను ఖరారు చేశారు.జీవో ఎంఎస్ నెం.252 ద్వారా కొత్త నిబంధనలు తీసుకొచ్చి,ఇటీవల (జనవరి 2026లో) కొన్ని సవరణలు (జీవో ఎంఎస్ నెం.103 వంటివి) చేసి, మరింత సమగ్రంగా మార్చినట్లు చెబుతున్నారు.ఎట్టకేలకు ఫిబ్రవరి 9 నుండి అక్రిడిటేషన్ల దరఖాస్తుకు ముహూర్తం పిక్స్ చేశారు.

**కీలక మార్పులు మరియు నిబంధనలు**

ప్రభుత్వం ఇచ్చిన రూల్స్ ప్రకారం డెస్క్ జర్నలిస్టుల పోస్టుల్లో కనీసం 33% మహిళలకు రిజర్వ్ చేయాలని,అక్రిడిటేషన్ కోటాలో కూడా వారికి ప్రాధాన్యతను చేర్చారు.డెస్క్ జర్నలిస్టులకు సమాన హక్కులు కల్పించడంలో భాగంగా ఈ సవరణలు చేశారు. అయితే,మొదట్లో డెస్క్ వర్సెస్ ఫీల్డ్ జర్నలిస్టుల మధ్య విభజనపై కొన్ని అభ్యంతరాలు వచ్చాయి.సవరణల తర్వాత డెస్క్ జర్నలిస్టులకు కూడా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేస్తామని స్పష్టం చేశారు.

**సర్క్యులేషన్ ఆధారంగా అదనపు కార్డులు**

2.5 లక్షలకు పైగా సర్క్యులేషన్ ఉన్న ప్రింట్ మీడియాకు మండల్ స్థాయిలో అదనపు కార్డులు, స్పోర్ట్స్,కల్చర్,ఫిల్మ్ వంటి కేటగిరీల్లో అదనపు స్లాట్లు కల్పిస్తూ,కొత్త కార్డులు 2 సంవత్సరాలు(2026-2028) వరకు వ్యాలీడ్ ఉండేలా కాలపరిమితి విధించారు.దీనితో ఫిబ్రవరి 9,2026 నుంచి అజూతీ.వశ్రీఘఅస్త్రుఘు.స్త్రశీజ.అఅ ద్వారా దరఖాస్తులు స్వీకరణ ప్రారంభమావుతాయని పేర్కొన్నారు.ఇక మీడియా సంస్థలు జర్నలిస్టుల జాబితా సమర్పించాలి.ఆ తర్వాత వ్యక్తిగత దరఖాస్తులు చేసుకువాలి.పాత కార్డులు ఫిబ్రవరి 28,2026తో ముగియనున్నాయి.

**జర్నలిస్ట్ సంఘాల అభ్యంతరాలు**

ఇదిలా ఉంటే మొదటి జీవో 252 లో డెస్క్ జర్నలిస్టులను వేరుచేసి,వారికి అక్రిడిటేషన్ ఇవ్వకుండా చేస్తున్నారని టియుడబ్ల్యూజె,డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ వంటి సంఘాలు తీవ్రంగా అభ్యంతరం తెలిపాయి. “అర్హులైన ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు సమానంగా ఇవ్వాలి“ అని డిమాండ్ చేశాయి.కొన్ని సంఘాలు ప్రొటెస్ట్‌లు కూడా చేశాయి.
ప్రభుత్వం ఈ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని,జనవరి 2026లో సవరణలు చేసింది. సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 14 సంఘాలతో సమావేశమై, “కార్డుల సంఖ్య తగ్గదు,గతం కంటే ఎక్కువ ఇస్తాం“ అని హామీ ఇచ్చారు.అక్రిడిటేషన్ వర్సెస్ మీడియా కార్డ్ అనే తేడా లేదని, అందరికీ సమాన లబ్ది చేకూరుతుందని స్పష్టం చేశారు. దీనితో ఆన్‌లైన్ అక్రిడిటేషన్ దరఖాస్తులకు లైన్ క్లియర్ అయినట్లుగా భావిస్తున్నారు. అయినా పెద్ద పత్రికలు, మీడియం పత్రికలు,చిన్న పత్రికల మధ్య వ్యత్యాసం ఉందని కొన్ని సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**అంగడి సరుకుగా మారిన అక్రిడిటేషన్లు**

తెలంగాణలో మీడియా అక్రిడిటేషన్ కార్డులు అంగడి సరుకుగా మారాయనే ఆరోపణలు గతంలో బలంగా వినిపించాయి.అర్హత లేని వారు, నకిలీ జర్నలిస్టులు కూడా ఈ కార్డులు పొంది ప్రయోజనాలు పొందుతున్నారనే విమర్శలు ఉన్నాయి.దీంతో వర్కింగ్ జర్నలిస్టులలో అసంతృప్తి పెరిగింది.గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని,ఈసారి ప్రభుత్వం ‘తెలంగాణ మీడియా అక్రిడిటేషన్ రూల్స్-2025‘ (జీవో 252,తర్వాత సవరణలతో జీవో 103) ద్వారా కొత్తమార్గదర్శకాలు జారీ చేసింది.ఇందులో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలనే ఉద్దేశ్యం స్పష్టంగా కనిపిస్తోంది.
అందులోకీలక అంశాలను పరిశీలిస్తే...ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా జర్నలిస్టులకు
సర్క్యులేషన్,నిరంతర ప్రచురణ వంటి స్పష్టమైన అర్హతలు నిర్ధారించారు.డెస్క్ జర్నలిస్టులకు మహిళలకు 33% రిజర్వేషన్ తప్పనిసరి చేశారు. వాహనాలపై ‘ప్రెస్‘ స్టికర్లు అధికారిక అక్రిడిటేషన్ ఉన్నవారికి మాత్రమే అనుమతి, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరిక చేశారు.ఈ నిబంధనలతో అక్రిడిటేషన్లు మరింత పారదర్శకంగా,అర్హులకే ఇవ్వాలనే ఆశాభావం కనిపిస్తుంది.గతంలో జరిగిన దుర్వినియోగాలను అరికట్టి, నిజమైన వర్కింగ్ జర్నలిస్టుల హక్కులను కాపాడాలనే డిమాండ్ జర్నలిస్టుల నుండి బలంగా వ్యక్తమవుతోంది.




**పారదర్శకత కోసం ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాలు**

ప్రభుత్వం అర్హులైన వారికే అక్రిడిటేషన్ ఇవ్వాలనుకుంటే,ఈ ప్రక్రియ పూర్తి పారదర్శకతతో ఉండాలంటే కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకకోవాలి. దరఖాస్తుల స్క్రూటినీని,కమిటీ నిర్ణయాలను ఆన్‌లైన్‌లో పబ్లిష్ చేయాలి.ఎవరికి ఎందుకు రిజెక్ట్ అయ్యిందో స్పష్టంగా తెలియజేయాలి.సంఘాలతో సంప్రదింపులు జరపాలి.జర్నలిస్ట్ యూనియన్ల సూచనలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలి.డెస్క్,ఫీల్డ్,డిజిటల్ జర్నలిస్టులందరినీ సమానంగా చూడాలి.వర్కింగ్ జర్నలిస్ట్ నిర్వచనం,సర్క్యులేషన్ ఆధారాలు,డిజిటల్ మీడియా రూల్స్ మరింత స్పష్టంగా ఉండాలి.అవాస్తవ సంస్థలు,ఫేక్ జర్నలిస్టులను ఫిల్టర్ చేయడానికి డాక్యుమెంట్ వెరిఫికేషన్ బలోపేతం చేయాలి.మీడియా సంస్థల,జర్నలిస్తుల అర్హతలు స్పష్టంగా ప్రదర్శించాలి.ప్రెస్ స్టికర్లు అక్రిడిటేషన్ ఉన్నవారికే అనుమతించడం మంచిదే,కానీ, అవి దుర్వినియోగం జరగకుండా చెక్ చేయాలి.ప్రస్తుతం అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తి స్వింగ్‌లో ఉంది.అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ (డెస్క్,ఫీల్డ్,డిజిటల్)పారదర్శకంగా కార్డులు ఇవ్వడమే జర్నలిజానికి ఆదర్శం.ఇది మీడియా స్వేచ్ఛకు,జర్నలిస్టుల గౌరవానికి బలం చేకూరుస్తుంది.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

## గెలుపు దిశగా విజిల్ గుర్తు

**ధర్మ ఘంట, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 08:**



జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ రెండవ వార్డులో ఎన్నికల వాతావరణం రోజురోజుకు ఉత్కంఠభరితంగా మారుతోంది. ఈ నేపథ్యంలో విజిల్ గుర్తు గెలుపు దిశగా దూసుకెళ్తున్నట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. వార్డులో నిర్వహించిన ఇంటింటి ప్రచారం, స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహనతో ఇచ్చిన హామీలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా యువత, మహిళల నుంచి విజిల్ గుర్తుకు బలమైన మద్దతు లభిస్తున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన నినాదాలతో కొనసాగుతున్న ప్రచారానికి ప్రజల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది. ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ క్యాతనపల్లి మున్సిపాలిటీ రెండవ వార్డులో విజిల్ గుర్తు ప్రధాన పోటీదారుగా అవతరించిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# చండూరు అభివృద్ధి కోసం వస్తున్నా.. ఆశీర్వదించండి!

**ఒక్క అవకాశం ఇవ్వండి..మార్పు చూపిస్తా!**
**6వ వార్డు,మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు**
**ధర్మ ఘంట,ఫిబ్రవరి 08 మర్రిగూడ :**





నల్లగొండ జిల్లా చండూరు మున్సిపాలిటీ సర్వతోముఖాభివృద్ధి చెందాలన్నా,6వ వార్డు సమస్యల సుడిగుండం నుండి బయటపడాలన్నా కావాల్సింది మాటలు చెప్పే వ్యక్తి కాదు..పని చేసే నాయకుడు.ఆ బాధ్యతను భుజానికెత్తుకోవడానికి మీ ముందుకు వస్తున్నానని 6వ వార్డు కౌన్సిలర్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కోడి శ్రీనివాసులు అన్నారు. ఆదివారం 6వ వార్డులో విస్తృతంగా పర్యటించారు.ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్న ఆయన,తనకు ఒక్క అవకాశం ఇచ్చి ఆశీర్వదించాలని కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....నేను మీలో ఒకడిని.మన వార్డు సమస్యలు నాకు తెలుసు.గత పాలకులు చేసిన అభివృద్ధి శూన్యం.ఒక్కసారి నాకు అవకాశం ఇచ్చి కౌన్సిలర్‌గా గెలిపిస్తే,6వ వార్డును చండూరులోనే నంబర్ వన్ వార్డుగా దిద్దుతానన్నారు.మున్సిపల్ చైర్మన్‌గా చండూరు రూపురేఖలు మార్తానని నా అభివృద్ధి ప్రణాళిక మీ ఇంటి గడప వద్దకే వస్తుందన్నారు.గెలిచిన వెంటనే పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్ల పనులను పూర్తి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.వార్డు ప్రజల ఉత్సాహాన్ని చూస్తుంటే కోడి శ్రీనివాసులు విజయం ఖాయమని ఆయన అనుచరులు వార్డు వాసులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.మీ అమూల్యమైన ఓటు చెయ్యి గుర్తుపై వేసి,నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించండి.మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధిని చేసి చూపిస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.